




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


హిమాచల్‌లో డాక్టర్ల సమ్మె

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌పై దిగ్విజయ్ ప్రశంసలు

05


సంపుటి 09, సంచిక: 31 | ఆదివారం | 28-12-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో సిపిఐ

సిపిఐ తన ప్రారంభ సంవత్సరాల్లో, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ (కొమింటర్న్)తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉంది. మార్క్సిజం–లెనిని జంను అవగాహన చేసుకోవటంలో, వలస, అర్ధవలస సమాజాలను విశ్లేషించటంలో, భారతదేశ పరిస్థితులకు అనువైన వ్యూహాలను అభి వృద్ధి పరుచుకోవటంలో భారతదేశ కమ్యూనిస్టు లకు సహాయకారిగా కొమింటర్న్ ముఖ్యమైన పాత్ర నిర్వర్తించింది.

– వ్యాసం 6లో

## ‘మహాత్మాగాంధీ నరేగా’ రద్దుపై కాంగ్రెస్

# దేశవ్యాప్త ఉద్యమం

### జనవరి 5 నుంచి ‘ఎంజి నరేగా బచావో అభియాన్’

- మోదీ చర్యపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు...
- ఎన్‌డిఎ సర్కార్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జు ఖర్గే హెచ్చరిక
- రాష్ట్రాలు, పేదలపై మోదీ ఏకపక్ష దాడి : రాహుల్






**న్యూఢిల్లీ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజినరేగా) రద్దుపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ దేశ వ్యాప్త ఉద్యమానికి సిద్ధమైంది. యుపిఎ హయాంలోని గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దును నిరసిస్తూ జనవరి 5న ప్రచారాన్ని ప్రారంభించనుంది. కేంద్ర ప్రభుత్వ చర్యపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, దీనికి నరేంద్ర మోదీ ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హెచ్చరించారు. 20 ఏళ్ల నాటి ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ స్థానంలో తీసుకొచ్చిన ‘విబి– జి రామ్ జి’ బిల్లు ఇటీవల ముగిసిన పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. ఈ కొత్త చట్టం గ్రామీణ కార్మికులకు 125 రోజుల వేతన ఉపాధికి అవకాశం కల్పిస్తుంది. కాగా, శనివారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ‘ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ బచావో అభియాన్’కు పార్టీ నాయకత్వం వహిస్తుందని చెప్పారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ కేవలం ఒక పథకం కాదని, అది రాజ్యాంగం కల్పించిన పని హక్కు అని ఆయన అన్నారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ రద్దుపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని,

తరువాయి 2లో



## ‘సంధ్య’ ఘటనలో

# చార్జిషీట్ ఫైల్

- అల్లు అర్జున్ వల్లే తొక్కిసలాట అని తేల్చిన పోలీసులు
- వ్యక్తిగత భద్రత,యాజమాన్య సిబ్బంది మధ్య సమన్వయలోపం
- ఏ1గా సంధ్య థియేటర్ యాజమాన్యం.. ఏ11గా అల్లు అర్జున్

ప్రజాపక్షం/హైదరాబాద్

“సంధ్య థియేటర్ పుష్ప 2 తొక్కిసలాట” ఘటనకు సినీ నటుడు అల్లు అర్జునే కారణమని పోలీసులు తమ అభియోగపత్రంలో (చార్జిషీట్) స్పష్టం చేశారు. ఆయన ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ రావడమే తొక్కిసలాటకు కారణమైందన్నారు. థియేటర్ యాజమాన్యం, నిర్వాహకులు, ప్రైవేటు భద్రతా సిబ్బంది మధ్య సమన్వయ లోపం దుర్ఘటనకు కారణమైందని తమ దర్యాప్తులో తేలినట్టు చిక్కడపల్లి పోలీసులు అభియోపత్రంలో పొందుపర్చారు. ‘సంధ్య థియేటర్ తొక్కిసలాటకు సంబంధించి కేసులో వంద పేజీలతో కూడిన అభియోగపత్రాన్ని చిక్కడపల్లి పోలీసులు

తరువాయి 2లో



## నిజామాబాద్‌లో

# దొంగల హల్‌చల్

- రెండు ఎటిఎంలలో రూ.30 లక్షలకు పైగా నగదు చోరీ
- కారులో వచ్చి గ్యాస్ కట్టర్‌తో చోరీ
- ఎటిఎం సంఘటన స్థలాలను పరిశీలించిన ఇన్‌చార్జి సిపి రాజేష్‌చంద్ర

ప్రజాపక్షం/నిజామాబాద్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో దొంగలు హల్‌చల్ చేశారు. రెండు ఎటిఎంలలో చోరీకి పాల్పడి దాదాపు రూ.30 లక్షల వరకు నగదు అపహరించారు. శనివారం తెల్లవారు జాము 3 గంటల 10 నిమిషాల సమయంలో కారులో వచ్చిన దొంగలు ఎటిఎం మిషన్లను ధ్వంసం చేసి నగదుతో ఉడాయించారు. జిల్లా కేంద్రంలోని ఐదవ టౌన్ పరిధిలోని వర్ని రోడ్డు చౌరస్తాలోని ఎస్‌బిఐ బ్యాంకు ఎటిఎంను గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను కట్ చేసి దాదాపు మూడు నుంచి

తరువాయి 12లో

## ఉపాధి హామీ రద్దును నిరసిస్తూ నేడు

# గ్రామ గ్రామాన ఆందోళనలు

టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్

ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి గాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ ఆదివారం గాంధీ చిత్ర పటాలతో గ్రామ గ్రామాన నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నో ఉద్యమాల ఫలితంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చడంతో పాటు అమలు బాధ్యతల నుంచి తప్పికునేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు, గ్రామీణ ప్రాంత కూలీలకు ఎంతో భరోసాగా ఉన్న

తరువాయి 2లో

## అత్యాచార బాధితురాలితో వివాహం

# దోషికి శిక్ష రద్దు

- వారిద్దరూ మళ్లీ కలుస్తారని ‘సిక్త్స్ సెన్స్’ చెప్పిందని ‘సుప్రీం’ వ్యాఖ్య
- మధ్యప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేసిన అప్పీల్‌పై కీలక తీర్పు



**న్యూఢిల్లీ :** అత్యాచారం కేసులో ఒక వ్యక్తికి విధించిన శిక్షను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఫిర్యాదుదారు, దోషి ఒకరినొకరు వివాహం చేసుకున్నారని, పార్టీల మధ్య ఏకాభిప్రాయ సంబంధానికి అపార్థం కారణంగా నేరం అనే రంగు పులుమబడిందని అత్యున్నత న్యాయ స్థానం గమనించింది. కేసులోని వాస్తవాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, సతీష్ చంద్ర శర్మ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ముందుకు ఈ విషయం వచ్చినప్పుడు ‘అప్పీల్‌దారు, బాధితురాలు తొలుత వివాహం విషయంలో తొలుత ఏకాభిప్రాయంతోనే ఉన్నా ఆ తర్వాత వచ్చిన విభేదాల కారణంగా కారణంగా అతడిపై కేసు నమోదు చేసినట్లు గమనించామని, అపార్థాల వల్ల విడిపోయిన వారిద్దరూ మళ్లీ కలుస్తారని భావించామని, ప్రతివాది ప్రాసిక్యూటర్ ఇద్దరూ మరొకరిని వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లయితే వారిని మరొకసారి ఒకచోట చేర్చవచ్చనే ‘సిక్త్ సెన్స్’ మాకు ఉంది’ అని ధర్మాసనం పేర్కొంది.దోషి బాధితురాలు ఇద్దరూ పెళ్లి చేసుకున్న

తరువాయి 2లో

## విజిబుల్ పోలీసింగ్‌తో

# నేరాలు తగ్గాయ్




- హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో గత ఏడాదితో పోలిస్తే 15 శాతం తగ్గిన క్రైమ్ రేటు
- నగరంలో ఈ ఏడాది 30,690 కేసులు నమోదు
- 2024-25 వార్షిక నివేదిక విడుదల చేసిన సిపి విసి.సజ్జనార్

ప్రజాపక్షం/హైదరాబాద్

విజిబుల్ పోలీసింగ్ విధానం ద్వారా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో గతేడాదితో పోలిస్తే 15 శాతం క్రైమ్ రేట్ తగ్గిందని సిపి విసి.సజ్జనార్ పేర్కొన్నారు. 2024లో మొత్తం 35,944 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 30,690 కేసులు నమోదయ్యాయని తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్‌లోని ఏడు జోన్ల పరిధిలో ఈ ఏడాది నమోదైన కేసులు, క్రైమ్ రేట్ వివరాలతో కూడిన 2025 వార్షిక నివేదికను శనివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అడిషనల్ సిపి ఎం.శ్రీనివాసులు, డిసిపిలతో కలిసి నగర సిపి విసి.సజ్జనార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సహకరంతో ఈ ఏడాది నగరంలో నిర్వహించిన పండుగలు ప్రశాంతంగా జరిగాయన్నారు. సిటీలో అల్లర్లు, గొడవలు సృష్టించే నేరస్థులపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. ప్రస్తుతం కమిషనరేట్ పరిధిలో 5.22 లక్షల సిసి కెమెరాలు ఉన్నాయని, రాబోయే రోజుల్లో డ్రోన్‌లను ఉపమోగించి ట్రాఫిక్ నియంత్రణ, దారి దోపిడీలు, నేరతీవ్రతను తగ్గించేందుకు కృషి చేస్తామన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది బాడిలీ అఫెన్సెస్ 2024లో 8,447 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 7,064 కేసులు నమోదై 16 శాతం, ప్రాపర్టీ అఫెన్సెస్ 2024లో 5,328 కేసులు నమోదు కాగా,

తరువాయి 2లో

## మోదీ సర్కార్

# ఎవరి పక్షం?

- పేదల కోసమా? అదానీ, అంబానీల కోసమా తేల్చాలి
- ప్రకృతి సంపదను కార్పొరేట్ వర్గాలకు దోచిపెట్టడం దుర్మార్గం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/పాల్వంచ

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకృతి సంపదను కార్పొరేట్ వర్గాలకు దోచిపెట్టడం అత్యంత దుర్మార్గమైన చర్య అని, మోదీ సర్కార్ ప్రజల కోసమా ? లేక అదానీ, అంబానీలాంటి కుబేరుల కోసమా అన్నది తేల్చాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్‌ల పేరుతో కొనసాగిస్తున్న నిర్బంధాలపై ప్రజా ఉద్యమాలు, తిరుగుబాటు తప్పవన్నారు. మతాలు, కులాల పేరుతో కాషాయం పార్టీ దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తూ ప్రజల మాన,

తరువాయి 2లో




## సిరియాలో మసీదుపై

# బాంబుదాడి

### 8 మంది మృతి



**ఇడ్లిబ్:** సిరియాలోని హౌమ్స్ నగరంలో ఉంటున్న ఇమామ్ అలీ ఇబ్న్ అబి తాలిబ్ మసీదులో జరిగిన బాంబు దాడిలో కనీసం 8 మంది మరణించగా, 18 మంది గాయపడ్డారు. ఈ ఘటన అలవైట్ సమాజ ఆధిపత్యం ఉన్న వాది అల్‌ధహబ్ ప్రాంతంలో జరిగింది. సిరియా అధికారిక వార్తా సంస్థ అరబ్ న్యూస్ ఏజెన్సీ విడుదల చేసిన వీడియోలో మసీదు మెట్లపై రక్తపు మరకలు కనిపిస్తున్నాయి. కిటికీలు ధ్వంసమయ్యాయి. సున్నా అన్సార్ సరాయాలు అనే అల్ప సంఖ్యాక సమూహం టెలిగ్రామ్‌లో సంఘటనకు తామే బాధ్యులమని ప్రకటించింది. ఈ సమూహం గతంలో డమాస్కస్ సమీపంలో గ్రీక్ ఆర్థడాక్స్ చర్చిపై దాడి చేసినట్టు చెప్పుకుంది. కాగా, ఈ దాడి సిరియాలో సంప్రదాయ సాంప్రదాయిక, విదేశీయ, రాజకీయ విభేదాలను ప్రతిబింబిస్తోంది. బష్షార్ అల్‌అస్సాద్ పతనం తర్వాత అలవైట్‌లపై లక్ష్యపెట్టిన హింస ఎక్కువైంది. సుప్రీమ్ అలవైట్ ఇస్లామిక్ కౌన్సిల్ దీన్ని ‘అలవైట్ సమాజాన్ని లక్ష్యంగా చేసుకున్న క్రమబద్ధమైన

తరువాయి 12లో

## శతాబ్ది ఉత్సవ సభకు

# విస్తృత ప్రచారం

### ర్యాలీలు, జాతాలు, సభలు, సమావేశాలు : కొనసాగుతున్న జనసేవాదళ్ శిక్షణ

CENTENARY OF STRUGGLES & SACRIFICES

ప్రజాపక్షం/ ఖమ్మం

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాలు జనవరి 18న ఖమ్మంలో జరగనున్న నేపథ్యంలో 18న జరిగే బహిరంగ సభకు ఖమ్మం జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అన్ని మండలాల్లో సభలు, సమావేశాలు, గోడ రాతలను పూర్తి చేయగా వినూత్న పద్ధతిలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా బహిరంగ సభ జయప్రదం కోరుతూ భారీ ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేయనున్నారు. జనవరి ఒకటి నాటికి అన్ని ప్రధాన గ్రామాలు, మండల కేంద్రాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని జిల్లా సమితి నిర్ణయించింది. జనవరి 12 నుంచి 16 వరకు అన్ని మండలాల్లో మైకుల ద్వారా ప్రచారం నిర్వహించాలని ఇందుకు సంబంధించి ప్రచార ఆడియోను కూడా విడుదల చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా

తరువాయి 12లో




## భావజాలాలకు వేదిక బుక్ ఫెయిర్

బుక్ ఫెయిర్‌ను సందర్శించిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, మాజీ గవర్నర్ దత్తాత్రేయ



03



# ప్రపంచం
WORLD NEWS

## 17 ఏళ్ల తర్వాత ఓటరుగా బిఎన్‌పి నేత తారిఖ్ రెహమాన్

**ఢాకా/న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) కార్యనిర్వాహక అధ్యక్షుడు తారిఖ్ రెహమాన్ (60) 17 సంవత్సరాల స్వీయ అజ్ఞాతవాసాన్ని ముగించుకొని, ఓటరుగా నమోదు అయ్యారు. లండన్‌లో 17 ఏళ్లకు పైగా ఉన్న ఆయన, ఇటీవల బంగ్లాదేశ్‌కు తిరిగివచ్చిన రెండు రోజులకే ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకుని జాతీయ గుర్తింపు కార్డు (ఎన్‌ఐడి) పొందేందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేశారు. ఢాకాలోని ఎన్నికల సంఘం (ఇడి) కార్యాలయాన్ని కఠిన భద్రత మధ్య సందర్శించిన తారిక్ రెహమాన్ బయోమెట్రిక్ నమోదు కోసం వేలిముద్రలు, కంటి ఐరిస్ స్కానింగ్ చేశారు. ఇప్పటికే ఆయన ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించారని ఇడి అధికారులు తెలిపారు. 24 గంటల్లో ఎన్‌ఐడి కార్డు అందే అవకాశం ఉందని ఇడి జాతీయ గుర్తింపు నమోదు విభాగం డైరెక్టర్ జనరల్ ఎఎస్ఎం హుమాయున్ కబీర్ వెల్లడించారు. తారిక్ రెహమాన్ కుమార్తె జైమా కూడా ఎన్‌ఐడి నమోదు పూర్తి చేశారు.

### అంతర్జాతీయ సహాయ నిధుల కోత..
# అఫ్ఘానిస్తాన్‌లో ఆకలి కేకలు



**కాబూల్:** అంతర్జాతీయ సహాయ నిధులు గణనీయంగా తగ్గిపోవడంతో అఫ్ఘానిస్తాన్‌లో లక్షలాది మంది తీవ్రమైన ఆకలి, పేదరికంతో పోరాడుతున్నారు. దేశ జనాభాలో సగానికి దగ్గరగా ఉన్న సుమారు 2.29 కోట్ల మందికి 2025లో మానవతా సహాయం అవసరమని అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ వెల్లడించింది. అయితే అమెరికా సహా పలు దేశాలు సహాయాన్ని నిలిపివేయడంతో, ఐక్యరాజ్యసమితి వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ (డబ్ల్యుఎఫ్‌పి) నిర్వహించే ఆహార పంపిణీ వంటి కీలక కార్యక్రమాలు నిలిచిపోయాయి. ఫలితంగా ఈ శీతాకాలంలో 1.7 కోట్ల మందికి పైగా ప్రజలు తీవ్రమైన ఆకలి స్థాయిని ఎదుర్కొంటున్నారని డబ్ల్యుఎఫ్‌పి హెచ్చరించింది. ఇది ఏడాది క్రితం కంటే 30 లక్షలు ఎక్కువ. బలహీన ఆర్థిక వ్యవస్థ, పునరావృత కరువులు, ఘోర భూకంపాలు, ఇరాన్, పాకిస్థాన్ వంటి దేశాల నుంచి వెనుదిరిగిన లక్షలాది శరణార్థులు కలిసి దేశ వనరులపై తీవ్ర ఒత్తిడి తెచ్చాయి. కాగా, ఐక్యరాజ్యసమితి మానవతా విభాగాధిపతి టామ్ ఫ్లెచర్ మాట్లాడుతూ, దాదాపుగా అంతర్జాతీయ ఆహార పంపిణీ లేని శీతాకాలం ఇటీవలి సంవత్సరాల్లో ఇదే మొదటిదని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకూ, కేవలం 10 లక్షల మందికే ఆహార సహాయం అందిందని, గత ఏడాది ఇది 56 లక్షలుగా ఉందని చెప్పారు. కాబూల్‌లో రోజుకు 10 గంటలు బండిపై చిరు బండారాలు అమ్ముకుంటూ కేవలం 4.5 నుంచి 6 డాలర్లు సంపాదించే రహీముల్లా (29) వంటి వారు ఈ సంక్షోభానికి ప్రత్యక్ష ఉదాహరణ. ఐదుగురు కుటుంబ సభ్యులను పోషించడానికి అది చాలడం లేదని ఆయన వాపోయారు. శరణార్థిగా పాకిస్థాన్‌కు వెళ్లి తిరిగొచ్చిన తర్వాత మొదట్లో అందిన సహాయం ఆగిపోవడంతో జీవనం మరింత కష్టంగా మారిందన్నారు. ఇళ్ల అద్దెలు రెట్టింపు కావడంతో నివాసం కూడా కోల్పోయే పరిస్థితి ఎదురైంది. ఉత్తర అఫ్ఘానిస్తాన్‌లోని బదఖ్షాన్ ప్రావిన్స్‌లో షెరిన్ గుల్ కుటుంబం పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. 12 మంది కుటుంబానికి గతంలో అందిన ఆహార సరఫరా ఆరు నెలలకే ముగిసింది. మహిళల ఉద్యోగంపై నిషేధం ఉండటంతో ఆమె కూడా పనిలేకుండా పోయింది. కొన్నిసార్లు పిల్లలు ఆకలితోనే నిద్రపోతున్నారని, వారికి టీ తప్ప ఇంకేమీ ఇవ్వలేకపోతున్నామని ఆమె అసోసియేట్ ప్రెస్‌తో మాట్లాడుతూ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇలావుంటే, వచ్చే ఏడాది మానవతా సహాయం మరింత తగ్గే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో, ఆహార అసురక్షితత, ఆరోగ్య అవసరాలు, ప్రాథమిక సేవలపై ఒత్తిడి పెరుగుతున్న వేళ అంతర్జాతీయ మద్దతు అత్యవసరమని మానవతా సంస్థలు కోరుతున్నాయి.

### థాయిలాండ్, కాంబోడియా మధ్య
# కాల్పుల విరమణ ఒప్పందం




**బ్యాంకాక్:** సరిహద్దు విషయంలో నెలకొన్న వివాదం కారణంగా గత కొన్ని వారాల పాటు సాగిన పరస్పర దాడులకు, సాయుధ ఘర్షణలకు ముగింపు పలుకుతూ థాయిలాండ్, కాంబోడియా దేశాలు కొత్త కాల్పుల విరమణ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం స్థానిక కాలమానం ప్రకారం శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం రెండు దేశాలు ఇకపై సైనిక చర్యలు నిలిపివేయాలి. ఎటువంటి అదనపు సైనిక కదలికలు చేపట్టకూడదు. అలాగే ఒకరి గగనతలాన్ని మరొకరు సైనిక అవసరాల కోసం ఉల్లంఘించరాదని స్పష్టంగా పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పోరాటాల్లో కాంబోడియాలోని కొన్ని ప్రాంతాలపై వైమానిక దాడులు జరిపినట్లు థాయిలాండ్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. కాగా, ఒప్పందంలోని మరో కీలక అంశం ప్రకారం, కాల్పుల విరమణ 72 గంటలు పూర్తిగా కొనసాగిన తర్వాత థాయిలాండ్ తన అదుపులో ఉన్న 18 మంది కాంబోడియా సైనికులను స్వదేశానికి పంపించాలి. ఈ సైనికులు జులైలో జరిగిన ఘర్షణల సమయంలో పట్టుబడ్డారని, వారి విడుదల కాంబోడియా ప్రధాన డిమాండ్‌గా ఉన్నట్లు సమాచారం. ఇరు దేశాలు జులైలో ఐదు రోజులపాటు జరిగిన యుద్ధాన్ని నిలిపివేసిన పూర్వపు కాల్పుల విరమణ ఒప్పందాలకు కట్టుబడి ఉన్నట్లు తాజా ఒప్పందంలో పేర్కొన్నారు. ఆ ఒప్పందానికి మలేషియా మధ్యవర్తిత్వం వహించగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య సడలింపులు నిలిపివేస్తామని హెచ్చరించడం ద్వారా కీలక పాత్ర పోషించారు. అనంతరం అక్టోబర్‌లో మలేషియాలో జరిగిన ప్రాంతీయ సమావేశంలో ఆ ఒప్పందాన్ని మరింత స్పష్టంగా రూపకల్పన చేశారు. అయితే ఆ ఒప్పందాల తర్వాత కూడా ఇరు దేశాల మధ్య ప్రచార యుద్ధం, స్వల్ప సరిహద్దు ఘర్షణలు కొనసాగాయి. ఈ నెల మొదటి వారంలో తీవ్ర స్థాయికి చేరాయి. తాజా కాల్పుల విరమణ ఒప్పందంతో పరిస్థితి సాధారణ స్థితికి వస్తుందని అంతర్జాతీయ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## బంగ్లాదేశ్‌లో జేమ్స్ సంగీత కచేరీ రద్దు
### మూక దాడిలో 20 మందికి గాయాలు

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో ప్రముఖ రాక్ గాయకుడు జేమ్స్ నిర్వహించాల్సిన సంగీత కచేరీపై గుంపు దాడి జరగడంతో కనీసం 20 మంది విద్యార్థులు గాయపడ్డారని అధికారులు, నిర్వాహకులు తెలిపారు. ఈ ఘటన కారణంగా కచేరీని రద్దు చేయాల్సి వచ్చింది. జేమ్స్ హిందీ సినిమాల్లోనూ పలు హిట్ పాటలు పాడారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి ఫరీద్‌పూర్‌లో జరిగింది. ఇటీవల దేశంలో సాంస్కృతిక సంస్థలపై వరుస దాడులు జరుగుతున్న క్రమంలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. ఇటీవలి వారాల్లో ఢాకాలోని ఛాయానాట్, ఉదీచీ శిల్పి గోష్టి వంటి సంస్థలు ధ్వంసానికి గురయ్యాయి. ఫరీద్‌పూర్ జిల్లా పాఠశాల 185వ వార్షికోత్సవ ముగింపు సందర్భంగా జేమ్స్ కచేరీ నిర్వహించాల్సి ఉంది. పాఠశాల ప్రాంగణంలో తాత్కాలిక వేదికపై రాత్రి ఆలస్యంగా ఈ కార్యక్రమం జరగాల్సి ఉందని పాఠశాల వర్గాలు తెలిపాయి. అయితే కార్యక్రమం ప్రారంభానికి కొద్దిసేపటి ముందు బయట నుంచి వచ్చిన కొందరు లోపలికి బలవంతంగా ప్రవేశించేందుకు ప్రయత్నించారు. భద్రతా సిబ్బంది నిలువరించడంతో వారు ఇటుకలు, రాళ్లు విసిరి వేదికను ఆక్రమించేందుకు యత్నించారు. పాఠశాల విద్యార్థులు దాడి చేసిన వారిని అడ్డుకోగా, ఎగిరివచ్చిన రాళ్ల వల్ల కనీసం 20 మంది గాయపడ్డారని నిర్వాహకులు తెలిపారు. అయితే గాయపడిన వారి ఖచ్చిత సంఖ్య ఇంకా నిర్ధారణ కాలేదని దనపు పోలీసు సూపరింటెండెంట్ (సదర్ సర్కిల్) అజ్మీర్ హొస్సైన్ అన్నారు. 'దాడిలో గాయపడిన వారి సంఖ్య ఇంకా తెలియలేదు. వివరాలు సేకరిస్తున్నాం' అని ఆయన అన్నారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు నిర్వాహక కమిటీ కన్వీనర్ ముస్తాఫిజుర్ రహ్మాన్ షమీమ్ తెలిపారు అని 'ది డైలీ స్టార్' పత్రిక పేర్కొంది. నగర్ బౌల్ అనే బంగ్లాదేశీ రాక్ బ్యాండ్‌కు ప్రధాన గాయకుడు, గీత రచయిత, గిటారిస్ట్ అయిన జేమ్స్, 'గ్యాంగ్‌స్టర్', 'వో లమ్హే' వంటి పలు బాలీవుడ్ హిట్ చిత్రాల్లో పాటలు పాడారు. కాగా, కార్యక్రమ ప్రచార, మీడియా ఉపసమితి కన్వీనర్ రాజీబుల్ హసన్ ఖాన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, దాడి వెనుక కారణాలు ఇంకా స్పష్టంగా తెలియలేదన్నారు. జేమ్స్ కచేరీపై ఎవరు, ఎందుకు దాడి చేశారో అర్థం కావడం లేదన్నారు. మొత్తం పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని జిల్లా పరిపాలన ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని రద్దు చేయాల్సి వచ్చింది అని ఆయన చెప్పారు.

## సోమాలీలాండ్ గుర్తింపునకు ఆఫ్రికన్ యూనియన్ తిరస్కరణ






**నైరోబీ (కెన్యా):** సోమాలియా నుంచి విడిపోయిన ప్రాంతమైన సోమాలీలాండ్‌ను స్వతంత్ర దేశంగా ఇజ్రాయెల్ గుర్తించిన చర్యను తప్పుపడుతూ, ఆఫ్రికా ప్రాంతీయ పాలనా సంస్థలతో కూడిన ఆఫ్రికన్ యూనియన్ (ఎయు) శనివారం ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. గత 30 ఏళ్లకు పైగా ఏ దేశం కూడా సోమాలీలాండ్‌ను గుర్తించని పరిస్థితిలో, ఇజ్రాయెల్ తొలి దేశంగా ముందుకు రావడం వివాదాస్పదమైంది. 1991లో సోమాలియా అంతర్యుద్ధం నేపథ్యంలో సోమాలీలాండ్ స్వతంత్రత ప్రకటించింది. స్వంత ప్రభుత్వం, కరెన్సీ ఉన్నప్పటికీ అంతర్జాతీయంగా గుర్తింపు పొందలేదు. ఈ నేపథ్యంలో ఎయు చైర్‌పర్సన్ మహ్మూద్ అలీ యూసుఫ్ స్పందిస్తూ, సోమాలియా సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే ఏ ప్రయత్నమైనా ఆఫ్రికా ఖండంలోని శాంతి, స్థిరత్వానికి ముప్పుగా మారుతుందని హెచ్చరించారు. సోమాలీలాండ్ అనేది సోమాలియా ఫెడరల్ రిపబ్లిక్‌లో అవిభాజ్య భాగమేనని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఇజ్రాయెల్ చర్యను సోమాలియా కేంద్ర ప్రభుత్వం కూడా శుక్రవారం తీవ్రంగా ఖండించింది. దీనిని చట్టవిరుద్ధ చర్య అని పేర్కొంటూ, ఉత్తర ప్రాంతమైన సోమాలీలాండ్ తమ దేశ సార్వభౌమ భూభాగంలో భాగమేనని పునరుద్ఘాటించింది. ఇలావుంటే, ఇజ్రాయెల్ అకస్మాత్తుగా సోమాలీలాండ్‌ను గుర్తిస్తున్నట్టు ఎందుకు ప్రకటన చేసిందన్న దానిపై స్పష్టత లేదని అంతర్జాతీయ వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో, అబ్రహామ్ ఒప్పందాల స్ఫూర్తితో సోమాలీలాండ్ అధ్యక్షుడు అబ్దిరహ్మాన్ మహ్మద్ అబ్దుల్లాహితో కలిసి సంయుక్త ప్రకటనపై సంతకాలు చేసినట్లు వెల్లడించింది. ఈ ఒప్పందాలకు అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో మధ్యవర్తిగా ఉన్న ఈజిప్ట్ కూడా ఇజ్రాయెల్ నిర్ణయాన్ని తిరస్కరిస్తూ, సోమాలియా ఏకత్వం, భౌగోళిక సమగ్రతకు పూర్తి మద్దతు ప్రకటించింది. తూర్పు ఆఫ్రికా ప్రాంతీయ సంస్థ ఐజిఎడి కూడా సోమాలియా సార్వభౌమత్వం అంతర్జాతీయ చట్టాల ద్వారా గుర్తించబడిందని పేర్కొంది. ఐక్యరాజ్యసమితి, ఆఫ్రికన్ యూనియన్ చార్టర్లకు విరుద్ధంగా ఏకపక్ష గుర్తింపులు చెల్లవని స్పష్టం చేసింది.

## ఆందోళనలు
(మొదటి పేజీ తరువాయి)

ఈ పథకాన్ని రద్దుకు నిరసనగా జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవమైన నేడు రాష్ట్ర వ్యాప్తంగా గాంధీ విగ్రహాల వద్ద, గాంధీ చిత్రపటాలతో నిరసన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండ ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి, పనికి ఇచ్చే గౌరవాన్ని ప్రజలకు వివరించనున్నట్లు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

## చార్జిషీట్ ఫైల్
(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో సమర్పించారు. ఈ కేసులో మొత్తం 23 మందిపైన అభియోగాలు మోపారు. ఇందులో ఏ1గా సంధ్య థియేటర్ యాజమాన్యం, ఏ11గా అల్లు అర్జున్ ఉన్నారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై సమగ్రమైన, వివరణాత్మక దర్యాప్తు నిర్వహించామని, మూడు రోజుల క్రితం కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసినట్టు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం శనివారం వెల్లడించింది. కాగా ఈ కేసులో థియేటర్ భద్రతా లోపాలను కూడా గుర్తించారు.

**అల్లు అర్జున్ రాకతోనే తొక్కిసలాట..**

గత డిసెంబర్ 4న పుష్ప2 సినిమా బెనిఫిట్ షో కోసం హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌కు అల్లు అర్జున్ రావడమే తొక్కిసలాటకు కారణమని పోలీసులు తేల్చారు. ఆయన థియేటర్ వద్దకు రాగానే కారు రూఫ్ ఎక్కి చేయి ఊపుతూ అభివాదం చేయడం వల్ల ఆయనను చూసేందుకు అభిమానులు ఎగబడటంతో తొక్కిసలాట జరిగిందని, ఈ ఘటనలో రేవతి(35) అనే మహిళ ప్రాణాలు కోల్పోగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డారని, అలాగే మరికొందరు స్వల్పంగా గాయపడ్డారని అభియోగపత్రంలో పొందుపర్చారు.

ఈ ఘటనలో 2024, డిసెంబర్ 13న అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత ఆయనకు నాంపల్లి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించగా అల్లు అర్జున్‌ను చంచల్‌గూడ్ జైలుకు తరలించారు. అయితే అదే రోజు హైకోర్టు అల్లు అర్జున్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో ఆయనను మరుసటి రోజు ఉదయం విడుదలైన విషయం తెలిసిందే.

**సంధ్య థియేటర్ కేసులో నిందితులు వీరే....:**

ఏ1: ఆగమతి రామ్ రెడ్డి (పెద్ద రామ్ రెడ్డి) భాగస్వామి (సంధ్య థియేటర్ యజమాని)
ఏ2: ఆగమతి రామ్ రెడ్డి (చిన్న రామ్ రెడ్డి) సంధ్య థియేటర్ భాగస్వామి
ఏ3: ఎం.సందీప్ సంధ్య థియేటర్ భాగస్వామి
ఏ4: ఎం. సుమిత్ (మిట్టు) సంధ్య థియేటర్ భాగస్వామి
ఏ5: ఆగమతి వినయ్ కుమార్ సంధ్య థియేటర్ భాగస్వామి
ఏ6: ఆగమతి అశుతోష్ రెడ్డి సంధ్య థియేటర్ భాగస్వామి
ఏ7: ఎం.రేణుకా దేవి సంధ్య థియేటర్ భాగస్వామి
ఏ8: ఆగమతి అరుణ రెడ్డి సంధ్య థియేటర్ భాగస్వామి
ఏ9: ఎం. నాగరాజు మేనేజర్, సంధ్య థియేటర్
ఏ10: గంధకం విజయ్ చందర్ లోయర్ బాల్కనీ ఇన్‌చార్జ్ ,గేట్ కీపర్
ఏ11: అల్లు అర్జున్ (బన్నీ) సినీ నటుడు
ఏ12: జోస్య భట్ల సంతోష్ కుమార్ అల్లు అర్జున్ మేనేజర్
ఏ13: శరత్ బన్నీ (శరత్ చంద్ర నాయుడు) అల్లు అర్జున్ మేనేజర్
ఏ14: తాటిపాముల వినయ్ కుమార్ (అర్జున్ కుమార్) ఫ్యాన్స్ అసోసియేషన్ ఇన్‌చార్జ్
ఏ15: ఎండి. పర్వేజ్
ఏ16: తాళ్ల కిరణ్ కుమార్ గౌడ్ (రాజు) ఈవెంట్ ఆర్గనైజర్/ఎలక్ట్రీషియన్
ఏ17: చెరుకు రమేష్ అల్లు అర్జున్ పర్సనల్ సెక్యూరిటీ గార్డ్
ఏ18: శ్రీరాముల రాజు అల్లు అర్జున్ పర్సనల్ సెక్యూరిటీ గార్డ్
ఏ19: ఇబ్రహీం మొహమ్మద్ ఫిర్దోష్ బౌన్సర్
ఏ20: ఆజం పాషా (బాబీ) బౌన్సర్
ఏ21: డి. మహేష్ బౌన్సర్
ఏ22: రాజ్ ఆంటోనీ డిమెల్లో (ఆంటోనీ) బౌన్సర్
ఏ23: పెగ్గాపురం సత్యమూర్తి బౌన్సర్

## దేశవ్యాప్త ఉద్యమం
(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. 'సిడబ్ల్యుసి సమావేశంలో, ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎను కేంద్ర బిందువుగా చేసుకుని ఒక ప్రచారాన్ని ప్రారంభిస్తామని మేము ప్రతిజ్ఞ చేశాము. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వహించి జనవరి 5 నుండి 'ఎంజిఎన్ ఆర్‌ఇజిఎ బచావో అభియాన్'ను ప్రారంభిస్తుంది' అని ఖర్గే అన్నారు. 'విబి– జి రామ్ జి' చట్టం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వ్యయ పంపిణీ నిబంధనను ప్రస్తావిస్తూ, ఈ నిర్ణయం వల్ల రాష్ట్రాలపై అదనపు వ్యయ భారం పడుతుందని కాంగ్రెస్ అధినేత అన్నారు. ఇది సంప్రదింపులు లేకుండా తీసుకున్న ఏకపక్ష నిర్ణయమని అభివర్ణించారు. 'ఈ చట్టం పేదలను అణచివేయడానికి తీసుకురాబడింది; మేము దీనిపై వీధుల్లో పార్లమెంట్‌లో పోరాడతాము' అని ఆయన అన్నారు.

**రాష్ట్రాలు, పేదలపై మోదీ ఒంటరిగా దాడి : రాహుల్**

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 'విబి– జి రామ్ జి' చట్టం చట్టంపై కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. పెద్దనోట్ల రద్దు మాదిరిగానే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక్కరే రాష్ట్రాలపై, పేదలపై వినాశకరమైన దాడి చేశారని ఆరోపించారు.



మొత్తం ప్రతిపక్షం తమతో కలిసి ఉంటుందని విశ్వసిస్తున్నానన్నారు. యుపిఎ హయాంలోని ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ కేవలం ఒక పని కార్యక్రమం మాత్రమేకాదని, ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిన ఒక అభివృద్ధి నమూనా అని రాహుల్ పేర్కొన్నారు. దాని రద్దు హక్కుల ఆధారిత విధానంపై, దేశ సమాఖ్య స్ఫూర్తిపై దాడి అని ఆరోపించారు. 'ఇది పెద్ద నోట్ల రద్దు మాదిరిగానే, ప్రధాన మంత్రి ఒక్కరే రాష్ట్రాలపై, పేదలపై చేసిన వినాశకరమైన దాడి. ప్రధానమంత్రి తన క్యాబినెట్‌ను అడగకుండా, ఈ విషయాన్ని అధ్యయనం చేయకుండా ఒక్కరే ఎంజినరేగాను నాశనం చేశారు' అని ఆయన అన్నారు.

ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యను కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని, మొత్తం ప్రతిపక్షం తమతో కలిసి వస్తుందనే నమ్మకం ఉందని వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి తన క్యాబినెట్‌ను అడగకుండా, ఈ విషయాన్ని అధ్యయనం చేయకుండా ఒక్కరే ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎను నాశనం చేశారని విమర్శించారు. జనవరి 5న దేశవ్యాప్తంగా ప్రారంభించనున్న కాంగ్రెస్ 'ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ బచావో అభియాన్'ను ప్రస్తావిస్తూ, తాము దీనిని ప్రతిఘటించబోతున్నామన్నారు.

## ఎవరి పక్షం?
(మొదటి పేజీ తరువాయి)

ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నదని మండిపడ్డారు. కమ్యూనిస్టులను లేకుండా చేయాలనే కుట్రతో కేంద్రంలోని పాలకులు యోచిస్తున్నారని, అందుకే మావోయిస్టులను డెడ్‌లైన్ పెట్టి మరీ చంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అడవుల్లో నిక్షిప్తమైన అపార సహజ సంపదను కాజేసేందుకు, కొల్లగొట్టేందుకు అధికారాన్ని అడ్డం పెట్టుకొని బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ మావోయిస్టు నేతలను చంపటం సరైనది కాదని హితవు పలికారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ముందుకు వచ్చినప్పటికి పట్టించుకోకుండా ఏకపక్షంగా మారణ హోమానికి తెగబడటం పైశాచికమన్నారు.

మావోయిస్టుల హత్యలపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఖమ్మం కేంద్రంగా జనవరి 18న, ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ఐదు లక్షల మందితో జరుగనుందన్నారు. దీనికి 45 దేశాల నుండి ప్రతినిధులు రానున్నారని పేర్కొన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే బారీ జన సభకు గడప, గడపకూ తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టుల పనైపోయిందని అవాకులు, చెవాకులు పేలుతున్న వారికి ఈ వేడుక కనువిప్పు కావాలన్నారు. ఈ సభ దేశ చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిపోనున్నదని అన్నారు.

**హామీలను అమలు చేయాలి :** పాలక ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన హామీలను నిలుపుకొంటూ అమలు చేయాలని లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు.

గడిచిన స్థానిక సంస్థల ఎన్నికలలో సిపిఐ ఒంటరి పోరు చేసి విజయ తీరాలకు చేరిందని, సిపిఐని నిలువరించాలనే కుట్రలు చసిన వారికి తీవ్ర నిరాశే మిగిందన్నారు. ఎర్రజెండా పనైపోయిందని కారుకూతలు కూసే వారికి గ్రామ పంచాయితీ ఎన్నికలు చెంపపెట్టని, సిపిఐని లేకుండా చేద్దామని చూసిన అనేక పార్టీలు కాలగర్భంలో కలిశాయని గుర్తు చేశారు. అధికారం, పదవులు లేకున్నా ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని, ప్రజలను నమ్మించి మోసం చేసే పాలకులను నిలదీస్తామన్నారు. చంద్ర నరేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు మిరియాల రంగయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, వై. ఉదయ్ భాస్కర్, మున్నా లక్ష్మికుమారి, కే. సారయ్య, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళి, రేసు ఎల్లయ్య, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, జి. వీరస్వామి, భూక్యా దస్రు, బంధం నాగయ్య, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్‌కే. ఫహీం. మండల, పట్టణ కార్యదర్శులు, ప్రజా సంఘాల జిల్లా బాద్యులు తదితరులు పాల్గొన్నారు.

## దోషికి శిక్ష రద్దు
(మొదటి పేజీ తరువాయి)

కారణంగా అతడిపై ఉన్న ఫిర్యాదును, శిక్షను రద్దు చేస్తున్నామని ధర్మాసనం వివరించింది.ఈ ఏడాది జులైలో పార్టీలు ఒకరినొకరు పెళ్లి చేసుకున్నారని, అప్పటి నుండి కలిసి నివసిస్తున్నారని ధర్మాసనం తెలిపింది.'ఈ కోర్టు జోక్యంతో తన శిక్షను నిలిపివేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్న అప్పీల్‌దారుడు, చివరికి తన నేరారోపణను, శిక్షను రద్దు చేయడం ద్వారా ప్రయోజనం పొందిన అరుదైన కేసులలో ఇది ఒకటి' అని డిసెంబరు 5న ఇచ్చిన తీర్పులో ధర్మాసనం పేర్కొంది. శిక్షను నిలిపివేయాలని కోరుతూ ఏప్రిల్ 2024న మధ్యప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆ వ్యక్తి చేసిన అప్పీల్‌పై సుప్రీం కోర్టు ఈ తీర్పు వెలువరించింది. ఈ కేసులో ట్రయల్ కోర్టు ఆ వ్యక్తిని దోషిగా నిర్ధారించి రూ.55,000 జరిమానా విధించడంతోపాటు 10ఏళ్ల కఠినకారాగార శిక్ష విధించింది. అత్యున్నత న్యాయస్థానం ధర్మాసనం ప్రకారం...'అప్పీల్‌దారు మహిళతో వారి తల్లిదండ్రుల సమక్షంలోనే మాట్లాడారు. వారు ఒకరినొకరు వివాహం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కాగా,అప్పీల్‌దారుకు వారిమధ్య వివాహానికి బెంచ్ మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జులైలో ఇరు పార్టీల మధ్య వివాహం జరిగింది. దీంతో వారి తల్లిదండ్రులు కూడా ఈ పరిణామాలతో సంతోషపడ్డారు' అని వివరించింది. 'తత్ఫలితంగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద మా అధికారాలను ఉపయోగించి ఈ విషయంలో పూర్తి న్యాయం చేయడానికి ఫిర్యాదును, అప్పీల్‌దారుపై విధించిన శిక్షను రద్దు చేశాం' అని న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మలతో కూడిన ధర్మాసనం వెల్లడించింది. ఒక అపార్థం కారణంగా పార్టీల మధ్య ఏకాభిప్రాయ సంబంధానికి క్రిమినల్ రంగు పులుమబడిందని వివాహం యొక్క తప్పుడు వాగ్దానం యొక్క నేరంగా మార్చబడిందని తాము భావిస్తున్నామని, అయితే పార్టీలు ఒకరినొకరు వివాహం చేసుకోవాలని అనుకున్నాయని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. అప్పీల్‌దారుడు 2015లో సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్‌లో ఆ మహిళను కలిశాడని, ఇద్దరూ ఒకరిపై మరొకరు ఇష్టాన్ని పెంచుకున్నారని సుప్రీంకోర్టు తెలియజేసింది. ఆ తర్వాత వారిరువురూ పరస్పర అంగీకారంతో శారీరక సంబంధం పెట్టుకున్నారని, అప్పీల్‌దారు ఇచ్చిన పెళ్లి హామీ మేరకు తాను అలా ప్రవర్తించినట్లు ఆ మహిళ పేర్కొంది. ధర్మాసనం ప్రకారం...వివాహం తేదీని వాయిదా వేయాలని అప్పీలెంట్ కోరడంతో ఆమెను అభద్రతా భావంలోకి నెట్టివేసి ఉండబడవచ్చు అని, ఈ నేపథ్యంలో ఆమె ఆయనపై క్రిమినల్ కంప్లైంట్ దాఖలు చేసి ఉండవచ్చని తెలియజేసింది. 2021 నవంబరులో ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది. ఆ తర్వాత ట్రయల్ కోర్టు గత ఏడాది ఏప్రిల్‌లో ఆ వ్యక్తిని దోషిగా నిర్ధారించింది.

## నేరాలు తగ్గాయ్
(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాది 3,817 కేసులు నమోదై 28 శాతం, గ్రేవ్ ప్రాపర్టీ అఫెన్సెస్ 2024లో 315 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 217 కేసులు నమోదై 31 శాతం, అట్రాసిటీ కేసులు 2024లో 175 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 128 కేసులు నమోదై 27 శాతం తగ్గాయని, మహిళలపై దాడులు 2024లో 2,482 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 2,625 కేసులు నమోదై 6 శాతం, చిన్నారులపై దౌర్జన్యాలు 2024లో 449 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 568 కేసులు నమోదై 27 శాతం పెరిగాయని తెలిపారు.

సైబర్ క్రైమ్‌లో గతేడాది 4,042 కేసులు నమోదు కాగా, ఈ సారి 3,735 కేసులు నమోదై 8 శాతం తగ్గాయన్నారు.

**ట్రాఫిక్ నియంత్రణ, ర్యాష్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి..**

నగరంలో ప్రతి యేటా వాహనాల సంఖ్య పెరుగుతుందని సిపి తెలిపారు. పెరుగుతున్న కాలుష్యం, ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రజలు ప్రభుత్వ ట్రాన్స్‌పోర్టు సదుపాయాన్ని వినియోగించుకోవాలని, ఒకే కంపెనీ, ఒకే ప్రాంతానికి వెళ్లే వారు కారు పుల్లింగ్ విధానం ఉపయోగించాలని సిపి కోరారు. ముఖ్యంగా మైనర్ పిల్లలకు తమ తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని హెచ్చరించారు. ఈ ఏడాది ర్యాష్ డ్రైవింగ్‌పై కొరఢా ఝుళిపించామని, హెల్మెట్ ధరించని వారిపై 41,28,590 కేసులు, రాంగ్ సైడ్ డ్రైవింగ్ 6,07,297 కేసులు, డేంజరస్ డ్రైవింగ్ 2,34,929 కేసులు, సెల్ ఫోన్ డ్రైవింగ్ 1,26,140 కేసులు, డ్రంకన్ డ్రైవ్ 49,732 కేసులు, మైనర్ డ్రైవింగ్ 7,808 కేసులు నమోదు చేశామన్నారు.

**అవగాహన పెరిగింది..సైబర్ క్రైమ్ తగ్గింది..**

సైబర్ క్రైమ్ కేసులు గతేడాది 4,042 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 3,735 కేసులు నమోదయ్యాయని సిపి వెల్లడించారు. ముఖ్యంగా ప్రజల్లో సైబర్ నేరాల పట్ల పెరుగుతున్న అవగాహన కేసుల తగ్గుదలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు.

ఈ మధ్య కాలంలో ఆన్‌లైన్ బెట్టింగ్ అధికమై చాలా మంది అర్థాంతరంగా ప్రాణాలు విడిచిపెతున్నారని, అత్యాశకు మనిషి దూరం గా ఉండాలని సూచించారు. డబ్బులు ఉరికే రావని నొక్కిచెప్పారు.

**మాయమైపోతున్న మానవ సంబంధాలు..**

ప్రస్తుత కాలంలో మానవ సంబంధాల కంటే డబ్బుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని సిపి సజ్జనార్ ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనరేట్ పరిధిలో నమోదవుతున్న కేసుల్లో ఎక్కువశాతం ఆర్థిక కారణాల వలనే కావడం శోచనీయమన్నారు. డబ్బు వ్యామోహంలో ఒకరినొకరు చంపుకుంటున్నారని తెలిపారు. అలాగే ఈ మధ్యన వివాహేతర సంబంధాల కారణంగా భార్య, భర్తల హత్యలు క్రమంగా పెరుగుతున్నాయని, క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు తమ కుటుంబాలను రోడ్డున పడేలా చేస్తాయని సజ్జనార్ హెచ్చరించారు.

**హైదరాబాద్ పోలీస్ 'విజన్ 2026'**

* చిన్నారులు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ఉమెన్ 2.0 ద్వారా షీ టీమ్స్‌ను టెక్నాలజీ పరంగా మరింత బలోపేతం చేసి, బాధితులకు తక్షణ సహాయం అందించే విధంగా వ్యవస్థను పటిష్టం చేస్తామన్నారు.
* ప్రజల్లో అవగాహన మరింత పెంపొందించి సైబర్ క్రైమ్‌ను పూర్తిగా రూపుమాపడానికి ప్రయత్నిస్తామని వెల్లడించారు. అలాగే డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపి డ్రగ్ ఫ్రీ నగరంగా హైదరాబాద్‌ను మార్చుతామని తెలిపారు.
* ప్రజలు పోలీసుల పరస్పర సహకరంతో హైదరాబాద్ నగరాన్ని 'సేఫ్ లివింగ్ సిటీ'గా తీర్చిదిద్దుతామని వెల్లడించారు.




# జనరల్
STATE & REGIONAL NEWS

## తప్పుడు ప్రచారం చేస్తే సహించం : హనుమంత రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారాక రామారావు సోషల్ మీడియాను అడ్డం పెట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తే సహించబోమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హెచ్చరించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇష్టారీతిన తెలంగాణను దోచుకోవడమే కాకుండా నాయకులను డబ్బులిచ్చి కొనుగోలు చేయడమే కాకుండా పోలీసులతో కొట్టించి మరి బిఆర్ఎస్‌లో చేర్చుకున్నది మీరు కాదా అన్ని ప్రశ్నించారు. అక్రమంగా హాజీజ్‌నగర్ చెరువులో మాజీమంత్రి హరీష్‌రావు కట్టుకున్న ఫామ్‌హౌస్ హైడ్రాతో కూల్చివేయించి ఆయనపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. కెసిఆర్, కెటిఆర్‌లు వాడే భాషను తాము వాడితే తట్టుకోలేరని హనుమంత రావు హెచ్చరించారు.

# నిత్యం ప్రజల్లో ఉండాలి

- సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తే మంచి ఫలితాలు
- సిపిఐ నల్లగొండ జిల్లా కౌన్సిల్ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి




ప్రజాపక్షం/నల్లగొండ: నూతనంగా గెలుపొందిన ప్రజాప్రతిధులు నిత్యం ప్రజల్లో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం పని చేస్తుంటే ఫలితం తప్పకుండా వస్తుందని, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సిపిఐ సర్పంచ్, ఉపసర్పంచ్‌లను సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి శనివారం జిల్లా కార్యాలయంలో శాలువాలతో ఘనంగా ఆత్మీయ సన్మానం చేశారు. అంతకుముందు సిపిఐ నల్లగొండ జిల్లా కౌన్సిల్ సమావేశం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగింది. సమావేశానికి జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి ముఖ్యతిథిగా హాజరై మాట్లాడుతూ జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ వందేళ్ల ఉత్సవాల ముగింపు బహిరంగ సభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని అని వర్గాల ప్రజలకు పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిందని, దేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని, దోపిడీవర్గాల నుంచి మానవ జాతి విముక్తి కోసం అనేక త్యాగాలు, వీరోచిత పోరాటాలు చేసిన ఘనమైన చరిత్ర సిపిఐకే ఉందన్నారు. కమ్యూనిజం, ఎర్రజెండా లేకపోతే ప్రజలకు రక్షణ కవచం లేదని, ఎప్పుడు ఏమైతుందోననే భయానక పరిస్థితులు ఉంటాయని తెలిపారు. ప్రధాని మోదీ, బిజెపి లాంటి తిరోగమనం, కార్పొరేట్లకు ఊడిగం చేసే సిద్ధాంతం కలిగిన వాళ్లు కమ్యూనిజం అంటేనే ఒక భూతంగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని, కమ్యూనిస్టులు ఉండకూడదని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఒక లక్ష్యాన్ని పెట్టుకున్నదన్నారు. పేదరికం లేకుండా చేస్తామని చెప్పాల్సిన ప్రభుత్వం, 2026 మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలో అధికార పార్టీ విచ్చలవిడిగా డబ్బులు మద్యం, డబ్బులతో ఓటర్లను మభ్యపెట్టి ఓట్లు కొనుగోలు చేసిన ప్రజలు మాత్రం ఆయా గ్రామాలలో సిపిఐకి సంబంధించి 9 మంది సర్పంచ్‌లను, 14 ఉప సర్పంచ్‌లతో పాటు వార్డు సభ్యులను గెలిపించుకున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గెలుపొందిన వారు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అవినీతి, అక్రమాలు జరగకుండా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ సాగు కోసం రైతంగానికి ఇచ్చే యూరియా విషయంలో కొత్తగా తీసుకొచ్చిన యూరియా యాప్‌పై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో యూరియా పొందడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నిరక్ష్యరాసులైన రైతులకు స్మార్ట్‌ఫోన్ ఎక్కడివి అని ప్రశ్నించారు. ఫోన్ ఉన్న రైతులకు సాంకేతిక సమస్యతో ఆన్‌లైన్‌లో యూరియా బుక్ కావడం లేదని ప్రభుత్వం పాత పద్దతిలో అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. సమావేశానికి తుమ్మ బుచ్చిరెడ్డి అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రావణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు ఉజ్జని యాదగిరి రావు, పబ్బు వీరస్వామి, బొల్గురి నర్సింహా, గురిజ రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు, నల్పరాజు రామలింగయ్య, తీర్పారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




# భావజాలాలకు వేదికగా బుక్ ఫెయిర్






బుక్ ఫెయిర్‌ను సందర్శించిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, దత్తాత్రేయ

ప్రజాపక్షం/హైదరాబాద్: ఎన్‌టిఆర్ స్టేడియంలో జరుగుతున్న 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి శనివారం సందర్శించారు. హైదరాబాద్ పుస్తక ప్రదర్శన విభిన్న అభిప్రాయాలు, భావజాలాలకు వేదికగా నిలిచిందని ప్రశంసించారు. అందె శ్రీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రదర్శనశాల వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా, ఆరోగ్యకరంగా ఉందని పేర్కొన్నారు. ఒకే ప్రాంగణంలో సావర్కర్, గాంధీ, మార్క్స్ వంటి భిన్న ధృవాలైన ప్రముఖుల రచనలు అందుబాటులో ఉండటం అభినందనీయమని, వివిధ రకాలైన విరుద్ధ భావజాలాలను ప్రజలకు చేరువ చేయడమే పుస్తక ప్రదర్శనల ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. గద్దర్ ఫౌండేషన్, వీక్షణం, నవోదయ బుక్ హౌస్, లిఖిత ప్రెస్ బుక్‌హౌస్, పెంగ్విన్, ఓరియంట్ బ్లాక్ స్వాన్, క్యాస్ట్ ఇన్ మోడెర్న్ ఇండియా, ఫైజ్ అహ్మద్ ఫైజ్ మొదలగు పుస్తకాలను కొనుగోలు చేశారు.

హైదరాబాద్ ఎన్‌టిఆర్ స్టేడియంలో జరుగుతున్న 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను శనివారం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సందర్శించారు. ఈ సందర్భంగా బుక్ ఫెయిర్ ప్రతినిధులు దత్తాత్రేయకు భారత రాజ్యాంగం పుస్తకం బహూకరించారు. అనంతరం దత్తాత్రేయ మాట్లాడుతూ.. పుస్తక పఠనం అభ్యాసమైతే అది మనిషికి మానసిక ప్రశాంతతను ఇవ్వడమే కాకుండా, గొప్ప మేధావిగా తీర్చిదిద్దుతుందని పేర్కొన్నారు. తన జీవితంలో 'నెపోలియన్ ది గ్రేట్' పుస్తకం తనను ఎంతగానో ప్రభావితం చేసిందని, ఆయన నిఘంటువులో 'అసాధ్యం' అనే పదమే లేదన్న స్ఫూర్తితోనే తాను సమాజ సేవలో నిమగ్నమయ్యానని తెలిపారు. ఎమర్జెన్సీ సమయంలో జైలులో ఉన్నప్పుడు భగవద్గీత తనకు జీవిత పరమార్థాన్ని బోధించిందని, కోవిడ్ వంటి విపత్కర కాలంలో మహాభాగవతం చదవడం వల్ల ధైర్యం, శక్తి లభించాయని గుర్తుచేసుకున్నారు.

## బిఆర్ఎస్ హయాంలో రైతులకు అన్యాయం



ప్రజాపక్షం/హైదరాబాద్: రైతుల, ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవాలనే ఆలోచన ప్రతిపక్ష బిఆర్ఎస్‌కు లేదని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఎం.కోదండరెడ్డి ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అన్యాయం జరిగిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుంటే, మరోసారి ఫార్మాసిటీ ప్రాజెక్టను తెరమీదకు తీసుకొస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నారని, ప్రతిపక్షంగా ప్రజల పక్షంగా నిలబడాల్సిన బిఆర్ఎస్ అందుకు భిన్నంగా వ్యవహారిస్తోందని, తద్వారా రైతులకు నష్టం జరుగుతుందని అన్నారు. రైతుల విషయంలో రాజకీయం చేయొద్దని, వారి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని సూచించారు. ప్రతిపక్ష పాత్ర పోషించడం లేదని ఇంతకు బిఆర్ఎస్ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నాదా? లేదా వారి సొంత రాజ్యంలో ఉన్నాదా అని దుయ్యబట్టారు. సమస్యలను ముఖ్యమంత్రిని, లేదా సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం ఉన్నదని, కానీ బిఆర్ఎస్ నాయకులు ఎవరినీ లెక్క చేయడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఈ ఫార్మా సిటీని ఎత్తి వేస్తామని చెప్పామని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అనుకూలంగా ఉన్నదని, నష్టపరిహారం, ఉద్యోగం, ఇంటి స్థలాన్ని కేటాయిస్తుందని వివరించారు. కొడంగల్ విషయంలో కూడా సిఎం రేవంత్ రెడ్డి రైతులకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు.

# వెనకడుగు వేయని ధీరుడు బద్దం




సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి


ప్రజాపక్షం/కరీంనగర్ : భారత దేశానికి స్వాతంత్ర్యం కావాలని స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా హైదరాబాద్ సంస్థానంలో నిజాం నవాబుల పరిపాలనను వ్యతిరేకిస్తూ ఉద్యమాలు నిర్వహిస్తున్న బద్దం ఎల్లారెడ్డిని సంకెళ్లతో ఊరేగించినా, జైల్లో నిర్బంధించిన మొక్కవోని ధైర్యంతో అనేక పోరాటాలకు నాయకత్వం వహించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సేనాని, కరీంనగర్ మొట్టమొదటి పార్లమెంటు సభ్యుడుగా, బుగ్గారం, ఇందుర్తి శాసనసభ్యులుగా, రాజ్యసభ సభ్యులుగా పేద, బడుగు బలహీన వర్గాలకు విశిష్ట సేవలు అందించిన గొప్ప నాయకుడు బద్దం ఎల్లారెడ్డి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి కొనియాడారు. బద్దం ఎల్లారెడ్డి 46వ వర్ధంతిని పురస్కరించుకొని సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం నగరంలోని కోతి రాంపూర్ బైపాస్ రోడ్డులోని బద్దం ఎల్లారెడ్డి విగ్రహానికి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌లతో కలిసి చాడ వెంకట్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలిస్తున్న నిజాం నవాబును, రజాకార్లను, దేశ్‌ముఖ్‌లను ఎదిరించడానికి, వెట్టిచాకిరి, బానిసత్వం, దోపిడీకి వ్యతిరేకంగా దున్నే వానికి భూమి కావాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన గొప్ప యోధుడు పోరాట సేనాని బద్దం ఎల్లారెడ్డి అన్నారు. భారతదేశంలో జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో కరీంనగర్ మొట్టమొదటి పార్లమెంట్ సభ్యునిగా బద్దం ఎల్లారెడ్డి ఎన్నికయ్యారని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇందుర్తి, బుగ్గారం శాసనసభ్యుడిగా పని చేశారని, రాజ్యసభ సభ్యులుగా కూడా పనిచేసి ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన గొప్ప నాయకుడని అన్నారు. అలాంటి నాయకుడి ఆశయాలను, లక్ష్యాలను నేటి తరం పునికి పుచ్చుకొని ముందుకు తీసుకెళ్లేందుకు సిపిఐ శ్రేణులు సిద్ధం కావాలని వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. నివాళులర్పించిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు న్యాలపట్ల రాజు పైడిపల్లి రాజు, కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, మచ్చ రమేష్, కొట్టే అంజలి, బోనగిరి మహేందర్, నగర నాయకులు గామినేని సత్యం, కసిబోజుల సంతోష్ చారి, మాడిశెట్టి అరవింద్, బాకం ఆంజనేయులు, నగునూరి రమేష్, బెక్కంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ అగ్రనేత బద్దం ఎల్లారెడ్డి వర్ధంతి సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయం, మఖ్దూం భవన్‌లో ఆయన చిత్ర పటానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమావత్ అంజయ్ నాయక్, రాష్ట్ర సమితి సభ్యులు మారుపాక అనిల్ కుమార్, పుట్ట లక్ష్మణ్, మణికంఠ రెడ్డి, ఆఫీస్ కార్యదర్శి గోవిందరావు, బిల్డింగ్ ఇన్‌చార్జ్ బోయ శ్రీరాములు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది అంజయ్య, దశరథ, నరసింహ, శివకుమార్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ వాదాన్ని తొలి నుంచి ప్రోత్సహించిన మహనీయుడు నూకల రాంచంద్రారెడ్డి

రాంచంద్రారెడ్డి కాంస్యవిగ్రహ ఆవిష్కరణలో మంత్రి పొంగులేటి



ప్రజాపక్షం/మహబూబాబాద్ :తెలంగాణ వాదాన్ని తొలి నుంచి ప్రోత్సహించిన మహనీయుడు దివంగత నూకల రాంచంద్రారెడ్డి అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రూ. 42.28 లక్షలతో నిర్మించిన దివంగత మాజీ మంత్రి నూకల రామచంద్రారెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ శాసనసభ్యు లు, డాక్టర్ భూక్య మురళి నాయక్, పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి, మాజీ ఎంపీ వినోద్ కుమార్, సీతారాం నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, బసవరాజు సారయ్య, ట్రై కార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఇన్‌ఛార్జి ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్, నూకల రామచంద్ర రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ మహబూబాబాద్ నుంచి నాలుగుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికై, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ, ప్రణాళిక ,ఇతర కీలక శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వహించి ఈ ప్రాంత ప్రజల గుండె ల్లో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత నాయకుడు నూకల రాంచంద్రారెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో సుమారు రూ.6 కోట్ల 50 లక్షల వ్యయంతో చేపట్టి, సీసీ, బిటి రోడ్లు, వర్షపు నీటి కాలువ, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

## సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు పునరుద్ధరించాలి: హరీశ్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్: మానవతా దృక్పథంతో ఆలోచించి వెంటనే మెడికల్ బోర్డ్‌ను ఏర్పాటు చేసి, సింగరేణి సంస్థలో డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లో సింగరేణి సంస్థ డైరెక్టర్ గౌతమ్‌ను హరీశ్‌రావు ఆధ్వర్యంలో టిబిజికెఎస్ నాయకుల ప్రతినిధి బృందం శనివారం కలిసి వినతి పత్రం అందజేసింది. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ కార్మికుల పట్ల సిఎం రేవంత్ రెడ్డి పగపట్టినట్టుగా వ్యవహారిస్తున్నారని ఆరోపించారు. కరెంట్‌కు బొగ్గును తీసుకుని బిల్లులను చెల్లించడం లేదని, సింగరేణి అప్పుల పాలయ్యే పరిస్థితికి వచ్చిందని, జీతాలకు కూడా డబ్బులు లేక ఒడి తీసుకుని జీతాలు చెల్లించే పరిస్థితుల్లో ఉన్నదని హరీశ్‌రావు తెలిపారు. ఫుట్‌బాల్ ఆడటం కోసం సింగరేణి సంస్థకు చెందిన రూ.10 కోట్లను ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. బిఆర్ఎస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత ఫుట్‌బాల్ మ్యాచ్ కోసం వాడిన రూ.110 కోట్ల అంశంపైన విచారణ చేపడుతామని హరీశ్ రావు తెలిపారు.

## 'డ్రగ్స్ కేసు' విచారణపై చర్యలేవి?

- కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రజాపక్షం/హైదరాబాద్: కెసిఆర్ ప్రభుత్వ హయాంలో అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో చేపట్టిన 'డ్రగ్స్ కేసు' విచారణ నివేదికపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. డ్రగ్స్ కేసులో పట్టుబడిన వారిని అకున్ సబర్వాల్ బృందం విచారిస్తే కెసిఆర్ కుటుంబ సభ్యులకు కూడా డ్రగ్స్ విక్రయదారులతో సంబంధాలున్నాయని తేలిందని, ఈ విషయమై వాంగ్మూలం ఇచ్చారని బండి సంజయ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ వాంగ్మూలంతో కూడిన ఆడియో, వీడియో రికార్డులు బయటికి వస్తే తన కుటుంబ సభ్యుల రాజకీయ భవిష్యత్తు సమాధి అవుతుందని బావించి, ఆకున్ సబర్వాల్‌ను అర్ధాంతరంగా డ్రగ్స్ కేసు బాధ్యతల నుండి తప్పించారని ఆరోపించారు. ఆ కేసుకు సంబంధించిన నివేదికను, రికార్డు చేసిన ఆడియో, వీడియో, స్టేట్‌మెంట్లన్నింటినీ నాటి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి డ్రగ్స్ నిర్మూలన పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే ''ఈగల్'' టీమ్‌ను వెంటనే రంగంలోకి దింపి సోమేశ్ కుమార్‌ను విచారించాలని డిమాండ్ చేశారు.

# కమ్యూనిస్టుయోధుల ఆత్మబలిదానాలతో స్వాతంత్ర్యం




- సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ప్రజాపక్షం/హైదరాబాద్: అనేక మంది కమ్యూనిస్టు యోధుల ఆత్మబలిదానాలతో భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిందని, కాంగ్రెస్ పార్టీలో కమ్యూనిస్టులు అంతర్భాగంగా ఉంటూనే కాంగ్రెస్ నిర్ణయాలను ప్రభావితం చేశారని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటురంగారావు అన్నారు. ప్రస్తుత పాలకులు నాటి బ్రిటీష్ పాలకుల కంటే క్రూరంగా, నిరంకుశంగా వ్యవహారిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో నెలకొన్న తాజా పరిస్థితులపైన కమ్యూనిస్టులు మరో స్వాతంత్ర్య ఉద్యమాన్ని నిర్వహించాలన్నారు. ''వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమం –గుణపాఠాలు–కర్తవ్యాలు''అనే అంశంపైన సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ కేంద్ర కమిటీ సభ్యులు కె.రమ అధ్యక్షతన జరిగిన సదస్సులో ''ప్రతిఘటనా పోరాటం, ఆచరణానుభవం,'' పుస్తకాలను మాజీ ఎంఎల్‌ఎ గుమ్మడి నర్సయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోటు రంగారావు మాట్లాడుతూ ప్రపంచంలో మొట్టమొదట రష్యాలో సోషలిస్టు విప్లవం విజయవంతమైందని, తద్వారా భారతదేశంలో యువకులు, విద్యార్థులు తమ మనసునిండా దేశభక్తిని నింపుకున్నారని, స్వాతంత్ర్య పోరాటంలో ముందు వరుసలో నిల్చున్నారని తెలిపారు. కాంగ్రెస్ నిర్వహించిన సభలకు వేలాదిమందిని తరలించిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉన్నదని, అలాగే దండి గాంధీ నాయకత్వంలో సాగిన సత్యాగ్రహంలో కూడా కమ్యూనిస్టులు పాల్గొన్నారని ఆయన వివరించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆవిర్భవించిన గదర్ పార్టీ , హిందూస్తాన్ సోషలిస్టు అసోసియేషన్(హెచ్ఎస్ఎ), పెజెంటరీ అండ్ వర్కర్స్‌లాంటి పార్టీలు ప్రజల తరపున పోరాడిన చరిత్ర ఉన్నదని పోటురంగారావు గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీ దేశ విప్లవకారుల నిజమైన వారసత్వంగా, అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీ 3వ ఇంటర్నేషనల్ ఫలితంగా 1925 డిసెంబర్‌లో 26,27,28తేదలలో కాన్పూర్‌లో మహాసభలు జరుపుకొని ఏర్పడిందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు విప్లవ వారత్వంను కొనసాగిస్తూ వస్తున్న కమూనిస్టు పార్టీ నేటి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న ప్రజా ప్రతీఘాతుకను ఎదిరిస్తూ పోరాడుతున్నదని తెలిపారు. ప్రస్తుత పాలకులు నిర్బంధాలపేరుతో విప్లవకారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

**కాన్పూర్‌లో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీనే సరైన ఆవిర్భావం**

సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకుడు బత్తిని శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్రిటీష్ పాలనలో ప్రపంచంలో విప్లవకారులు ఎక్కడ ఉన్నప్పటికీ భారతదేశ స్వాతంత్ర్య కోసం కలలు కన్నారని, అమెరికా, రష్యా లాంటి దేశాలలో ఉన్నప్పటికీ వలసల విముక్తి కోసం ఎం.ఎన్.రాయ్.అంతర్జాతీయ విప్లవకారుడు లెనిన్ సలహాతో తాష్కెంట్‌లో కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేసేందుకు పూనుకున్నారని వివరించారు. అయితే, 1925లో కాన్పూర్‌లో విప్లవ శక్తులు కలిసి ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ సరైన ఆవిర్భావంగా భావించవచ్చునన్నారు. దేశబంలో ప్రగతి వ్యతిరేక శక్తుల ప్రాబల్యం పెరిగిందని, కమ్యూనిస్టులు ధైర్యంగా, సాహసోపేతంగా ప్రజాపోరాటాలిన నడపాల్సిన అవసరం గురించాలని అన్నారు.

**కమ్యూనిస్టులు ఆత్మవిమర్శ చేసుకోవాలి : భార్గవ్**

జి. భార్గవ్ మాట్లాడుతూ కమ్యూనిస్టులు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కమ్యూనిస్టులు చేసిన త్యాగాలు అమోఘమని, కానీ చీలికలు, పేలికలుగా తెగిపోయారన్నారు. వారిలో ఐక్యత చెడిందని, సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్)లుగా వందలాది పార్టీలు చీలిపోవడం అవసరం లేదని అన్నారు. గోకినేపల్లి వెంకటేశ్వర్ రావు విప్లవ పార్టీలలో చీలకలు అనే అంశాన్ని పరిచయం చేశారు. మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు కె.జి.రాంచందర్ మాట్లాడుతూ దేశంలో సామ్రాజ్యవాదుల జోక్యం పెరిగిందన్నారు. ఈ సదస్సులో సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.హన్మేశ్, నాయకులు ఎం.కృష్ణ, వి.కృష్ణ, జి.వెంకటేశ్వర రావు, ఎస్.ఎల్. పద్మ, కె.సూర్యం, సదానందం, ప్రదీప్ పాల్గొన్నారు.


**పురపాలక సంఘ కార్యాలయము :: కోదాడ, సూర్యాపేట జిల్లా.**

నెం.యం.సి.కె/ఇ1/1487/2025-26 బహిరంగ వేలము ప్రకటన తేది: 27.12.2025

ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా, పురపాలక సంఘ పరిధిలో అస్పెషన్ టాయిలెట్‌ని నిర్మించుటకు గాను శిధిలావస్థలో ఉన్నటువంటి ఫిష్ మార్కెట్ వద్ద పాత టాయిలెట్‌ని కూల్చుట మరియు కుల్చగా వచ్చిన డిస్మాంటల్ మెటీరియల్ మరియు ఇతర మెటీరియల్ ను బహిరంగ వేలము పురపాలక సంఘ కార్యాలయంలో మీటింగ్ హాల్ నందు బహిరంగవేలము నిర్వహించబడును ఇట్టి వేలంలో పాల్గొనదల్చినవారు రూ.5000/- శ్రీయుత మున్సిపల్ కమిషనర్ కోదాడ మున్సిపాలిటీ పేరు మీద తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ ను తేదీ: 29.12.2025 సాయంత్రం గం.లు. 4.00 లోపు కోదాడ పురపాలక సంఘ కార్యాలయం నందు సమర్పించవలెను. తేది: 31.12.2025 ఉదయం. గం.లు 11.00 లకు పురపాలక సంఘ కార్యాలయం మీటింగ్ హాల్ నందు బహిరంగ వేలంలో పాల్గొనగలరు రూపాయలు 5000/- డిమాండ్ డ్రాఫ్ట్ (తిరిగి చెల్లించబడదు) కార్యాలయం నందు సమర్పించిన వారు మాత్రమే వేలంలో పాల్గొనుటకు అర్హులు.

సం/- కమీషనర్
కోదాడ పురపాలక సంఘం

DIPR R.O. No. : 12678-PP/CL/ADVT/1/2025-26, Date: 27-12-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

ఎగ్జిక్యూటి ఇంజినీర్ కార్యాలయం, హయత్‌నగర్ సర్కిల్-3, ఎంఆర్‌ఓ కార్యాలయం పక్కన, సరూర్‌నగర్, హైదరాబాద్. ఇ-మెయిల్ : eec.ghmc@gmail.com

కొటేషన్ నోటీస్

కొటేషన్ నోటీసు నెం. EE/HYTNE/LBNZ/17/2025-26/216, తేది: 27-12-2025.

ప్రముఖ సంస్థల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడ్డాయి. అవి ఈ కింద సంతకం చేయబడిన వారికి తేదీ: 29-12-2025లోపు తప్పకుండా అందజేయాల్సి ఉంటుంది. కొటేషన్ తేదీ: 29-12-2025న సాయంత్రం 4.00గంటల వరకు లేదా లోపు మాత్రమే స్వీకరించబడతాయి. అది అదేరోజు 4.30 గంటల సమయానికి తెరవబడుతుంది. దీనికి సంబంధించిన వివరాలను ఎగ్జిక్యూటివ్ కార్యాలయం నుండి కార్యాలయం పనివేళల్లో పొందవచ్చు.

| క్ర.సం. | ఐటెమ్ యొక్క వివరణ | క్వాలిటీ | యూనిట్ | అమౌంట్ |
|---|---|---|---|---|
| 1. | ఫోమ్ బోర్డుల సరఫరా మరియు ఫిక్సింగ్ | 1 | Sft | |
| 2. | ఫ్లెక్సీల సరఫరా మరియు ఫిక్సింగ్ | 1 | Sft | |

షరతులు :
1. కొటేషన్లను తేదీ 29-12-2025న సాయంత్రం 4గంటల వరకు లేదా లోపు స్వీకరించబడతాయి. వాటిని అదేరోజు హయత్‌నగర్ సర్కిల్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో 4.30 గంటలకు తెరవబడతాయి.
2. ఎటువంటి కారణం చూపకుండానే కొటేషన్లను దర్దు చేయడానికి హయత్‌నగర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రత్యేక హక్కును కలిగి ఉన్నారు.

**సంబంధిత అధికారి చిరునామా :** శ్రీ కె. రమేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, హయత్‌నగర్ సర్కిల్-3, జిహెచ్ఎంసి, హైదరాబాద్.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తరపున, హయత్‌నగర్ సర్కిల్-3, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 12658-PP/CL/ADVT/1/2025-26, Date: 27-12-2025

## ఎన్ఎస్ఎస్ శిబిరాల సద్వినియోగం



**ప్రజాపక్షం/మునగాల:** ఎన్ఎస్ఎస్ శిబిరాలను గ్రామస్తులు సద్విని యోగం చేసుకోవాలని మునగాల ఎంపిడివో రమేష్ దీన్‌దయాల్ అన్నారు. శనివారం మండల పరిధిలోని నర్సింహాపురం లో జరుగుతున్న శీతకాలపు ప్రత్యేక శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. కెఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నుద్దేశించి మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ద్వారా శారీరక, మానసిక, సామాజిక దృఢత్వం చేకూరుతుం దని, విద్యార్థులు ఏకగ్రతను పొందుతారని అన్నారు. వాలంటీర్లు గ్రామం లోని డ్రైనేజీ కాలువల పూడిక తీత, కంపచెట్ల తొలగింపు, చెత్త చెదారంను తొలగించారు. ఈకా ర్యక్రమంలో సర్పంచ్ వేమూరి సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వేముల వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ రెడ్డె బోయిన ప్రశాంత్, గ్రామ కార్య దర్శి పచ్చిపాల వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రిస్మస్ రోజు రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన సరైంది కాదు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** క్రిస్మస్ రోజు రాజ్యాంగ హక్కుల ఉల్లం ఘన సరైంది కాదని, దేశంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, మత స్వేచ్ఛపై పెరుగుతున్న ముప్పుపట్ల తెలంగాణ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియే షన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని నల్లాలబావి సెంటర్ వద్ద నియోజక వర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవ. జలగం జేమ్స్ ఆధ్వ ర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వం, స్వేచ్ఛ, మత స్వాతంత్రంపై మతోన్మాదులు దాడి చేస్తున్నారని ఆరోపించారు. ఆర్టికల్స్ 2528ల ద్వారా కలిగిన మతప రమైన హక్కులు ప్రజాశాంతి, ఆరోగ్యం, నైతికతకు లోబడి ఉన్నప్పటికి, ప్రస్తుతం ఈ హక్కులను కాలరాస్తున్న పరిస్థితి నెలకొని ఉందని విమర్శిం చారు. ఈ కార్యక్రమంలో మోజెస్, బొక్క ఏలియా రాజు, వరికుప్పల మత్తయి, పంది మార్కు, బానోతు సుధాకర్, రెడ్డిపల్లి ప్రేమ్‌సాగర్, పుల్లూరు బోయాజ్, ధరావత్ మంగ్యనాయక్ పాల్గొన్నారు.



## జూన్ నాటికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులు పూర్తి

### పనులు పరిశీలించిన నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా కేంద్రం సమీపంలో ఎస్ఎల్‌బిసి కాలనీ వద్ద చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను తొందరగా పూర్తి చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం ఆమె యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షి యల్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు.వచ్చే విద్యా సంవత్సరం అకాడమీ జూన్‌లో ప్రారంభమయ్యే నాటికి తరగతి గదులు,విద్యార్థులు ఉండేందుకు డార్మెట్రీ, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ఎంట్రన్స్ గ్రౌండ్,క్రికెట్ గ్రౌండ్,త్రాగునీరు,ఆట స్థలాల తో సహా పూర్తి చేయాలని ఇంజనీర్,కాంట్రా క్టర్‌లను ఆదేశించారు. ఇందుకు పనులను వేగవంతం చేసి పూర్తి చేయా లని,అలాగే పనులు నాణ్యత ప్రమాణాలతో ఉండాలని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని,దీనిని దృష్టిలో ఉంచుకొని పాఠశాల నిర్మా ణాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా చూడాల్సిన బాధ్యత ఉందని అన్నారు.నల్ల గొండ ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, తహసీల్దార్ పరుశురాం,ఇంజినీర్,కాంట్రాక్టర్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఎపికె ఫైల్స్ అత్యంత ప్రమాదం

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ్మా

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మొబైల్ ఫోన్స్‌కు వాట్సప్ గ్రూపుల ద్వారా, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఎపికె ఫైల్స్ అత్యంత ప్రమాదకరమైనవని జిల్లా ఎస్‌పి కె నరసింహ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఏపికె ఫైల్స్ ద్వారా మొబైల్ హ్యాక్ చేసి ఆర్థిక నష్టాన్ని కలిగించేందుకు సైబర్ మోసగాళ్ళ ఎత్తుగడ మాత్రమేనన్నారు. ఆర్‌టిఏ చాలానా, టిఎస్ పోలీస్ చలాన్, ప్రభుత్వ పథకాలు అంటూ వాట్సప్ గ్రూపుల ద్వారా ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేసి వాటిని మొబైల్ ఫోన్స్‌లో డౌన్‌లోడే చేసుకునేలా ప్రేరేపిస్తారని పేర్కొన్నారు. ఫైల్స్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేస్తే సైబర్ మోసగాళ్ళ ఆధీనంలోకి వెళ్తుందన్నారు. ఆ సమయంలో మీ మొబైల్‌ను వినియోగించి మీ బ్యాంక్ ఖాతాలో ఉన్న డబ్బును దొంగలిస్తారు, ఇలాంటి ఏపికై ఫైల్స్‌ను ఎవరూ నమ్మవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులు, సందేశాలు అందిన వెంటనే వాటిని పోలీస్ శాఖకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సైబర్ మోసగాళ్ల పన్నాగాలకు లోనుకాకుండా మీ భద్రత కోసం అప్రమత్తంగా ఉండాలన్నారు.

## నూతన సంవత్సర వేడుకలకు జాగ్రత్తలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** నూతన సంవత్సర వేడకలు నిర్వహించే వారు జాగ్రత్తలు పాటించాలని సూర్యాపేట సబ్ డివిజన్ డిఎస్‌పి ప్రసన్న కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదాలకు దూరంగా ఉంటూ పిల్లలు, పెద్దలు అందరూ వారి ఇండ్లలో ఉత్సవాలను జరుపు కుంటూ పోలీసు వారి సూచనలను పాటించాలని అన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండ సూర్యాపేట డివిజన్ పరిధిలో భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి వేడుకలు నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిత్యం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించబడుతా యని చెప్పారు. అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే తగు చర్యలు తీసుకో వడం జరుగుతుంది, వేడుకలు జరుపుకునే వారు కుటుంబంతో కలిసి ఇంట్లోనే ఉత్సవాలు జరుపుకోవడం మంచిదన్నారు.

## మత్తులో రోడ్లపై వాహనాలు నడపొద్దు

### నూతన సంవత్సర వేడుకలపై అంక్షలు : ఎస్‌పి

**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మత్తులో రోడ్లపై వేగంగా,ఇష్టారాజ్యాంగా వాహనాలు నడుపుతూ ప్రమాదా లకు కారకులు కాకూడదని జిల్లా యస్పి శరత్ చంద్ర పవార్ వాహనదారు లకు సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలో భాగంగా అప్రమత్తమై పక్కా కార్యాచరణతో రంగంలోనికి దిగుతు న్నారని నూతన సంవత్సర వేడుకలపై ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఏవ రైన అతిక్రమించినా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగు తుందని హెచ్చరించారు.నల్లగొండ జిల్లా పరిధిలోని నల్లగొండ,మిర్యాల గూడ దేవరకొండ,డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలలో ముఖ్యంగా నూతన సంవత్సర వేడుకలను ఎక్కువ నిర్వహించే అవకాశం ఉంటుందని ఈ వేడుకల సందర్భంగా ప్రతీ వాహనాదారుడు తూ.చ తప్ప కుండా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించేలా పోలీసు సిబ్బంది చర్యలు తీసుకోనున్నారని తెలిపారు. అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలలో సాయంత్రం 6 గంటల నుండి ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి వాహనాల తని ఖీలు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేసి వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## రాజేష్ కుటుంబానికి మాదిగ లాయర్స్ ఫెడరేషన్ అండ



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణానికి చెందిన దళిత యువకుడు కర్ల రాజేష్ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు మాదిగ లాయర్స్ పెడరేషన్ అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు డపుకు మల్లయ్య అన్నా రు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థా పక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అదేశాల మేరకు శనివారం కోదాడ పట్ట ణంలోని రాజేష్ నివాసానికి సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ నుంచి మాదిగ న్యాయవాదులు వెళ్లి తల్లి లలితమ్మను పరామర్శించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ రూరల్ సిఐ ప్రతాపలింగంపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయడం జరిగిందని, అదే విధంగా చిలుకూరు ఎస్ఐ సురేష్ రెడ్డిపై కేసు నమోదు చేసినప్పటికీ నేటి వరకు సస్పెండ్ చేయకపోవడం ఏమి టని ప్రశ్నించారు. వెంటనే ఎస్ఐని సస్పెండ్ చేసి శాఖపరమైన చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. రాజేష్ కుటుంబానికి రావాల్సిన ప్రయోజనాలు అన్ని అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మా ర్పీఎస్ నాయకులు ఏపూరి రాజు, దిరిశనపు దావీద్, న్యాయవాదులు మందుల శ్రీనివాస్, మీసాల శ్రీనివాస్, నవీన్, అంజిబాబు, వంశీ, రాజేష్ తమ్ముడు కర్ల కమల్, కుడుముల వెంకటయ్య, కాంతారావు పాల్గొన్నారు.

## నాగార్జునసాగర్-శ్రీశైలం లాంచి యాత్రకు విశేష ఆదరణ...

### ఐదవ వారం పూర్తి - భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి

**ప్రజాపక్షం/నందికొండ:** తెలంగాణ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలానికి లాంచి ద్వారా నిర్వహిస్తున్న పవిత్ర యాత్ర యత్రి కుల విశేష స్పందనతో విజయవంతంగా కొనసాగుతోంది. ప్రతి శనివారం క్రమబద్ధమైన షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్న ఈ యాత్ర నేటితో ఐదవ వారం పూర్తి చేసుకుంది. ప్రతి శనివారం ఉదయం 9 గంటలకు నాగార్జునసా గర్ నుంచి బయలుదేరుతున్న లాంచ్ యాత్ర యాత్రికులు ప్రశాంతమైన జల ప్రయాణాన్ని ఆస్వాదించడంతో పాటు ఆధ్యాత్మిక అనుభూతిని పొందు తున్నారు. ప్రయాణంలో తీసుకుంటున్న భద్రతా చర్యలు, నిర్వాహకులు కల్పి స్తున్న సౌకర్యాలు యాత్రికులను ఆకట్టుకుంటున్నాయని భక్తులు తమ అభి ప్రాయాన్ని తెలియజేస్తున్నారు.శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి భక్తులు ఉత్సాహంగా పాల్గొనడంతో ఈ లాంచి యాత్ర రోజురోజుకూ ఆద రణ పెరుగుతోంది. పరిస్థితులు అనుకూలిస్తే రానున్న వారాల్లో కూడా ఇదే విధంగా యాత్ర ను కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**రిజర్వాయర్ నీటిమట్టం 560 అడుగులవరకు మాత్రమే సాధ్యం**

ఇదిలా ఉండగా, నాగార్జునసాగర్ రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగుల నుంచి 560 అడుగుల మధ్య ఉన్నప్పుడే ఈ యాత్ర నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలంగాణ పర్యాటకశాఖ స్పష్టం చేసింది. శనివారం సాయంత్రానికి సాగర్ రిజర్వాయర్ నీటిమట్టం 565 అడుగులకు చేరు కుంది. నీటిమట్టం మరో ఐదు అడుగులు తగ్గితే లాంచి యాత్రను కొనసాగించడం సాధ్యం కాదని తెలంగాణ పర్యాటకశాఖ అధికారులు పేర్కొ న్నారు. భక్తుల విశేష ఆదరణతో సాగుతున్న ఈ పవిత్ర జలయాత్ర ఇంకా కొనసాగాలని యాత్రి కులు ఆకాంక్షిస్తున్నారు.



## ప్రజల నమ్మకమే సర్పంచ్‌ల బలం

### మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/నకిరేకల్:** ప్రజల కోసం నిబద్ధతతో పనిచేసే నాయకత్వానికే గ్రామాల్లో స్థిరమైన ఆద రణ లభిస్తుందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు.శనివారం నకిరేకల్ పట్ట ణంలోని శ్రీనివాస పంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీతో నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా గెలు పొందిన సర్పంచులు, ఉపసర్పంచ్,వార్డ్ మెంబ ర్లమ ఆత్మీయ సన్మాన సభ కార్యక్రమంలో ఆయ న పాల్గొని మాట్లాడుతూ ప్రజా ప్రతినిధి అంటే హోదా కాదు, బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజలు నమ్మి ఓట్లు వేసి గెలిపించినప్పుడు వారి నమ్మకాన్ని నిలబెట్టేలా,ప్రజల సమస్యలను తమ విగా భావించి పరిష్కారానికి కృషి చేసినప్పుడు మాత్రమే విశ్వాసం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.అలాంటి నిజాయితీతో ప్రజల కోసం పనిచేసే సర్పంచులను ప్రజలే నిలబెడతా రని,అదే గ్రామ పాలనకు నిజమైన బలమని ఆయన పేర్కొన్నారు. భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ గ్రామల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని వారు పేర్కొన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం బిఆర్ఎస్ అధికారంలోకి రాద న్నారు. పార్టీకి నష్టం చేసిన వారిని ఉపేక్షించమని స్పష్టం చేశారు. రానున్న ఎంపిటిసి జడ్‌పిటిసి ఎన్నికల్లో రెట్టింపు ఉత్సాహంతో పని చేయా లని,నకిరేకల్ మున్సిపాలిటీ 20 వార్డులు, చిట్యాల 12 వార్డులులో కాంగ్రెస్ జెండా ఎగరా లని,ఏ ఎన్నిక అయినా రాష్ట్రంలో కాంగ్రెస్‌ని గెలి పించాలన్నారు. ఈకార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి,తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, కాంగ్రెస్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు పున్న కైలాష్ నేత,బిసిఫైనాన్ కార్పొరే షన్ మాజి చైర్మన్ పూజార్ల సాంబయ్య,కాంగ్రెస్ట్ మేనిఫెస్టో నెంబర్ చామల శ్రీనివాస్, నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రజిత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి,పిఎసి ఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని కొడంగల్‌గా తీర్చిదిద్దుతా

### దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ నియోజకవర్గాన్ని సిఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్ మాదిరిగా అభివృద్ధి చేస్తానని దేవరకొండ ఎంఎ ల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం దేవరకొండ నియోజకవ ర్గంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నూతన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌ల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో నల్లగొండ ఎంపి కుందూరు రఘువీర్‌రెడ్డితో కలిసి నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్‌లను శాలువా, మెమోం టోలతో సన్మానించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లా డుతూ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామాల నూతన పాలకవర్గాలకు సూచించారు. నిత్యం గ్రామాల్లో ఉంటూ ప్రజా సమ స్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రజలు ఇచ్చిన గుర్తింపును నిలబెట్టుకోవాలన్నారు. గ్రామాభివృద్ధి చేయడంతో పాటు పల్లెల్లో పరిశుభ్ర తకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. ప్రజల సంతోషమే లక్ష్యంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని, త్వరలో మిగిలిన హామీ లను కూడా అమలు చేస్తామన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో జరిగిన మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తన అధి పత్యాన్ని నిలబెట్టుకుందని తెలిపారు. 180 చోట్ల అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు గెలుపొందగా, కేవలం 50 స్థానాల్లో బిజెపి, బిఆర్ఎస్ బల పరిచిన అభ్యర్థులు గెలుపొందారని అన్నారు. ఈసమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళలు, నూతన సర్పంచ్‌లు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టు నేత హనుమంతు కుటుంబ సభ్యులకు సిపిఐ నేతలు పరామర్శ

### నేడు పుల్లెంలలో హనుమంతు అంత్యక్రియలు




**ప్రజాపక్షం/చండూరు:** ఒడిశాలోని కందమాల్ జిల్లా చరపాడ్ అడవుల్లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ,ఒడిశా రాష్ట్ర కమిటీ కార్యదర్శి పాక హనుమంతు అలియాస్ ఉయితే గణేష్ మరణించారు. పాక హనుమంతు స్వస్థలం నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామం. పాక హనుమంతు డెడ్‌బాడికి ఆది వారం పుల్లెంల గ్రామంలో అంత్యక్రియలు జరుగనున్నాయి. సిపిఐ జాతీయ కార్యదర్శి మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ నల్ల గొండ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం శనివారం పుల్లెంల గ్రామంలో పాక హనుమంతు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పాక చంద్రయ్య మొదటి నుండి సిపిఐ పార్టీకి చెందిన కుటుంబం అని ,పుల్లెంల గ్రామంలో సిపిఐ నిర్మాణంలో ముందుండి నడిపంచిన వారిలో ఒకరని ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి, నెల్లికంటి సత్యం గుర్తు చేశారు. పాక చంద్రయ్య ఎట్టమ్మ దంపతుల ఆరుగురు సంతానంలో హనుమంతు ఒకరని అన్నారు. 1981లో నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమ యంలో రాడికల్ స్టుడెంట్ యూనియన్‌లో చేరి పని చేశాడని అన్నారు. అప్పుడు జరిగిన ఏబివిపి నాయకుడు శ్రీనివాస్ హత్య కేసులో పాక హను మంతు కూడా నిందితుడు అని తేలడంతో , ఆ హత్య తర్వాత ఆయన పీపు ల్స్‌వార్ పార్టీలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఆయన తిరిగి రాలేదు. గత మూడు సంవత్సరాల క్రితం తల్లిదండ్రులు మరణించ ప్పుడు కూడా వారి అంత్యక్రియలకు రాలేదు. పార్టీలో అంచలంచలుగా ఎదిగి కేంద్ర కమిటీ సభ్యుడుగా గుర్తింపుతెచ్చుకున్నాడు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య , ఆర్.అంజా చారి, సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , మండల పార్టీ సహాయ కార్యదర్శి బొడ్డు వెంకటేశ్వర్లు, పుల్లెంల సర్పంచ్ ముక్కాముల వెంకన్న, ఉప సర్పంచ్ సిహెచ్ ఊషయ్య, దోనిపాముల ఉపస ర్పంచ్ తిప్పర్తి రాములు, శివర్ల లింగస్వామి, ఎండి కరీం, గడ్డం నవీన్ , పాక హనుమంతు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పటిష్టతకు ప్రతీ కార్యకర్తకూ పదవులు

### పిసిసి పరిశీలకులు బిజ్జి చత్రురావు, మానాల మోహన్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట :** కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం పాటుపడ్డ ప్రతి కార్యకర్తకు పదవులు వస్తాయని అన్ని మండలాల నుంచి డిసిసి కార్యవర్గ ఎన్నిక కూర్పు చేస్తున్నామని పిసిసి పరిశీలకులు బిజ్జి చత్రురావు, మానాల మోహన్ రెడ్డిలు అన్నారు. శనివారం స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యా లయం (రెడ్‌హౌస్)లో ఏర్పాటు చేసిన డిసిసి నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. జనవరి ఒకటో తేది వరకు జిల్లా కమిటి పూర్తి అవుతుందని పదవులు రానివారు సహకరించి కార్యవర్గా నికి బాసటగా నిలువాలన్నారు. అందరి సహకారంతోనే సూర్యాపేట జిల్లాలో అత్యధిక గ్రామ పంచాయితీ స్థానాలను గెలుపొందామని ఈ విజయంలో గెలుపొందిన వారి కంటే గెలుపుకు కృషి చేసిన వారికి ధన్యవాదాలు తెలుపు తున్నామన్నారు. నియోజక వర్గంలో రెండు ఉపాధ్యక్షులు, నాలుగు జనరల్ సెక్రటరీలు, మండలానికో సెక్రటరీ నియమించి డిసిసి కమిటిని పూర్తి చేస్తా మన్నారు. గ్రామస్థాయిలో నేతలను బలోపేతం చేసే దిశగా అన్ని మండలా లకు అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గత పది సంవత్సరాలుగా బిఆర్ ఎస్ పార్టీ కమిటిలు వేయకుండా కార్యకర్తలతో గులాం గిరి చేయించుకుంద న్నారు. మన పార్టీకి అన్ని రకాల కార్యవర్గాలు ఉన్నాయని ప్రజాస్వామ్యబ ద్ధంగా కాంగ్రెస్ ప్రజల్లోకి వెళ్తుందన్నారు. నూతన కార్యవర్గం అందరిని కలు పుకొని పనిచేస్తూ రాబోయే జడ్‌పిటిసి, ఎంపిటిసి, మున్సిపల్ ఎన్నికల్లో విజ యకేతనం ఎగురవేయాలన్నారు. పదవులు రాలేదని బాధపడవద్దని కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఎలాంటి అవకాశాలు వస్తాయో ఎవరూ చెప్పలేరన్నారు. అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తూ ముఖ్యంగా మహిళలకు 20శాతం పద వులు కేటాయించనున్నట్లు తెలిపారు. గత పదేండ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో కెసిఆర్ కుటుంబ సభ్యులతో కుటుంబపాలన కొనసాగించాడన్నారు. లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డారని స్వయాన ఆయన కుమార్తె చెప్పిందని తెలిపారు. కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావులే కాకుండా వారి కుటుంబ సభ్యుడిగా ఉండే మరో తిమింగలం సూర్యాపేట శాసనసభ్యులు జగదీష్‌రెడ్డి అన్నారు. పదేం డ్లలో జరిగిన అవినీతిలో జగదీష్‌రెడ్డికి కూడా భాగం ఉందని సామాన్య వ్యక్తిగా ఉన్న జగదీష్‌రెడ్డికి వందల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ప్రతి కార్యకర్త విజయమని పద వులు రానివారు అధైర్యపడకుండా శక్తివంచన లేకుండా పనిచేసే పార్టీ పటిష్ట తను పెంపొందించాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవ సాయ, రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, కక్కిరేణి శ్రీనివాస్, అబ్దుల్ రహీం, కుమ్మరి కుంట్ల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాపాలనలో సర్పంచ్‌లు భాగస్వామ్యం కావాలి

### భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

### రాజకీయాలకు అతీతంగా 968 మంది సర్పంచులకు 'స్వీట్ బాక్సులు'





**ప్రజాపక్షం/యాదాద్రి :** రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమైన 'ప్రజా పాలన' విజయవంతం కావాలంటే క్షేత్రస్థాయిలో సర్పంచుల భాగ స్వామ్యం ఎంతో కీలకమని భువనగిరి పార్ల మెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. నూతన సంవత్సర, సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని ఆయన తన నియోజకవర్గ పరిధిలో ఒక వినూత్నమైన సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. భువన గిరి లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజ కవర్గాల్లో ఉన్న 968 గ్రామ పంచాయతీల నూతన సర్పంచులకు ఎంపీ స్వీట్ బాక్సు లను, గ్రీటింగ్ కార్డులను పంపించారు. సాధారణంగా రాజకీయాల్లో అధికార, ప్రతి పక్షాల మధ్య వైరుధ్యాలు సహజం. కానీ ఎంపీ చామల కిరణ్ రెడ్డి పార్టీలకతీతంగా అందరు సర్పంచులను గౌరవించాలని నిర్ణ యించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సర్పంచు లతో పాటు బిఆర్ఎస్, బిజెపి , స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన వారందరికీ వ్యక్తిగతంగా ఈ కానుకలను చేరవేశారు.

**ప్రత్యేక ఆకర్షణగా జగదీష్ రెడ్డి తండ్రికి శుభాకాంక్షలు**

బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తండ్రి, నాగారం సర్పంచ్ అయిన గుంటకండ్ల రామచంద్రారెడ్డికి కూడా ఎంపీ చామల స్వీట్ బాక్స్ పంపించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం నియోజకవ ర్గంలో చర్చనీయాంశమైంది. రాజకీయ విభేదాలు పక్కన పెట్టి, పదవిలో ఉన్న ప్రజా ప్రతినిధులను గౌరవించే ఈ సంస్కృతిపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమ వుతున్నాయి.


**తెలంగాణ రైజింగ్‌లో గ్రామాల పాత్రే కీలకం**

'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలి. తెలంగాణ అభివృద్ధి చెందా లంటే గ్రామాలు బాగుండాలి. అందుకే రాజకీయాలకు తావు లేకుండా సర్పంచులందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి.' అని గ్రీటింగ్ కార్డులో ఎంపీ చాముల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తమ గ్రామాల అభి వృద్ధికి ఎంపీ సహకారం ఉంటుందని భరోసా కల్పించినందుకు, పండుగ వేళ తమను గుర్తుపెట్టుకుని శుభాకాంక్షలు తెలిపినందుకు నూతన సర్పంచులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఈ స్వీట్ బాక్సుల పంపిణీ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.



## బిసి రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే సహించం : జెఎసి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎంపీటీసీ, జడ్పీ టీసీ ఎన్నికలు నిర్వహిస్తే సహించేది లేదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. శనివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ గతంలో సీఎం రేవంత్‌రెడ్డి రిజర్వేషన్లు పెంచిన తరువాతనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్ని కలు నిర్వహిస్తామని చెప్పి ఇప్పుడు మాట మార్చి అసెంబ్లీ సమావేశాల్లో ఎన్ని కలపై నిర్ణయం తీసుకుంటామని అనడం మంచి పద్ధతి కాదన్నారు. ఈనెల 29నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లేలా అసెంబ్లీ వేదికగా ఒక రాజ కీయ కార్యాచరణ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేష న్లకు కట్టుబడి ఉంటామని అసెంబ్లీలో ప్రకటించిన రాజకీయ పార్టీలు ఇప్పుడు మాట మార్చి వ్యవహరిస్తున్నాయని, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒకవైపు బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు హరీష్‌రావు డిమాండ్ చేయడం సిగ్గుచేటన్నారు. కార్య క్రమంలో బంటు వెంకటేశ్వర్లు, గుండెబోయిన నాగేశ్వర్‌రావుయాదవ్, బంటు కవిత, కుమ్మరికుంట్ల సుధాకర్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ముగ్గురు దోపిడీ దారులు అరెస్ట్

**హోషియార్‌పూర్:** పంజాబ్‌లోని హోషియార్‌పూర్ జిల్లా గఢ్‌శంకర్ ప్రాంతంలో శనివారం పోలీసులతో జరిగిన కాల్పుల తర్వాత దోపిడీలకు పాల్పడిన ఒక ముఠాకు చెందిన ముగ్గురు సభ్యులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. హోషియార్‌పూర్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సందీప్ కుమార్ మాలిక్ మాట్లాడుతూ, నిందితులు డిసెంబర్ 16న మహిల్‌పూర్‌లోని ఒక మనీ ఎక్స్ఛేంజ్ దుకాణంలో జరిగిన దోపిడీలో పాలుపంచుకున్నారని, ఆ సమయంలో రూ. 4 లక్షలకు పైగా దోచుకున్నారని చెప్పారు. పారిపోతున్నప్పుడు, నిందితులు తమ మోటార్‌సైకిల్ జారిపడటంతో దానిని ఒ టక వాగులో వదిలేశారని, అయితే ఆ సమయంలో వారు తప్పించుకోగలిగారని ఆయన తెలిపారు. గతంలో జరిపిన దర్యాప్తులో దిలావర్ సింగ్ అలియాస్ జోరాను అరెస్టు చేశామని, ఆ తర్వాత మిగిలిన నిందితులు మరో నేరానికి ప్లాన్ చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందిందని ఎస్‌ఎస్‌పి చెప్పారు. శనివారం, గఢ్‌శంకర్ ప్రాంతంలోని బిల్డోన్ గ్రామం సమీపంలో సాధారణ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నప్పుడు, నంబర్ ప్లేట్ లేని అనుమానాస్పద మోటార్‌సైకిల్‌ను పోలీసులు గుర్తించారు. ఆగమని సంకేతం ఇవ్వగా, అందులో ఉన్నవారు పోలీసులపై కాల్పులు జరిపారని మాలిక్ చెప్పారు.

మాదకద్రవ్యాల దుర్వినియోగం
## హర్యానా యువతను పీడిస్తోంది
పరిస్థితి మరింత దిగజారుతోంది
రణదీప్ సుర్జేవాలా



**చండీగఢ్:** హర్యానాలో మాదకద్రవ్యాల దుర్వినియోగం తీవ్రమైన ప్రజా ఆరోగ్య సంక్షోభంగా మారిందని, యువత దీనివల్ల తీవ్రంగా ప్రభావితమవుతున్నారని ఒక నివేదికను ఉటంకిస్తూ కాంగ్రెస్ నాయకుడు రణదీప్ సింగ్ సుర్జేవాలా పేర్కొన్నారు. రోహ్‌తక్ పిజిఐ నివేదిక ప్రకారం, 15 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలు మాదకద్రవ్యాల వ్యసనానికి ఎక్కువగా బానిసలవుతున్నారన్నారు. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, మాదకద్రవ్యాల దుర్వినియోగంతో ప్రభావితమైన వారిలో సుమారు 74 శాతం మంది 25 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారే. వారిలో, దాదాపు 73 శాతం మంది చికిత్స పొందిన తర్వాత కూడా తిరిగి వ్యసనానికి బానిసలవుతున్నారు. ఇది సమస్య తీవ్రతను తెలియజేస్తుందని ఆయన అన్నారు. ప్రభుత్వ మాదకద్రవ్యాల కౌన్సెలింగ్ డేటా ప్రకారం... గత ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్య సన విముక్తి కేంద్రాలలో చికిత్స కోసం 1,84,163 మంది యువకులు నమోదు చేసుకున్నా రని ఆయన తెలిపారు.వయస్సుల వారీగా గణాంకాలను పరిశీలిస్తే... మాదకద్రవ్యాలు వాడే వా రిలో 46 శాతం మంది 19–25 సంవత్సరాల వ యస్సుల వారు ఉన్నారు. 28 శాతం మంది 15 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు వారు కాగా 21 శాతం మంది 26 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు వారు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంక్షోభం మరింత తీవ్రంగా ఉందని, పట్టణ ప్రాంతాల నుండి 38 శాతం కేసులు నమోదవ్వగా, గ్రామాల నుండి 62 శాతం కేసులు నమోదయ్యాయని డేటా చూపిస్తోందని ఆయన అన్నారు. గత ఏడాదితో పోలిస్తే మాదకద్రవ్యాల దుర్వినియోగం కేసులు సుమారు 35 శాతం పెరగడంతో మొత్తం పరిస్థితి మరింత దిగజారిందని సుర్జేవాలా అన్నారు.

ప్రజాస్వామ్య హక్కులు పరిమితం చేసేందుకు
# ‘సర్’ ఒక నిశితమైన కుట్ర
❑ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ :** గ్రామీణ ఉపాధి పథకం ఎంజిఎన్‌ఆర్ఇజిఎ రద్దుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమాన్ని ప్రారంభించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ప్రభుత్వం చివరికి వెనక్కి తీసుకోవలసి వచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం మాదిరిగానే ఈ ఉద్యమం ఉండాలని ఆయన సూచించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) అనేది ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేయడానికి చేసిన ఒక ‘సునిశితమైన కుట్ర’ అని కూడా ఖర్గే అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, పౌరుల హక్కులు తీవ్ర ముప్పులో ఉన్నాయన్నారు. శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాకూటమి ఓటమి తర్వాత మొదటిసారిగా జరిగిన ఈ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌తో పాటు ఇతర అగ్ర నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశంలో పార్టీ నాయకుడు శశి థరూర్ కూడా పాల్గొన్నారు. సమావేశానికి ముందు, పార్టీ అగ్ర నాయకులు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. దివంగత కాంగ్రెస్ నాయకులు శివరాజ్ పాటిల్, శ్రీప్రకాష్ జైస్వాల్‌కు నివాళులర్పించడానికి రెండు నిమిషాల మౌనం పాటించారు. సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్ఇజిఎ) యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన ఒక దార్శనిక చట్టమని, దీనిని ప్రపంచవ్యాప్తంగా ప్రశంసించారని ఖర్గే అన్నారు. ఈ పథకం చూపిన ప్రభావం కారణంగా దీనికి మహాత్మా గాంధీ పేరు పెట్టారని ఆయన చెప్పారు. ‘ఎంజిఎన్‌ఆర్ఇజిఎను రద్దు చేయడం మహాత్మా గాంధీకి అవమానం’ అని ఆయన అన్నారు. దీనిని పని హక్కుపై దాడిగా అభివర్ణించారు. ‘మోడీ ప్రభుత్వం ఎటువంటి అధ్యయనం, రాష్ట్రాలు, రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరపకుండా చట్టాన్ని రద్దు చేసింది. ప్రభుత్వ ఈ చర్యను దేశవ్యాప్తంగా వ్యతిరేకించాలి’ అని ఆయన పిలుపునిచ్చారు. భారతదేశ భూసేకరణ చట్టానికి 2015లో చేసిన సవరణలను సమర్థవంతంగా వెనక్కి తీసుకున్న ఘటనలతో సహా గతంలో జరిగిన ఉదాహరణలను కాంగ్రెస్ అధినేత ఉదహరించారు. మొదట ఆర్డినెన్స్‌లుగా తీసుకువచ్చి, ఆ తర్వాత ప్రతిపక్షాల నిరసనల మధ్య పార్లమెంటులో ఆమోదించబడినా 2020–21 రైతుల నిరసనల తర్వాత రద్దు చేయవలసి వచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను కూడా ఆయన ప్రస్తావించారు. ‘వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుంటారని రాహుల్ గాంధీ చాలా కాలం క్రితమే అంచనా వేశారు. ఇప్పుడు, ఎంజిఎన్‌ఆర్ఇజిఎను కూడా తిరిగి తీసుకురావాల్సి వస్తుందని ఆయన చెప్పారు‘ అని ఖర్గే అన్నారు. ఎంజిఎన్‌ఆర్ఇజిఎపై పటిష్టమైన ప్రణాళికలు రూపొందించి, దేశవ్యాప్త ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించడం మనందరి సామూహిక బాధ్యత అని, ఈ ‘కష్టకాలంలో‘ ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని ఆయన అన్నారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియపై మాట్లాడుతూ, ఇది ఒక తీవ్రమైన సమస్య అని, ప్రజల ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేయడానికి చేసిన ఒక సునిశితమైన కుట్ర అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. రాహుల్ జీ ‘ఓట్ల దొంగతనం’పై అనేక ఉదాహరణలు, వాస్తవాలను సమర్పించారని, బిజెపికి, ఎన్నికల సంఘానికి మధ్య కుమ్మక్కు ఉందని, మన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా చూసుకోవాలని చెప్పారు. దళితులు, గిరిజనులు, అత్యంత వెనుకబడిన తరగతులు, మైనారిటీల పేర్లు తొలగించబడకుండా లేదా ఇతర బూత్‌లకు బదిలీ చేయబడకుండా కూడా మనం నిర్ధారించుకోవాలన్నారు. దీని కోసం, మన బూత్ స్థాయి ఏజెంట్లు ఇంటింటికీ వెళ్లవలసి ఉంటుందని ఖర్గే చెప్పారు. 2027లో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో పని ప్రారంభించాలని ఆయన పార్టీ సభ్యులకు పిలుపునిచ్చారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరుగుతున్న దాడులను ఖర్గే ఖండించారు. ఈ విషయంపై యావత్ దేశం ఆందోళన చెందుతోందని అన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుబంధంగా ఉన్న సంస్థలు క్రిస్మస్ వేడుకలపై చేసిన దాడులు మత సామరస్యాన్ని దెబ్బతీశాయని, ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రతిష్టను మసకబార్చాయని ఆయన అన్నారు.

# ‘ఆపరేషన్ ఆఘాత్ 3.0’



- ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో పోలీసులు అర్ధరాత్రి వేళ తనిఖీలు
- 966 మందిని అదుపులోకి... మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం, వాహనాలను స్వాధీనం

**న్యూఢిల్లీ :** కొత్త సంవత్సర వేడుకల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. ‘ఆపరేషన్ ఆఘాత్ 3.0’ పేరిట అగ్నేయ ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో పోలీసులు అర్ధరాత్రి వేళ తనిఖీలు నిర్వహించారు. వీధి రౌడీలు, నేరస్థులతో సంబంధం ఉన్న అనుమానితులే లక్ష్యంగా తనిఖీలు చేశారు. కొత్త సంవత్సర వేడుకల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా దీన్ని నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈ చర్యల్లో భాగంగా 966 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఆయుధాలు, మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం, వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు శనివారం తెలిపారు. సంవత్సరాంతపు వేడుకల సమయంలో ప్రజల రద్దీ పెరిగిన దృష్ట్యా, వ్యవస్థీకృత నేరాలు, వీధి నేరాలు, పాత నేరస్థుల కార్యకలాపాలను అరికట్టడానికి ‘ఆపరేషన్ ఆఘాత్ 3.0’ పేరుతో ఈ ఆపరేషన్ ప్రారంభించినట్లు వారు చెప్పారు. మొత్తం అరెస్టు అయిన వారిలో 331 మంది నిందితులను ఢిల్లీ ఎక్సైజ్ చట్టం, ఎన్‌డిపిఎస్ చట్టం, పబ్లిక్ గ్యాంబ్లింగ్ చట్టం కింద అరెస్టు చేయగా, 504 మందిని వివిధ నివారణ నిబంధనల కింద అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. లక్షిత చర్యల్లో భాగంగా, పోలీసులు 116 మంది జాబితాలో ఉన్న రౌడీలను అదుపులోకి తీసుకున్నారు, ఐదుగురు ఆటో దొంగలను, నలుగురు పరారీలో ఉన్న నేరస్థులను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్ సమయంలో, పోలీసులు ఆయుధాల చట్టం కింద 21 నాటు తుపాకులు, 20 లైవ్ కార్ట్రిడ్జిలు, 27 కత్తులను స్వాధీనం చేసుకున్నారు. 12,258 క్వార్టర్ల అక్రమ మద్యం, 6.01 కిలోల గంజాయి, జూదగాళ్ల నుండి రూ. 2.36 లక్షల నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 310 మొబైల్ ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలు, ఒక నాలుగు చక్రాల వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఢిల్లీ పోలీస్ చట్టం కింద 1,306 మందిపై చర్యలు తీసుకోగా, నిబంధనల ఉల్లంఘనలకు గాను 231 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 600 మందికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించి ఈ దాడులు నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకల సమయంలో, ముఖ్యంగా నివాస ప్రాంతాలు, మురికివాడల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడం, వ్యవస్థీకృత నేరాల నెట్‌వర్క్‌లు, పాత నేరస్థులను నిరోధించడం ఈ ఆపరేషన్ యొక్క లక్ష్యమని పోలీసులు తెలిపారు. తగిన కేసులలో బిఎన్ఎస్ సెక్షన్లు 111, 112 తో సహా కఠినమైన చట్టపరమైన నిబంధనలను అమలు చేస్తామని, పాత నేరస్థులను బహిష్కరించడానికి కూడా ప్రతిపాదనలు ప్రారంభిస్తున్నామని అధికారులు తెలిపారు. గత నెల రోజులుగా జిల్లాలో పెట్రోలింగ్, వాహనాల తనిఖీ, రాత్రి నిఘాను ముమ్మరం చేయడం వల్ల వీధి నేరాలకు సంబంధించిన పిసిఆర్ కాల్స్ తగ్గాయని పోలీసులు తెలిపారు

## బిజెపి పాలిత రాష్ట్రాల్లో బెంగాలీలపై దాడి

వలసకార్మికుడి హత్యలో
జీరో ఎఫ్ఐఆర్ నమోదు
బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం
మమతా బెనర్జీ



**కోల్‌కతా :** బిజెపి పాలిత ఒడిశాలోని సంబల్‌పూర్ జిల్లాలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన 30 ఏళ్ల వలస కార్మికుడు హత్యకు గురైన కొన్ని రోజుల తర్వాత, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. ‘జీరో ఎఫ్ఐఆర్’ నమోదు అయిందని, దర్యాప్తు నిమిత్తం రాష్ట్ర పోలీసు బృందం పొరుగు రాష్ట్రానికి వెళ్లిందని తెలిపారు. ప్రతి బిజెపి పాలిత రాష్ట్రంలో బెంగాలీ మాట్లాడే ప్రజలపై జరుగుతున్న క్రూరమైన అణచివేత, వేధింపులు, హింసను ఆమె ఖండించారు. బుధవారం బీడి విషయంలో జరిగిన వాగ్వాదం తర్వాత పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆ వలస కార్మికుడు సంబల్‌పూర్ జిల్లాలో హత్యకు గురైనట్లు ఆరోపణలు వచ్చాయి. యువకుడు జ్యువెల్ రాణా హత్యకు సంబంధించి, పశ్చిమ బెంగాల్ పోలీసులు ఇప్పటికే సూటి పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆరుగురు నిందితులను అరెస్టు చేశారని బెనర్జీ చెప్పారు. దర్యాప్తు నిర్వహించడానికి పశ్చిమ బెంగాల్ నుండి ఒక పోలీసు బృందం ఒడిశాకు వెళ్లిందన్నారు. బెదిరింపులకు, బాధితులుగా మారిన, అమానవీయ ప్రవర్తనకు గురైన ఆ వలస బెంగాలీ మాట్లాడే కుటుంబాలకు తాము గట్టిగా అండగా నిలబడతామని, వారికి సాధ్యమైన సహాయాన్ని అందిస్తామని హామీనిచ్చారు. ఈ మేరకు మమత శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. సంబల్‌పూర్ ఘటనను ప్రస్తావిస్తూ, ముర్షిదాబాద్‌లోని జంగీపూర్ ప్రాంతానికి చెందిన వలస కార్మికులు బిజెపి పాలిత ఒడిశాలో తీవ్రమైన అకృత్యాలను ఎదుర్కొన్నారని ఆమె అన్నారు. ముర్షిదాబాద్‌లోని జంగీపూర్‌లోని సూటి ప్రాంతానికి చెందిన ఒక యువ వలస కార్మికుడిని డిసెంబర్ 24న సంబల్‌పూర్‌లో మళ్లీ కొట్టి చంపడం చాలా దురదృష్టకరమని ఆమె సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో అన్నారు. ముస్లింలు అధికంగా ఉన్న ముర్షిదాబాద్ నుండి వచ్చిన వలస కార్మికులు ఇప్పుడు భయంతో ఇళ్లకు తిరిగి వస్తున్నారని బెనర్జీ ఆరోపించారు.

## కేరళలో ఎఐ ఫొటో షేర్ చేసిన కాంగ్రెస్ నేత అరెస్టు

**కోజికోడ్ :** శబరిమల బంగారు కేసులో నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టితో కలిసి ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను చిత్రీకరిస్తున్న కృత్రిమ మేధస్సు (ఎఐ) ద్వారా రూపొందించిన ఫోటోను షేర్ చేసిన ఆరోపణలపై శనివారం కాంగ్రెస్ నాయకుడిని అరెస్టు చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడైన ఎన్ సుబ్రహ్మణియన్‌పై కేసు నమోదు చేసిన తర్వాత చెవయూర్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం అతని అరెస్టును నమోదు చేసి, స్టేషన్ బెయిల్‌పై విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు.ముఖ్యమంత్రి, పొట్టి కలిసి ఉన్న ఫోటోను, వారిద్దరి మధ్య ఉన్న సన్నిహిత సంబంధానికి కారణాన్ని ప్రశ్నిస్తూ ఉన్న శీర్షికతో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో పోస్ట్ చేసినందుకు అతనిపై కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా, సుబ్రహ్మణియన్ వాంగ్మూలాన్ని నమోదు చేయడానికి శనివారం ఉదయం పోలీసు బృందం అతని ఇంటికి చేరుకుంది. అనంతరం, వివరణాత్మక విచారణ కోసం అతడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న చిత్రం ఎఐ ద్వారా రూపొందించబడినదని సిపిఐ(ఎం) పేర్కొంది. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లే ముందు, తాను షేర్ చేసిన ఫోటో ఎఐ ద్వారా రూపొందించబడలేదని, ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన వీడియో నుండి తీసుకున్నదని సుబ్రహ్మణియన్ విలేకరులతో అన్నారు. పోలీసులు చెప్పేది ప్రభుత్వ మాటలే. వారు ప్రతిదాన్నీ ఎఐ ద్వారా ముద్ర వేస్తున్నారని ఆ యన ఆరోపించారు.

# హిమాచల్‌లో డాక్టర్ల సమ్మె

- రోగితో ఘర్షణ పడినందుకు డాక్టర్‌ను తొలగించడంపై వైద్యుల సంఘం ఆగ్రహం
- రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిన వైద్య సేవలు



**సిమ్లా :** హిమాచల్ ప్రదేశ్‌లోని అనేక ఆసుపత్రులలో అత్యవసర సేవలు మినహా వైద్య సేవలు నిలిచిపోయాయి. రోగితో ఘర్షణకు దిగిన వైద్యుడిని తొలగించడాన్ని నిరసిస్తూ రెసిడెంట్ వైద్యులు శనివారం నిరవధిక సమ్మెకు దిగారు. 48 గంటల్లోనే వైద్యుడిని తొలగించడం అన్యాయమని, దీనిపై వైద్యుల సంఘాలు ఆగ్రహంతో ఉన్నాయని డాక్టర్లు పేర్కొన్నారు. అయితే డాక్టర్ల సమ్మెతో రోగులు, సహాయకులు, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల నుండి వచ్చేవారు, వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ‘నా తండ్రి చికిత్స కోసం నేను గురువారం సిమ్లా నుండి 125 కిలోమీటర్ల దూరంలో ఉన్న అని నుండి ఇక్కడికి వచ్చాను. కానీ సమ్మె కారణంగా వైద్యులు ఎవరూ అందుబాటులో లేరు. మేము అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నాము‘ అని ఒక రోగితో పాటు వచ్చిన కృష్ణన్ సింగ్ ఠాకూర్ అన్నారు. ఇదిలా ఉండగా, సిమ్లా, ధర్మశాల, నహాన్, హమీర్‌పూర్, ఉనా, అనేక ఇతర జిల్లాల నుండి సమ్మె కారణంగా వైద్య సేవలు నిలిచిపోయినట్లు నివేదికలు వచ్చాయి. ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీ (ఐజిఎంసి), రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల రెసిడెంట్ వైద్యులు శుక్రవారం పెద్ద ఎత్తున సెలవుపై వెళ్లారు. శనివారం నుండి నిరవధిక సమ్మెను ప్రకటించిన రెసిడెంట్ డాక్టర్ల సంఘం, సమ్మె సమయంలో సాధారణ సేవలు, ఎలక్టివ్ ఆపరేషన్ థియేటర్లు, అవుట్ పేషెంట్ విభాగాలు (ఒపిడి) మూసివేయబడతాయని, అత్యవసర సేవలు మాత్రమే పనిచేస్తాయని పేర్కొంది. ‘అత్యవసర సేవలు పనిచేస్తున్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు సహా కన్సల్టెంట్లు ఇండోర్ రోగులకు, ఒపిటికి సేవలు అందిస్తున్నారు. అయితే, ప్రణాళికాబద్ధమైన శస్త్రచికిత్సలకు సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయి’ అని ఐజిఎంసి డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ భాటియా శనివారం తెలిపారు. ఐజిఎంసి రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సోహైల్ శర్మ మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈ విషయంపై విచారణ నిర్వహిస్తామని హామీ ఇచ్చారని, అయితే డాక్టర్ తొలగింపు వైద్య వర్గాలకు ప్రతికూల సందేశాన్ని పంపిందని, వారు అవమానంగా, అసురక్షితంగా భావిస్తున్నారని అన్నారు. ‘డాక్టర్ కావడానికి చాలా ప్రయత్నం, పరీక్షలు అవసరం, అతను కూడా ఒక మనిషి. దుష్ప్రవర్తన జరిగిందని మేము అంగీకరిస్తున్నాము, దీనికి డాక్టర్‌ను ఆరు గంటల్లో సస్పెండ్ చేశారు. కానీ క్రమశిక్షణా కమిటీ నివేదిక ఆధారంగా 48 గంటల్లోనే తొలగించడం సమర్థనీయం కాదు. తొలగింపు ఉత్తర్వులను రద్దు చేయడమే మా ఏకైక డిమాండ్’ అని ఆయన అన్నారు. రోగితో శారీరకంగా గొడవకు దిగారనే ఆరోపణలతో డాక్టర్ రాఘవ్ నరులా సేవలను బుధవారం హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం రద్దు చేసింది.

## బెంగాల్‌లో ‘సర్’ విచారణలు

- రాష్ట్రవ్యాప్తంగా 3,234 కేంద్రాల ముందు ప్రజల క్యూ



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్‌ఐఆర్) కింద విచారణలు జరుగుతున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా 3,234 కేంద్రాల ముందు ప్రజలు క్యూ కట్టారని ఒక సీనియర్ అధికారి తెలిపారు. 2002 నాటి ఓటర్ల జాబితాతో తమకు సంబంధాన్ని నిరూపించుకోలేని సుమారు 32 లక్షల మంది ‘మ్యాపింగ్ కాని’ ఓటర్లను మొదటి దశలో విచారణకు పిలుస్తామని ఆయన చెప్పారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన మొదటి దశ విచారణల కోసం మొత్తం 4,500 మంది మైక్రో అబ్జర్వర్‌లను నియమించారు. ఓటర్లు గుర్తింపు, చిరునామా రుజువుగా ఆధార్‌తో సహా 12 గుర్తింపు పొందిన పత్రాలలో దేనినైనా సమర్పించవచ్చని ఎన్నికల సంఘం అధికారి తెలిపారు. అయితే, ఆధార్ కార్డును కేవలం ఒకే పత్రంగా అంగీకరించబోమని ఆయన అన్నారు. 85 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు విచారణ శిబిరాలకు వ్యక్తిగతంగా రావాల్సిన అవసరం లేదని, ఎన్నికల సంఘం అధికారులు వారి నివాసాలలోనే ఈ ప్రక్రియను చేపడతారని ఆయన చెప్పారు. ‘ఈ విచారణ ప్రక్రియ 4,500 మందికి పైగా మైక్రో అబ్జర్వర్‌ల పర్యవేక్షణలో జరుగుతోంది. కేంద్రాలలోకి ఇఆర్‌ఓలు, ఎఆర్‌ఓలు, బిఎల్‌ఓలు, అబ్జర్వర్‌ల వంటి అధీకృత అధికారులను మాత్రమే అనుమతిస్తున్నారు. ప్రతి శిబిరం ముందు ప్రజలు పెద్ద సంఖ్యలో బారులు తీరారు’ అని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (ఇసిఒ) కార్యాలయంలోని అధికారి తెలిపారు.సవరణ ప్రక్రియలో పారదర్శకత, కచ్చితత్వాన్ని నిర్ధారించే లక్ష్యంతో ఈ చర్యలు తీసుకున్నందున, విచారణ కేంద్రాలను ఖరారు చేసిన తర్వాత ఎటువంటి మార్పులకు అనుమతి లేదు. ఎన్నికల సంఘం (ఇసి) డిసెంబర్ 16న ఎస్‌ఐఆర్ తర్వాత రాష్ట్ర ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించింది. మరణం, వలసలు, గణన ఫారాలను సమర్పించకపోవడం వంటి వివిధ కారణాల వల్ల 58 లక్షలకు పైగా ఓటర్ల పేర్లను తొలగించింది.



సిపిఐ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా కోల్‌కతాలో భారీ ర్యాలీ

## బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌పై దిగ్విజయ్ ప్రశంసలు

కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పి
ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల సంస్థాగత నిర్మాణం గురించి మాత్రమే చెప్పానని దిగ్విజయ్ వివరణ

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ ఎం పి దిగ్విజయ్ సింగ్ చేసిన సోషల్ మీడియా పోస్ట్ హస్తం పార్టీకి కొత్త తలనొప్పి తెచ్చి పెట్టింది. ప్ర ధాని నరేంద్ర మోదీ పాత ఫొటోను షేర్ చేస్తూ, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ సంస్థాగత బలాన్ని ఆయన ప్ర శంసించడం రాజకీయ వర్గాల్లో పెను దుమారం రే పుతోంది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) స మావేశం జరుగుతున్న సమయంలోనే దిగ్విజయ్ సింగ్ ఈ పోస్ట్ చేయడం మరింత ప్రాధాన్యతను స ంతరించుకొన్నది. కాంగ్రెస్ సీనియర్ నేత అయిన దిగ్విజయ్ సింగ్ 1990ల నాటి ఓ అరుదైన ఫొ టోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అ ందులో బిజెపి దిగ్గజం ఎల్‌కె అద్వానీ కుర్చీలో కూ ర్చొని ఉండగా, ఆయన పాదాల చెంతలో నేలపై ఒక సామాన్య కార్యకర్తలా (నేటి ప్రధాని) నరేంద్ర మోదీ కూర్చొన్నారు. ఆ చిత్రం కింద దిగ్విజయ్ సింగ్ ఓ ఆసక్తికరమైన విషయం చెప్పారు. ‘ఒక సమాన్య ఆర్‌ఎస్ఎస్ స్వయంసేవక్, జన్‌సంఘ్/బిజెపి కార్యకర్త నేల మీద కూర్చునే స్థాయి నుంచి దేశ ప్రధాని స్థాయికి ఎదిగారంటే, అది ఆ సంస్థ క్రమశిక్షణకు, బలానికి నిదర్శనం’ అని అన్నారు. తాను పెట్టిన ఈ పోస్టు గురించి తీవ్రస్థాయిలో దుమారం చెలరేగిన నేపథ్యంలో దిగ్విజయ్ సింగ్ తాజాగా దీనిపై స్పందించారు. ‘నేను కేవలం ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల సంస్థాగత నిర్మాణం గురించి మాత్రమే చెప్పాను. బిజెపి భావజాలాన్ని ఎప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉంటాను అని స్పష్టం చేశారు.

## మా రాష్ట్ర వ్యవహారాల్లో జోక్యమొద్దు
❑ కేరళ సిఎం విజయన్‌కు
కర్ణాటక డిప్యూటీ సిఎం డికె సలహా

**బెంగళూరు:** ఉత్తర బెంగళూరులో ఆక్రమణల తొలగింపు డ్రైవ్‌కు సంబంధించి కర్ణాటక వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి కె శివకుమార్ కేరళ ముఖ్యమంత్రికి సలహా ఇచ్చారు. శుక్రవారం కర్ణాటక రాజధానిలో ముస్లిం నివాస ప్రాంతాలను కూల్చివేస్తున్నారనే వార్తలపై విజయన్ తీవ్రంగా విమర్శించారు. ఈ చర్యను దిగ్భ్రాంతికరం, బాధాకరం అని అభివర్ణించారు. తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో విజయన్ చాలా సంవత్సరాలుగా ముస్లిం కుటుంబాలు నివసిస్తున్న ఫకీర్ కాలనీ, వసీం లేఅవుట్‌లను బుల్డోజర్లతో కూల్చివేస్తున్నారనే వార్తలను ప్రస్తావించారు.


SHRIRAM Finance — వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS03UA 3795 | Shivaratri Srinivas | MAHINRA BOLLERO MAXI TRUCK PLUS | 2014 |
| 2 | TS12UC 2493 | Shaik Bade Saleem | TATA LPK 909 FBT | 2012 |
| 3 | TS15EE 4967 | Ramesh Gollena | EICHER 380 | 2015 |
| 4 | TS16UA 5182 | Kantharao Peryala | SWARAJ 735FE | 2015 |
| 5 | TS09UA 8838 | Burra Sampath | MARUTHI RITZ DIESEL-P | 2016 |
| 6 | TS03E 0364 | Asari Anil | JOHN DEERE 5310 HARVESTER | 2018 |

AUCTION DATE: 30-12-2025
VENUE : SHRIRAM AUTOMALL KARIMNAGAR, ALUGUNURU, HYDERABAD ROAD, KARIMNAGAR
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
H.No :12-209/1,1st floor, Upstairs of Telangana Grameena Bank, Warangal Road, Huzurabad. Cell : 9866244432




## కంప్యూటర్లకు సరిహద్దులు!



కంప్యూటర్లు దశాబ్దాలుగా వేగం పెరగడం, మెమరీ విస్తరించడం ద్వారా అభివృద్ధి చెందాయి. కానీ భౌతికశాస్త్రం, గణితశాస్త్ర సిద్ధాంతాలు కంప్యూటర్లకు ఒక స్పష్టమైన సరిహద్దును చూపిస్తున్నాయి. కొన్ని క్వాంటం స్థితులు అంతగా సంక్లిష్టంగా విస్తరిస్తాయి కాబట్టి, వాటిని పూర్తిగా వర్ణించడానికి అవసరమైన క్లాసికల్ బిట్ల సంఖ్య అసాధ్యమైన స్థాయికి చేరుతుంది. అలాంటి స్థితులను సిమ్యులేట్ చేయడానికి, సిద్ధాంతపరంగా విశ్వంలో ఉన్న అణువుల సంఖ్యకంటే ఎక్కువ మెమరీ అవసరం అవుతుంది. ఎంత సమయం, ఎంత శక్తి ఉన్నా అది సాధ్యం కాదని ఈ పరిమితి సూచిస్తుంది. ఇది హైప్ లేదా ఊహ కాదు. కాంప్లెక్సిటీ సిద్ధాంతం ద్వారా గణితశాస్త్రవేత్తలు ఈ పరిమితులను కఠినంగా నిరూపించారు. ప్రయోగాలలో కూడా చిన్న స్థాయిలో అయినా, నిజమైన క్వాంటం డివైస్‌లతో ఈ భావనను చూపించారు. క్వాంటం ఎంటాంగిల్‌మెంట్, ఇంటర్‌ఫెరెన్స్ వంటి ప్రభావాల వల్ల కొన్ని ప్యాటర్న్‌లు ఏర్పడతాయి. వాటిని ఎంత పాలిష్‌ట్రిక్‌తోనూ క్లాసికల్ కంప్యూటర్ కంప్రెస్ చేయలేదు. ప్రతి కొత్త కణం వ్యవస్థలో చేరినప్పుడల్లా అవకాశాల సంఖ్య గుణాత్మకంగా పెరుగుతుంది. ఈ విస్తరణ క్లాసికల్ మెషిన్‌ల సామర్థ్యాన్ని దాటిపోతుంది, కానీ క్వాంటం సిస్టమ్‌లు వాటిని సహజంగానే నిర్వహిస్తాయి. ఈ అవగాహన ప్రాముఖ్యత కేవలం ఇంజినీరింగ్ రైట్ వరకే పరిమితం కాదు. క్లాసికల్‌గా సిమ్యులేట్ చేయలేని ఈ క్వాంటం స్థితులు కొత్త రకమైన పదార్థాల రూపకల్పనకు, ఖచ్చితమైన రసాయన మోడల్స్‌కు, అలాగే భద్రమైన కమ్యూనికేషన్ విధానాలకు దారి తీస్తాయి. క్వాంటం కంప్యూటర్లు అన్నింటినీ పరిష్కరించే సాధనాలు కావు... అవి ప్రత్యేకమైన సమస్యలపై మాత్రమే అద్భుతమైన ఆధిక్యతను చూపిస్తాయి. ఈ పరిమితులను అంగీకరించడమే పరిశోధకులను సరైన దిశలో దృష్టి కేంద్రీకరించడానికి సహాయపడుతుంది. కొన్ని సత్యాలు పూర్తిగా కొత్త ఆలోచనా విధానాలను కోరుకుంటాయి. సాధనాలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ, ఈ అరికట్టలేని క్వాంటం స్థితులు శాస్త్రీయ పురోగతికి మార్గనిర్దేశం చేస్తాయి. క్లాసికల్ ఆలోచన చేరలేని స్థలాల్లో కూడా ప్రకృతి ఒకటిగా ఎదురుచూస్తోందని అవి గుర్తు చేస్తాయి.

ఈ మార్పులు విద్య, పరిశ్రమ, శాస్త్రంలో నమ్మకాన్ని కొత్తగా నిర్వచిస్తున్నాయి. పరిశోధక బృందాలు క్వాంటం అంచనాలను బాధ్యతాయుతంగా నిర్మించడంపై, ఫలితాలను పారదర్శకంగా పంచుకోవడంపై దృష్టి పెడుతున్నాయి. విద్యార్థులు గణితం, భౌతికశాస్త్రం, ఇంజినీరింగ్‌ను కలిపి కఠినత, ఆశ, కల్పనతో అన్వేషించమని ప్రోత్సహిస్తున్నాయి. పురోగతి ఒక్కసారిగా రాదు.. ప్రశ్నలు, ప్రయోగాలు, ఓపికతో అడుగుఅడుగునా ముందుకు సాగుతుంది.

## ఇరువైపులా పదునుగల కత్తి ఎఐ



విద్యా రంగంలో కృత్రిమ మేధస్సు (ఎఐ) శక్తివంతమైన సాధనమే అయినప్పటికీ, దాని అనైతిక వినియోగం, ముఖ్యంగా చీటింగ్, డేటా దుర్వినియోగం, గోప్యత ఉల్లంఘనలు ఆందోళనకరంగా గోచరిస్తున్నది. విద్య యొక్క అసలైన లక్ష్యం జ్ఞానం, నైపుణ్యాలు, నైతిక విలువలు, భావోద్వేగ బలం కలిగిన వ్యక్తులను తయారు చేయడమే. కానీ పోటీ పరిస్థితుల్లో ఈ లక్ష్యం మరుగున పడిపోయి, విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఎఐ ఆవిర్భావం మానవ ప్రగతిలో ఒక కీలక మలుపు. ఇది పరిశ్రమలకే కాకుండా, భవిష్యత్ ఉద్యోగాల స్వరూపాన్నీ మారుస్తోంది. విద్యారంగంలో ఎఐ వినియోగం దీర్ఘకాలిక ప్రభావాలను చూపుతుంది. ఎఐ వల్ల కలిగే లాభాలను ప్రస్తావిస్తే, ప్రతి విద్యార్థి అభ్యాస శైలిని గుర్తించడం, నేర్చుకునే లోపాలను తెలుసుకోవడం, బలాలు–బలహీనతలను విశ్లేషించడం ద్వారా వ్యక్తిగతీకృత అభ్యాసం సాధ్యమవుతోంది. అలాగే, ఉపాధ్యాయుల రోజువారీ పరిపాలనా పనులు తగ్గి, బోధనపై ఎక్కువ సమయం కేటాయించేందుకు ఎఐ సహాయపడుతోంది. అయితే, ఇంటర్నెట్ ద్వారా సమాచారం సులభంగా లభించడం వల్ల స్వీయ అభ్యాసానికి అవకాశం ఉన్నా, నైతిక సమస్యలు కూడా ఉన్నాయి. ఆన్‌లైన్ పరీక్షల్లో ఎఐని చీటింగ్‌కు ఉపయోగిస్తున్న ఘటనలు ఉన్నాయి. అలాగే, పాఠశాలలు డేటా భద్రత, గోప్యత పరిరక్షణకు స్పష్టమైన నియమాలు ఖరారు చేయాల్సిన అవసరం ఉంది. ఎఐని సమర్థంగా వినియోగించాలంటే, ఉపాధ్యాయ శిక్షణ కీలకం. డిజిటల్ నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సి ఉంది. ఉపాధ్యాయులు ఎఐ పూర్తి సామర్థ్యాన్ని వినియోగించగలుగుతారు. సరైన ముందస్తు చర్యలు, విధానాలు, మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు పెడితే ఎఐనిజంగా విద్యా రంగానికి ఫోర్స్ మల్టిప్లయర్‌గా మారుతుంది.



## పునర్వినియోగ రాకెట్లు!

ఇప్పటి అంతరిక్ష ప్రయోగాల్లో రాకెట్లను మళ్లీ మళ్లీ ఉపయోగించే సాంకేతికత ప్రధాన విప్లవంగా మారింది. గతంలో ఒకసారి ప్రయోగించిన రాకెట్‌ను మళ్లీ వాడడానికి వీలు ఉండేది కాదు. కానీ, ఇప్పుడు ఒకసారి ప్రయోగించిన తర్వాత రాకెట్ భూమిపైకి తిరిగి రావడంతోపాటు, మళ్లీ ఉపయోగించడానికి వీలుగా ఉంటుంది. ఈ అద్భుత ఆవిష్కరణ కారణంగా రాకెట్ ప్రయోగ ఖర్చు భారీగా తగ్గుతుంది. అంతరిక్ష ప్రయోగాలు మరింత వేగవంతంగా జరుగుతాయి. అంతేకాదు, ప్రయోగాల కాల వ్యవధి గణనీయంగా తగ్గుతుంది. ఉపగ్రహాలు, పరిశోధనా ప్రాజెక్టుల సంఖ్య పెరుగుతుంది. సాధారణ మానవుడు కూడా అంతరిక్షయానం చేసే రోజు వచ్చినా ఆశ్చర్యం లేదు. చైనా, రష్యా, అమెరికాతోపాటు ఐరోపా కూడా ఈ ప్రయోగాల్లో ముందంజ వేస్తున్నాయి.

– బిఎస్ఎస్ మైత్రేయి

# యమహో నగరి — హైదరాబాద్ పురి

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) భౌగోళిక పరిధి విస్తరణతో ప్రపంచంలోని మహానగరాల్లో చేరిపోయింది. ఔటర్ రింగ్ రోడ్డుకు లోపల ఉన్న 7 మున్సిపల్ కార్పొరేషన్‌లు, 20 మున్సిపాలిటీల విలీన ప్రక్రియ సజావుగా స్వల్పకాలంలోనే పూర్తికావటంతో జిహెచ్ఎంసి క్రిస్మస్‌రోజున అధికారికంగా బృహత్తరమైన జిహెచ్ఎంసిగా అవతరించింది. వేగంగా విస్తరిస్తున్న మహానగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు, అన్ని ప్రాంతాలకు సమాన స్థాయిలో సౌకర్యాలు కల్పించే ఉద్దేశ్యంతో ఈ విలీన–విస్తరణ కార్యక్రమం రూపొందించబడింది. ఈ ఖ్యాతి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుంది. రాజకీయంగా ఇది మాస్టర్ స్ట్రోక్. కొత్తగా విలీనమైన కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల ప్రాంతాల్లో దూరదృష్టితో కూడిన మాస్టర్ ప్రణాళికలతో సమతూక అభివృద్ధిని వేగవంతం చేసినపుడే ఈ చర్యకు పరిపూర్ణత. ఊహించటానికే కష్టతరమైనంత భౌగోళిక విస్తృతి సంతరించుకున్న కొత్త జిహెచ్ఎంసికి సమర్థవంతమైన పరిపాలన సవాలు కానుంది. భౌగోళిక విస్తీర్ణం 650 చదరపు కిలోమీటర్లనుంచి 2000 చ.కి.మీలకు పెరిగింది. జనాభా 1 కోటి 34లక్షలకుపైగా. పరిపాలనాపరంగా ఆరు జోన్‌లు, 30సర్కిళ్లు, 150 వార్డులు కలిగిన పాత జిహెచ్ఎంసి 12జోన్‌లు, 60సర్కిళ్లు, 300వార్డులుగా పునర్నిర్మాణం జరిగింది. దీనితో జిహెచ్ఎంసి విస్తీర్ణం, జనాభా రెండింటిరీత్యా భారతదేశం లో అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ అయింది. హైదరాబాద్‌కు ప్రధానమైన మెట్రోపాలిటన్ కేంద్రంగా జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తామని గత టిఆర్ఎస్/బిఆర్ఎస్ ముఖ్యమంత్రి కెసిఆర్, ప్రస్తుత కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటనలు చేశారు. రేవంత్‌రెడ్డి మూసీనది ప్రక్షాళన, సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులు అందులో భాగమే. తెలంగాణాను మూడు భాగాలుచేస్తూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి దార్శనిక పత్రంలో (2047) ఒక భాగం ఈ మహా జిహెచ్ఎంసి (సియుఆర్ఇ–క్యూర్). ఒఆర్ఆర్ వెలుపల – ప్రభుత్వం ప్రతిపాదించిన రీజినల్ రింగ్‌రోడ్ (ఆర్ఆర్ఆర్)కు మధ్య ప్రాంతం రెండవ అభివృద్ధి ప్రాంతం (పియుఆర్ఇ–ప్యూర్), ఆ వెలుపల వ్యవసాయాధారిత గ్రామీణాభివృద్ధి ప్రాంతం (ఆర్ఎఆర్ఇ–రేర్).

ప్రజాపక్షం 28-12-2025, ఆదివారం

దేశవ్యాప్తంగా పట్టణీకరణ పెరుగుతోంది. పారిశ్రామిక, వాణిజ్య కేంద్రాలుగా అనాదినుంచీ వర్ధిల్లుతున్న ప్రాంతాలు మరీ వేగంగా విస్తరిస్తున్నాయి. నగర పరిసర ప్రాంతాలను, అభివృద్ధి కేంద్రాలను కలుపుతూ విలీనాలు, విస్తరణల రాజకీయ నిర్ణయాలు జరుగుతుంటాయి. అయితే వాటి సమతూక అభివృద్ధి, పౌర సౌకర్యాలు కల్పించటం రాజకీయ నిర్ణయమంత సులభం కాదు. వనరుల సమీకరణ, ప్రాధాన్యతల ప్రకారం కేటాయింపు, అంకితభావంతో పనిచేసే పాలక మండలి, అధికార యంత్రాంగం అవసరం. తెలంగాణా పరిపాలన వ్యవస్థను 33 జిల్లాలుగా ఏర్పరిచినపుడు హైదరాబాద్ జిల్లాను అలాగే ఉంచారు. పాలనా యంత్రాంగం ప్రజలకు చేరువలో ఉండాలంటే శాంతి–భద్రతల నిర్వహణకోసం మూడు పోలీసు కమిషనరేట్‌లు చేసినట్లు హైదరాబాద్ జిల్లాను కనీసం మూడు జిల్లాలు చేయాలని, అలాగే జిహెచ్ఎంసిని మూడు–నాలుగు కార్పొరేషన్‌లు చేస్తే బాగుంటుందని అప్పట్లో కొన్ని అభిప్రాయాలు వినిపించాయి. కాని ఇప్పుడు మహా జిహెచ్ఎంసితో మహా కేంద్రీకరణ జరిగింది. వచ్చే రెండు–మూడు దశాబ్దాల్లో జనాభా రెండు కోట్లకు చేరినా ఆశ్చర్యం లేదు. మౌలిక వసతుల విస్తరణతో ప్రజలకు సంతృప్తికరమైన పురపాలన అందించటం ప్రభుత్వానికి పెద్ద సవాలు. ఈ కృషిలో ప్రభుత్వం విజయవంతం కావాలని ఆశించుదాం!

# అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో సిపిఐ



పల్లబ్ సేన్ గుప్తా

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వార్షికోత్సవం దేశం లోపల వందేళ్ల పోరాటాలను స్మరించుకునే సందర్భం మాత్రమే కాదు; అంతర్జాతీయ కమ్యూనిస్టు, వర్కర్స్ ఉద్యమంతో దాని నిలకడైన, సూత్రబద్ధమైన సంబంధాన్ని జ్ఞప్తి చేసుకోవలసిన, పునరుద్ఘాటించాల్సిన సందర్భం కూడా. 1925లో పార్టీ ఏర్పాటైన నాటి నుంచి నేటివరకు, భారతదేశ విప్లవ పోరాటం సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారీ వ్యవస్థకు, దోపిడీకి వ్యతిరేకంగా, సోషలిజం, శాంతికోసం ప్రపంచవ్యాప్త పోరాటంతో విడదీయరాని సంబంధం కలిగిఉందని సిపిఐ అవగాహన చేసుకుంది.

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా వ్యాప్తంగా వలస పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు తీవ్రతరమవుతున్న కాలంలో, 1925లో కాన్పూర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. సిపిఐ ఆరంభం నుంచీ కార్మికవర్గం అంతర్జాతీయతను ముఖ్యసూత్రంగా ఆమోదించింది. భారతదేశంలో బ్రిటీష్ వలసవాద పాలనకు వ్యతిరేకంగా పోరాటం కార్మికవర్గం, పీడిత ప్రజల నాయకత్వంలో ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న విస్తృత పోరాటంలో భాగమని అది గుర్తించింది.

సిపిఐ తన ప్రారంభ సంవత్సరాల్లో, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ (కొమింటర్న్)తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉంది. మార్క్సిజం–లెనినిజంను అవగాహన చేసుకోవటంలో, వలస, అర్ధవలస సమాజాలను విశ్లేషించటంలో, భారతదేశ పరిస్థితులకు అనువైన వ్యూహాలను అభివృద్ధి పరుచుకోవటంలో భారతదేశ కమ్యూనిస్టులకు సహాయకారిగా కొమింటర్న్ ముఖ్యమైన పాత్ర నిర్వర్తించింది. సిపిఐ అంతర్జాతీయ అనుభవంనుంచి నేర్చుకుంటూనే, వలస దేశాల సమస్యలు, వ్యవసాయ పోరాటాలు, ఐక్యసంఘటన ఎత్తుగడలవంటి అంశాలపై చర్చలకు దోహదం చేసింది. ఆ విధంగా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ సమష్టి అవగాహన పరిపుష్టం అయింది.

### అంతర్జాతీయ పార్టీ మహాసభల్లో...

సిపిఐ ఎల్లప్పుడూ సూత్రబద్ధ ప్రాతిపదికపై అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతను బలపరిచింది. కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల – చరిత్రాత్మక 12 పార్టీల మహాసభ(1957), 81 పార్టీల మహాసభ (1960)ల్లో అది నిర్వర్తించిన సకారాత్మక, నిర్మాణాత్మక పాత్రలో అది ప్రతిబింబించింది. నాటి సిపిఐ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ అజయ్ ఘోష్ ఆ రెండు సమావేశాల్లోనూ డ్రాఫ్టింగ్ కమిటీ సభ్యునిగా ముఖ్యమైన పాత్ర నిర్వర్తించారు. 1969లో మాస్కోలో జరిగిన ప్రపంచ కమ్యూనిస్టు సమావేశంలో కూడా సిపిఐ పాల్గొన్నది. శాంతియుత సహజీవనం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం, సోషలిజం సాధనకు భిన్న మార్గాలను గుర్తించటంపై సమష్టి అవగాహన అభివృద్ధి పరచటంలో ఈ మహాసభలు, సమావేశాలు కీలకమైనవి.

ఈ వేదికల్లో, మార్క్సిజం–లెనినిజంను సిపిఐ దృఢంగా సమర్థించింది. అదే సమయంలో, జాతీయ ప్రత్యేకతలను గుర్తించాలని కూడా వాదించింది; సిద్ధాంతాన్ని నిర్దుష్టమైన పరిస్థితులకు సృజనాత్మకంగా అనువర్తింపజేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. భేదాభిప్రాయాలను అణచివేయకుండా ఐక్యతను పటిష్టవంతం చేయటం, సైద్ధాంతిక సమస్యలను ఒంటెత్తుపోకడ లేదా పిడివాదంతో కాకుండా కామ్రేడ్ తరహా వాదోపవాదాలద్వారా పరిష్కరించుకోవాలనే ధ్యేయం సిపిఐ జోక్యాలకు మార్గదర్శకంగా ఉండింది.

### 'మావోయిజం' పట్ల వ్యతిరేకత

సిపిఐ తన చరిత్ర పొడవునా, మార్క్సిజం–లెనినిజాన్ని ఒక సజీవమైన, అభివృద్ధి చెందుతున్న శాస్త్రంగా గట్టిగా సమర్థించింది. అది రివిజనిజం రూపాలన్నిటినీ, 'అతివాద దుందుడుకుతనాన్ని' అది వ్యతిరేకించింది. ఈ సందర్భంలో, ''మావోయిజం'' అని పిలబడుతున్న దానికి వ్యతిరేకంగా సిపిఐ స్పష్టమైన, సూత్రబద్ధ వైఖరి తీసుకుంది. దానిని మార్క్సిజం – లెనినిజంకు వక్రీకరణగా, కార్మిక వర్గం, విప్లవోద్యమ ప్రయోజనాలకు చేటుచేసే అపమార్గంగా పార్టీ గుర్తించింది. విప్లవ రాజకీయాలను ప్రజా ఉద్యమాలనుండి దూరమైన చెదురుమదురు సాయుధ చర్యలకు లేదా ఒంటెత్తుపోకడ పద్ధతులకు కుదించకూడదని సిపిఐ వాదించింది. అందుకు బదులుగా – మార్క్సిజం – లెనినిజం ప్రధాన సూత్రాలైన ప్రజాపోరాటం, ప్రజాస్వామిక అలయెన్స్‌లు, నిర్దుష్ట పరిస్థితుల గూర్చి కచ్చితమైన విశ్లేషణ ప్రాధాన్యతను అది వక్కాణించింది.

### జాతీయ విముక్తి ఉద్యమాలతో సంఘీభావం

సిపిఐ అంతర్జాతీయ పాత్రలో ప్రముఖ లక్షణం – జాతీయ విముక్తి ఉద్యమాలకు, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు అరమరికలులేని తోడ్పాటు. వలసవాదుల వర్ణవివక్ష, జాతివివక్ష, పీడనకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలతో – కార్మికవర్గ అంతర్జాతీయత మార్గదర్శకంగా అది క్రియాశీలకమైన సంఘీభావం తెలియజేసింది.

ఫ్రెంచివలసవాదులకు వ్యతిరేకంగా, ఆ తర్వాత అమెరికన్ సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేకంగా వియత్నాం ప్రజల వీరోచిత పోరాటాన్ని సిపిఐ గట్టిగా బలపరిచింది. భారతదేశంలోపల, అంతర్జాతీయంగా సంఘీభావం సమీకరించింది. జాతివివక్ష, వర్ణవివక్షకు వ్యతిరేకంగా ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్, దక్షిణాఫ్రికా ప్రజలు సాగించిన సుదీర్ఘకాల పోరాటంలో దృఢంగా వారిపక్షం వహించింది.

1971లో బంగ్లాదేశ్ ప్రజలు సాగించిన తమ విముక్తి పోరాట కాలంలో ఆ ప్రజలకు సంఘీభావం సమీకరించటంలో సిపిఐ కూడా




ముఖ్యమైన పాత్ర పోషించింది. వారి స్వయం నిర్ణయాధికార హక్కును, స్వాతంత్ర్య హక్కును గట్టిగా బలపరిచింది. అదేవిధంగా, జెరూసలెం తమ రాజధానిగా స్వతంత్ర రాజ్యంకోసం పాలస్తీనా ప్రజల న్యాయమైన పోరాటాన్ని సిపిఐ నిలకడగా బలపరిచింది. పాలస్తీనాతో ఈ సంఘీభావం నేటికీ కొనసాగుతున్నది. ఇజ్రాయెల్ ఆక్రమణను, దురాక్రమణ యుద్ధాన్ని, అంతర్జాతీయ చట్టం ఉల్లంఘనలను సిపిఐ ఖండిస్తున్నది, ఐక్యరాజ్యసమితి తీర్మానాల ప్రాతిపదికగా న్యాయమైన, శాశ్వత పరిష్కారాన్ని బలపరుస్తున్నది.

### సోవియట్ యూనియన్ పతనం తర్వాత

సోవియట్ యూనియన్, తూర్పుయూరప్‌లో సోషలిస్టు దేశాలు కూలిపోవటం అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి తీవ్రమైన ఎదురుదెబ్బ. అది సైద్ధాంతికంగా గందరగోళానికి, నిరుత్సాహానికి దారితీసింది; ''చరిత్ర ముగిసింది'' అని సామ్రాజ్యవాద శక్తులు దూకుడుగా ప్రచారం చేశాయి.

ఈ కష్టకాలంలో, సిపిఐ మార్క్సిజం – లెనినిజంను విడనాడలేదు. అందుకు బదులుగా అది ఎదురుదెబ్బలకు దారితీసిన కారణాలపై గంభీరంగా, ఆత్మవిమర్శనా దృష్టితో విశ్లేషణ జరిపింది. ఆచరణలో వైఫల్యాలు – సోషలిస్టు భావాల శాశ్వత చెల్లుబాటు మధ్యగల తేడాలను వేరుపరచింది. సంక్షోభం మార్క్సిజం – లెనినిజానిది కాదని, దాన్ని అపసవ్యంగా అనువర్తింపజేయటం, సోషలిస్టు సూత్రాల నుంచి పక్కదారి పట్టటానిదని పేర్కొంటూ సిపిఐ మార్క్సిస్టు సిద్ధాంతంలో ఆత్మవిశ్వాసాన్ని పునరుద్ఘాటించింది.

ఈ సైద్ధాంతిక దృఢత్వం సిపిఐ సరికొత్త స్పష్టత, ఆత్మ విశ్వాసంతో జాతీయంగా, అంతర్జాతీయంగా తన కృషి కొనసాగించటానికి దోహద కారి అయ్యింది.

### కమ్యూనిస్టు వర్కర్స్ పార్టీల అంతర్జాతీయ సమావేశం

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఐక్యతను పునర్నిర్మించే, పటిష్టంచేసే తన నిబద్ధతను వక్కాణిస్తూ సిపిఐ కమ్యూనిస్టు, వర్కర్స్‌పార్టీల అంతర్జాతీయ సమావేశం (ఐఎంసిడబ్ల్యుపి) ఏర్పాటుకు దారి తీసిన చొరవలను చురుకుగా బలపరిచింది. ఈ వేదికలో, దాని ఆరంభ దశల నుంచీ సిపిఐ సకారాత్మకంగా పాల్గొన్నది. సామ్రాజ్యవాదం, నయా ఉదారవాదం, శాంతి, ప్రజాస్వామ్యం, సోషలిజంపై చర్చలకు దోహదం చేసింది. ఈ నిబద్ధతకు ప్రాముఖ్యత గల వ్యక్తీకరణగా, సిపిఐ ,

సిపిఐ(ఎం) సంయుక్తంగా 2009లో న్యూఢిల్లీలో కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల అంతర్జాతీయ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చేందుకు చొరవ తీసుకున్నాయి. ప్రపంచం నలుమూలల నుంచీ పెద్దసంఖ్యలో పార్టీలు పాల్గొన్నాయి. సామ్రాజ్యవాదానికి, నయా ఉదారవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా సమష్టి స్వరాన్ని అది పటిష్టం చేసింది.

ఐఎంసిడబ్లుపిని సిపిఐ పూర్తిగా బలపరుస్తున్నది. అయితే భారతదేశ వాస్తవికతలు, తమ చారిత్రక అనుభవంతో రూపుదిద్దుకున్న తన సొంత, స్వతంత్ర అవగాహనతో అది ఆ సమావేశాల్లో ఎల్లప్పుడూ పాల్గొంటున్నది. చిత్తశుద్ధితో కూడిన అంతర్జాతీయ ఐక్యతకు ఆవశ్యకమైనటువంటి – పార్టీల మధ్య సమానత్వం, పరస్పర గౌరవం, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం– సూత్రాలను అది బలపరుస్తున్నది.

### విస్తృత సంబంధాలు

పట్నా, పుదుచ్చేరి, కొల్లాం, చండీఘడ్‌లలో జరిగిన పార్టీ కాంగ్రెస్‌లకు మినహా సిపిఐ కాంగ్రెస్‌లు (జాతీయ మహాసభ) అన్నింటికీ అనేక దేశాల కమ్యూనిస్టు పార్టీల నుంచి సౌహార్ద్ర ప్రతినిధిబృందాలు హాజరైనాయి. ఇది అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో సిపిఐ స్థానానికి ప్రతిబింబం. అలాగే సిపిఐ కూడా సోదర కమ్యూనిస్టు పార్టీల మహాసభలకు ఆహ్వానం అందినపుడు హాజరవుతూ ఉంది. తద్వారా ద్వైపాక్షిక, బహుళపక్ష సంబంధాలు పటిష్టవంతమవుతున్నాయి. ఇవాళ సిపిఐకి 70కి పైగా కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీలతో సౌహార్ద్ర సంబంధాలున్నాయి.

### భవిష్యత్‌కు సంకల్పం

సిపిఐ శతాబ్ది వత్సరం ముగింపు సందర్భంగా, దేశంలో పార్టీని మరింత పటిష్టవంతం చేయటానికి, కార్మికులు, కర్షకులు, యువత, మహిళలు, ఇతర పీడిత తరగతులందరితో సంబంధాలను పెంపొందించుకునేందుకు, మతోన్మాదం, నయా ఉదారవాదం, నిరంకుశపెత్తందారీతనాలకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చేసేందుకు ప్రతినబూనుతోంది.

అదేసమయంలో, అంతర్జాతీయ సహకారం, సంఘీభావం పట్ల తన నిబద్ధతను సిపిఐ పునరుద్ఘాటిస్తున్నది. సామ్రాజ్యవాద యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలు, వాతావరణ విపత్తు, పెరుగుతున్న అసమానత నేడు మానవజాతి ఎదుర్కొంటున్న సవాళ్లు. అవి ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు, ప్రగతిశీల శక్తుల మధ్య బలమైన సహకారాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

భారత కమ్యూనిస్టుపార్టీ మార్క్సిజం–లెనినిజంలో ఆత్మవిశ్వాసంతో, కార్మికవర్గంలో నమ్మకంతో, కార్మికవర్గ అంతర్జాతీయత పట్ల నిబద్ధతతో రెండవ శతాబ్దకాలంలో ప్రవేశిస్తున్నది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం పునరుజ్జీవం, పురోగతికి, అలాగే సోషలిజం, మానవాళి విముక్తికై చారిత్రక పోరాటం కోసం మరింతగా దోహదం చేసేందుకు కృతనిశ్చయంతో ఉంది.

# జల రాజకీయాలు.. దూషణలు... ఆగేదెన్నడు?




గడిచిన వారం రోజులుగా రాష్ట్ర రాజకీయాలు నీళ్ళ రాజకీయాలతో భగ్గుమంటున్నాయి. గత ఆదివారం బిఆర్ఎస్ శాసనసభాపక్షం, కార్యవర్గ సమావేశం అనంతరం ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో నీటి రాజకీయాన్ని రాజేశారు. ఆ ప్రాజెక్టు 90శాతం పనులు తమ హయాంలోనే పూర్తి చేశామని, కానీ, రెండేళ్ళుగా కాలయాపన చేయడమే కాకుండా, ఇటీవల కేంద్రం నుంచి వెనక్కి వచ్చిన డిపిఆర్‌పై సమాధానం ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆలస్యం చేసిందని ఆరోపణలను సంధించారు. పైగా 90టిఎంసిల ప్రాజెక్టుకు 45 టిఎంసిల మేరకు అంగీకరించిందన్నారు. దీనిపై ఆ ప్రాజెక్టుతో లబ్ధి చేకూరే మూడు ఉమ్మడి జిల్లాల్లో బహిరంగ సభలు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడతామని ప్రకటన చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ, పనిలో పనిగా కెసిఆర్ తన సహజశైలిలో తోలు తీస్తానంటూ చేసిన వ్యాఖ్యలతో విమర్శ వ్యక్తిగత స్థాయికి చేరింది. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలుత కాస్త గౌరవంగానే ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న కెసిఆర్ సోమవారం నుండి జరగబోయే శాసనసభ సమావేశాలకు వస్తే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై చర్చకు సిద్ధమేనని ఆహ్వానించారు. పైగా ఆయనను అగౌరవపరిచేలా ఎవరు మాట్లాకుండా చూస్తానని కూడా హామీ ఇచ్చారు. రెండేళ్లుగా రెండుసార్లు (అందులో ఒకసారి ప్రమాణస్వీకారానికి) మాత్రమే శాసనసభకు వచ్చిన ప్రతిపక్ష నాయకుడు కె.చంద్రశేఖర్‌రావును కవ్వించే విధంగా ఈవ్యాఖ్యలు ఉన్నాయి. మరోవైపు నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కెసిఆర్ ఆరోపణలపై స్పందిస్తూ బిఆర్ఎస్ హయాంలో 90 శాతం పనులు పూర్తయిందే నిజమనుకుంటే, ఒక్క ఎకరానికి కూడా ఎందుకు నీళ్ళివ్వలేదని నిలదీశారు. కెసిఆర్ హయాంలోనే కేంద్రం డిపిఆర్‌ను వెనక్కి పంపిందని, గతంలోనే 45 శాతం టిఎంసికి అంగీకరించినట్లే తాము కూడా డిపిఆర్‌పై స్పందించినట్లు వివరణ ఇచ్చారు.

ఇదంతా ఒక ఎత్తైతే, మరోసారి తెలంగాణ రాజకీయ క్షేత్రంలో రాజకీయ విమర్శలు వ్యక్తిగత స్థాయికి చేరుకోవడం ఆందోళన కలిగించే అంశమే. కెసిఆర్ తిట్లను అస్త్రాలుగా సంధించడంపై మొదటి నుంచి ప్రత్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేసేవారు. ఉద్యమకాలంలోనే ఆయన ఆ భాష వాడారని బిఆర్ఎస్ నేతలు సమర్థించేవారు. అయితే, ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కూడా వ్యక్తిగత దూషణలకు పాల్పడిన సందర్భాలు ఉన్నాయి. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు అలాంటివే. ఒక దశలో తెలంగాణ ప్రజలు వాటిని ఆస్వాదించిన రోజులు ఉన్నాయి. అలా మాట్లాడితేనే ప్రజలు స్వీకరిస్తారేమోనని విపక్షాలలో కొందరు నాయకులు ఆ బాటలోనే నడిచారు. ప్రతిపక్షంలో ఉండగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అలాగే బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రస్తుత కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కూడా తీవ్ర పదజాలంలో దూషించిన ఘటనలు ఉన్నాయి. తాజాగా బిఆర్ఎస్ శిబిరం నుంచి వ్యక్తమైన భాషకు స్పందనగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం కొడంగల్‌లో అనియంత్రిత భాషలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై విపక్ష పార్టీ తీవ్రంగా స్పందిస్తుంది. నిజానికి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన తరువాత మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావులు ఆయనను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో విమర్శలు చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో కట్టుతప్పుతున్నాయి కూడా. ఈ దూషణల రణగొణ ధ్వనుల మధ్య అసలు విషయం పక్కకు పోయి మాటలు మిగిలిపోతున్నాయి.

రాజకీయ నాయకుల నుంచి వచ్చిన తిట్ల భాషనే యూట్యూబర్‌లు సైతం స్థిరీకరించుకొని సామాన్య భాషగానే వాడేస్తున్నారు. నేరుగా నాయకులను లైవ్‌లో తిట్టే సంస్కృతి తెలుగునాట సోషల్ మీడియాలో ప్రబలి వికృత రూపం దాల్చింది. ఎంత తిడితే అంత పేరొస్తుందనే భ్రమలో కొందరు తెలిసీ తెలియని వారు కూడా ఆ భాషనే అందుకొని కేసుల బారిన పడడం చూశాం. ఆదర్శంగా నిలవాల్సిన నేతగణం ఇలాంటి భాషను ఉపయోగించడం చూసి భావితరం కూడా అదే ప్రామాణికంగా భావించే దుస్థితి ఏర్పడింది.

ఒకప్పుడు ప్రత్యర్థి పార్టీల వారినైనా సరే అధికారంలో ఉండే నాయకులు అత్యంత గౌరవప్రదంగా, బహువచనంలో సంబోధించే సంప్రదాయం ఉండేది. కానీ, ఇప్పుడా పరిస్థితి లేకుండా పోవడం పట్ల విజ్ఞులు ఆవేదన చెందుతున్నారు. ఈ భాష కారణంగా నాయకులు పరస్పరం తారసపడినా చూసుకునే పరిస్థితి లేదు. ఇది సమాజానికి మంచిది కాదు.

### నీటి కయ్యాలు తీరేదెన్నడో?

ఇక నీటి జగడాల విషయానికి వస్తే, ఒకటి పొరుగు రాష్ట్రాలతో వాటా పంపిణీపై పోరాటం, మరొకటి ఘనత దక్కించుకునేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పోరాటం. విచిత్రమేమిటంటే 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ఐదేళ్ళ కాలంలో ప్రాజెక్టులను పూర్తి చేసేలా జలయజ్ఞం కార్యక్రమాన్ని చేపట్టారు. కానీ, అందులో చాలా ప్రాజెక్టులు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇందుకు ప్రధాన కారణం, ఎవరు అధికారంలో ఉన్నా, వారి స్వీయచిత్తం ప్రకారం ప్రాజెక్టుల రూపురేఖలు మార్చుకుంటూ, రీఇంజినీరింగ్ పేరుతో మార్పులు చేస్తూ పోయారు. అలాగే, ఎవరిష్టమొచ్చినట్లు వారు ప్రాధాన్యతలు నిర్ణయించుకున్నారు. ఫలితంగా, తెలంగాణ ముఖ్యమంత్రిగా కెసిఆర్ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులు వారి పదేళ్ళ కాలంలో పూర్తి కాలేదు. పూర్తయిన కాళేశ్వరం కూడా నీటి ప్రవాహాన్ని తట్టుకొని నిలబడలేకపోయింది. మరొకవైపు కృష్ణా జలాలపై ప్రాజెక్టులు పెండింగ్‌లోనే ఉన్నాయి. పాలమూరు – రంగారెడ్డి వంటి ప్రాజెక్టును పూర్తికాకముందే అప్పటి ఎన్నికలకు ముందు ప్రారంభించేసి మమా అనిపించారు. ఇవన్నీ పరిశీలిస్తే, ప్రాజెక్టుల రూపకల్పన, ప్రాధాన్యతా క్రమంలో చేపట్టే విషయంలో ఏకాభిప్రాయంతో ముందుకు వెళ్లకపోవడమనేది ఒక ప్రధాన కారణం. రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా ప్రాజెక్టులపై ఇరిగేషన్ ఇంజనీర్లు, నిపుణులతో వర్క్‌షాప్ నిర్వహించి, కావాల్సిన సమగ్ర ప్రణాళికను రూపకల్పన చేయాలి. దానిని రాజకీయ పార్టీలతో చర్చించి ఏకాభిప్రాయాన్ని సాధించి, ఎవరు అధికారంలో ఉన్నా కొనసాగించే విధంగా సంకల్పించాలి. అప్పుడే సమష్టి నిర్ణయాలతో పూర్తవడమే కాకుండా, పొరుగు రాష్ట్రాలతో జలజగడాల విషయంలో కూడా ఏకతాటిపై నిలిచే అవకాశం ఉంటుంది. అలా కాకుండా, నీటి ప్రాజెక్టుల అంశంలో రాజకీయాలు చూస్తే, ప్రజలను భ్రమలలో పెట్టి కాలక్షేపం చేస్తున్నట్లే లెక్క. పరస్పర విమర్శలు చేసుకునేందుకు ఇరు పక్షాలకు అవసరమైనన్ని లెక్కలు, అందులో బొక్కలు సిద్ధంగా ఉంటాయి. వాటిపై ఆరోపణలు చేసుకోవడం ద్వారా సమయం వృథానే తప్ప ప్రయోజనం శూన్యమే. ఇప్పటికైనా ఆ దిశగా సోమవారం నుంచి ప్రారంభమయ్యే శాసనసభ శీతాకాల సమావేశాలలో చర్చలు జరిగి, రాష్ట్ర నీటి ప్రయోజనాలే పరమావధిగా చర్చలు జరిగి ఏకాభిప్రాయం సాధించాల్సిన అవసరం ఉంది. అలాగే నాయకుల భాషకు సంబంధించి కూడా తామంతట తామే లక్ష్మణరేఖ గీసుకుంటే సమాజానికి మంచిదే గాక, రాజకీయాలపై గౌరవం పెరుగుతుంది.

## పిహెచ్‌సిని డా.అప్పయ్య ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంను శనివారం హనుమకొండ జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా. అప్పయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా పిహెచ్‌సికి సంబంధించిన అటెండెన్స్ రిజిస్టర్‌తో పాటుగా ఇతర రికార్డులను పరిశీలించి,పేషెంట్లపట్ల వైద్యసిబ్బంది ప్రవర్తనను పరిశీలించి పేషెంట్లకు చికిత్స చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం, శనివారం జరిగే యుఐపిసెషన్ ద్వారా చిన్నపిల్లలకు టీకాలు వేయించాలి, ఎల్‌సిడిసి (కుష్టు వ్యాధి గ్రస్తుల సర్వే వివరాలు వారికి అందిస్తున్న చికిత్స గూర్చి అడిగి తెలుసుకున్నారు. విధుల పట్లసమయ పాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతోందని బాధ్యతాయుతంగా విధులు సక్రమంగా నిర్వహించి పిహెచ్‌సికి వైద్యఆరోగ్యశాఖకు మంచిపేరు తీసుకురావాలని సిబ్బందికి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో డా,నవీన్‌కుమార్,డా,మమత,హెల్త్ సూపర్‌వైజర్ కుమారస్వామి, స్టాఫ్‌నర్సింగ్ ఆఫీసర్ అనిత, హెచ్‌వి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

## 30న రెడ్ క్రాస్ జిల్లా శాఖ సర్వ సభ్య సమావేశం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న మంగళవారం ఉదయం 10:00 గంటలకు సమీకృత కార్యాలయ భవనం (కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్), సుబేదారిలో జరగనుందని చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి తెలిపారు. శనివారం రెడ్‌క్రాస్ చైర్మన్, పాలకవర్గం ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సిబ్బందితో సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో రెడ్‌క్రాస్ కార్యక్రమాలు, సిబ్బందికి వృత్తి పరమైన తగు సూచనలు, జాగ్రత్తలు గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటి చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన ప్రజా ప్రతినిధులను సన్మానించిన చెన్న కేశవులు



**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా నూతనంగా ఎన్నికైన పెండ్యాల హరి ప్రసాద్, టిపిసిసి సభ్యులు, డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, చంద్రుగొండ సర్పంచ్‌ను గెలిపించుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బక్కి అశోక్‌లను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని బొకేలు అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల మద్దతుతో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు గ్రామాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలని కందిక చెన్న కేశవులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుసుమ చెన్నకేశవులు, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ రావుల మైపాల్‌రెడ్డి, ఎండి అన్వర్ పాషా, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి హనుమకొండ, కాజీపేట మండలాలకు చెందిన 84 మంది లబ్ధిదారులకు రూ.84,09,744 విలువ గల కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర పాలన దిశ పూర్తిగా మారిందని అన్నారు. పేదలు, మహిళలు, మైనారిటీల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ రాజకీయ అజెండా అని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు

అధికారులకు ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు ఆదేశాలు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు తెలిపారు. హన్మకొండ వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ నుంచి ఉనికిచెర్ల వరకు ఉన్న రహదారిలో వరుసగా జరుగుతున్న ప్రమాదాల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో శనివారం నగర మేయర్ గుండు సుధారాణి, జిడబ్ల్యుఎంసి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే నాగరాజు రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు ఇంజనీరింగ్ లోపాల వల్ల అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ప్రమాదాలకు కారణమైన బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపడతామని చెప్పారు. పోలీసు అధికారిగా తన అనుభవాన్ని ఉపయోగించి మున్సిపల్, ఆర్ అండ్ బి, పోలీసు శాఖల అధికారులతో కలిసి సమస్యలను సమీక్షించి అవసరమైన సూచనలు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఆర్ అండ్ శాఖ అధికారులు, అధికారులు నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** గ్రామాల సర్వతోముఖాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర అత్యంత కీలకమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం భూపాలపల్లి పట్టణం మంజూరునగర్‌లోని పుష్ప గ్రాండ్ కన్వెన్షన్ హాల్లో ఎమ్మెల్యే జిఎస్‌ఆర్ ఆధ్వర్యంలో నూతన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌ల శిక్షణ శిబిరంను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ శిక్షణ శిబిరంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు గ్రామ పరిపాలన, అభివృద్ధి ప్రణాళికలు, ఆర్థిక నిర్వహణ, పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పన వంటి అంశాల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నూతన సర్పంచ్‌లకు, ఉప సర్పంచ్ అతిథుల చేతుల మీదుగా శాలువాలు కప్పిఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు కటంగూరి రామ్ నర్సింహారెడ్డి, చల్లూరి మధు, చిట్యాల, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్లు గుమ్మడి శ్రీదేవి, గూటోజు కిష్టయ్య, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ పిఎసిఎస్ చైర్మన్లు, మాజీ జెడ్‌పిటిసిలు, మాజీ ఎంపిపిలు పాల్గొన్నారు.

## దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకే

# కృత్రిమ అవయవాల పంపిణీ

మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం / వరంగల్ :** దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి కృత్రిమ అవయవాల పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సీనియర్ ఐఎఎస్ అధికారి పరికిపండ్ల నరహరి ఆధ్వర్యంలో భగవాన్ మహావీర్ వికలాంగుల సహాయ సమితి సహకారంతో వరంగల్ జిల్లా పరిధి కొత్తవాడలోని పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత కృత్రిమ కాళ్ళ పంపిణీ శిబిరాన్ని మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాళ్లు చేతులు లేని దివ్యాంగుల కోసం ఇలాంటి సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని, నిర్వాహకులు సీనియర్ ఐఎఎస్ నరహరి సేవలను మంత్రి ప్రశంసించారు. సొంత ఊరిలో ఆసుపత్రి నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని, విద్యా వికాసం కోసం, యువతి యువకులకు ఉపాధి కోసం ఆలయ ఫౌండేషన్ వారు సేవలు అందిస్తున్నారని, ఇటీవల కురిసిన భారీవర్షాల నేపథ్యంలో ముంపుకు గురైన ప్రాంతాలలో నిత్యావసర సరుకులను అందించారని, గత 12 సంవత్సరాల కాలం నుంచి ట్రస్టు ద్వారా ప్రజలకు సామాజిక సేవా కార్యక్రమాలు అందిస్తున్నారని వివరించారు. సేవే మార్గంగా ముందుకు పోతున్న క్రమంలో మహావీర్ సొసైటీ వారు భాగస్వాములు కావడం మరింత బలాన్ని ఇచ్చిందన్నారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కలచి వేస్తాయని, వారికి ప్రభుత్వం ఆసుపత్రుల్లో కృత్రిమ అవయవాలు అందిస్తారని, అవి అధిక బరువుతో కూడుకొని ఉంటాయని, వాటిని వినియోగించుకోవడం దివ్యాంగులకు కొంత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుందని, ఈ ట్రస్ట్ ద్వారా అందించే పరికరాలు నాణ్యతతో పాటు తక్కువ బరువుతో దివ్యాంగులు వినియోగించుకునే విధంగా ఉపయుక్తంగా ఉన్నాయని అన్నారు. నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ వరంగల్‌లో క్యాంప్ ఏర్పాటు చేసి కృత్రిమ పరికరాలు అందించడం ఆనందంగా ఉందని, నగరంలో రెండు రోజుల పాటు శిబిరం ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బంది కలుగకుండా శిబిరం నిర్వహించడం ముదావహం అని ఆలయ ఫౌండేషన్ ద్వారా విద్యా వైద్యం తో పాటు అనేక సేవా సామాజిక కార్యక్రమాలను చేయడం సంతోషంగా ఉందని ఒక ఐఎఎస్ అధికారి తన స్వంత రాష్ట్రంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. విధి నిర్వహణలో భాగంగా ఎంతటి పని ఒత్తిడి ఉన్నా ఇందుకోసం ప్రత్యేక టీంను ఏర్పాటు చేసుకొని నిర్వహిస్తున్నందుకు మేయర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐఎఎస్ నరహరి, జిల్లా కలెక్టర్ డా. సత్యశారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కా ర్పొరేటర్లు ఆడెపు స్వప్న, బసవరాజు కుమారస్వామి, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్ర దీప్ రావు, మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్, ట్రస్టు సిఇఒ రమేష్ బాబు, భగవాన్ మహావీర్ వికలాంగుల సహాయ సమితి కార్యవర్గ సభ్యు లు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్‌లో సిబిజి ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి

ఆయిల్ ఇండియా లిమిటెడ్ (నోయిడా) చైర్మన్‌కు ఎంపి కావ్య లేఖ



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ నగరంలో సుస్థిర సేంద్రీయ వ్యర్థాల నిర్వహణ కోసం కంప్రెస్డ్ బయోగ్యాస్ (సిబిజి) ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరుతూ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆయిల్ ఇండియా లిమిటెడ్ (నోయిడా) చైర్మన్‌కు లేఖ రాశారు. విద్యా, వాణిజ్య కార్యకలాపాల విస్తరణతో వరంగల్ నగర జనాభా వేగంగా పెరుగుతోందని, దీని ఫలితంగా గృహాలు, హోటళ్లు, హాస్టళ్లు, విద్యాసంస్థలు, దేవాలయాలు, వాణిజ్య సంస్థల నుంచి భారీగా సేంద్రీయ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లేక ద్వారా వివరించారు.. ప్రస్తుతం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోజుకు సుమారు 400 టన్నుల మున్సిపల్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతుండగా, క్లస్టరింగ్ ద్వారా ఈ పరిమాణం 650 టన్నుల వరకు చేరే అవకాశముందని తెలిపారు. ఈ వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగించేందుకు వరంగల్‌లో సిబిజి ప్లాంట్ ఏర్పాటు అత్యంత అవసరమని పేర్కొన్నారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలో సిబిజి ప్లాంట్ ఏర్పాటు కోసం అవసరమైన స్థలాన్ని కేటాయించడానికి సిద్ధంగా ఉన్నామని, ముందుగా సాధ్యత (ఫీజిబిలిటీ) అధ్యయనం నిర్వహించి అనంతరం ప్లాంట్ మంజూరు చేయాలని ఆయిల్ ఇండియా లిమిటెడ్‌ను వరంగల్ ఎంపి కడియం కావ్య కోరారు. ఆయిల్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న 25 కంప్రెస్డ్ బయోగ్యాస్ (సిబిజి) ప్లాంట్లలో ఒక యూనిట్‌ను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కూడా ఏర్పాటు చేయాలని వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు ఆయిల్ ఇండియా లిమిటెడ్‌కు లేఖ రాసిన ఆమె, ఇప్పటికే అస్సాం, ఒడిశా రాష్ట్రాలలో ఇలాంటి సిబిజి యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారని గుర్తు చేశారు. అదే తరహాలో వరంగల్ నగరంలోని మున్సిపల్ వ్యర్థాలను వినియోగించి బయోగ్యాస్ ఉత్పత్తి చేసేలా సిబిజి ప్లాంట్‌ను ఆయిల్ ఇండియా ఏర్పాటు చేయాలని ఎంపి తన లేఖలో పేర్కొన్నారు. వరంగల్ పరిసర ప్రాంతాల్లో కూరగాయల మార్కెట్లు, హోటళ్లు, హాస్టళ్లు, స్లాటర్ హౌసులు, గృహాల నుంచి వచ్చే వేరు చేసిన సేం ద్రీయ వ్యర్థాలు సిబిజి ప్లాంట్‌కు అవసరమైన ముడి పదార్థంగా సమృద్ధిగా లభ్యమవుతాయని తెలిపారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సిబిజి ప్లాంట్‌కు వెంటనేఅనుమతులుఇవ్వాలనికేంద్రాన్ని వరంగల్ ఎంపికడియం కావ్య కోరారు.

## మేడారం మహా జాతర అభివృద్ధి పనులు పూర్తి

ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు:** శ్రీసమ్మక్క సారలమ్మ మేడారం మహా జాతరకు ముందస్తు మొక్కులు చెల్లించడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, క్యూలైన్ నిర్మాణాలలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను సూచించారు. శనివారం ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం సెలవు రోజులలో అధిక సంఖ్యలో భక్తులు ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి వచ్చే అవకాశం ఉందని, వారికి ఎలాంటి అసౌకర్యం ఇబ్బందులు కల్గకుండా ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మోడల్ క్యూలైన్ నిర్మాణాలు పరిశీలించి పనులలో వేగం పెంచాలని క్యూలైన్లలో ఉండే భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించేలా ఏర్పాట్లు చేయాలని, ఆలయ ప్రాంగణంలోని భారీ రాతి స్తంభాలపై త్వరితగతిన బ్రాకెట్లను ఏర్పాటు చేయాలని, ఆలయ ఫ్లోరింగ్ పనులు వేగంగా పూర్తి చేయాలని, సెంట్రల్ లైటింగ్ స్తంభాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒ వీరస్వామి, ఆర్అండ్‌బి ఈఈ సురేష్, తహసీల్దారు సురేష్ బాబు, సంబంధిత గుత్తేదారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## యాసంగి సీజన్‌కు యూరియా కొరత లేదు

జిల్లా వ్యవసాయాధికారి అనురాధ



**ప్రజాపక్షం/నెక్కొండ:** జిల్లాలో యాసంగి సీజన్‌కు రైతులకు అవసరమైన యూరియా పూర్తిగా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయాధికారి కె అనురాధ తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 87,503 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగినట్లు వెల్లడించారు. అక్టోబర్ నెలలో 3776మెట్రిక్ టన్నులు, నవంబర్ నెలలో 2769 మెట్రిక్ టన్నులు, డిసెంబర్ నెలలో ఇప్పటి వరకు 438 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా మార్క్ సైడ్‌లో ఇంకా 5400 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. నిన్న జిల్లాలోని అన్ని పిఎసిఎస్ సొసైటీలకు 720 మెట్రిక్ టన్నులు, ఈరోజు మండలంలోని అన్ని సొసైటీలకు 785 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు తెలిపారు. పంటల విస్తీర్ణాన్ని బట్టి అన్ని మండలాలకు యూరియా కేటాయింపులు జరుగుతాయని, దశలవారీగా యూరియా సరఫరా కొనసాగుతుందని అన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనకులోను కావద్దని ఆమె భరోసా ఇచ్చారు. ప్రస్తుత సీజన్‌లో మొక్కజొన్న సాగు విస్తీర్ణానికి అనుగుణంగా మాత్రమే యూరియా తీసుకోవాలని, అవసరానికి మించి వాడితే భూసారం దెబ్బతినే ప్రమాదం ఉందని జిల్లా వ్యవసాయాధికారి రైతులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి అనురాధతో పాటు మండల వ్యవసాయాధికారి ఎ నాగరాజు, వ్యవసాయ విస్తరణ అధికారి బి వసంత, తదితరులు పాల్గొన్నారు.

# రాబోయేది బిఆర్‌ఎస్ ప్రభుత్వమే

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

మానుకోటలో బిఆర్‌ఎస్ సర్పంచ్‌ల ఆత్మీయ అభినందన సభ



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** తెలంగాణలో మార్పు మొదలైందని, రాబోయేది బిఆర్‌ఎస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ పార్టీపైన తెలంగాణ అంతటా తిరుగుబాటు ప్రారంభమైందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా బిఆర్‌ఎస్ సర్పంచుల ఆత్మీయ అభినందన సన్మాన కార్యక్రమం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పిఎస్‌ఆర్ కన్వెన్షన్‌లో బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత అధ్యక్షతన శనివారం జరిగింది. కెటిఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గతంలో కంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు ఓటింగ్ శాతం పెరిగిందని దీన్ని బట్టి అంచనా వేస్తే రాబోయే ప్రభుత్వం బిఆర్‌ఎస్‌దేనని ఆయన స్పష్టం చేశా రు. అంతే కాకుండా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, తీరుపై ప్ర జలందరూ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ఆరోపించారు. నేడు ఎంతోమంది గిరిజన సర్పంచ్‌లు ఆయా గ్రామాలకు ప్రథమ పౌరులయ్యారంటే అది కెసిఆర్ ఘనతేనని ఆయన అన్నారు. గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుండి 10 శాతం వరకు పెంచి గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడిన నాయకుడు కెసిఆర్ మాత్రమే. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ రవీందర్ రావు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, డియస్ రెడ్యా నాయక్, హరిప్రియ నాయక్, బిఆర్ఎస్ నేతలు రాకేష్ రెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, సదానందం, మహబూబాబాద్ బిఆర్‌ఎస్ యువనేత యాళ్ల మురళీధర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, అయూబ్, ఎండి ఫరీద్ తదితరులుపాల్గొన్నారు.

## వరంగల్ కమిషనరేట్ పరిధిలో నియంత్రణలో నేరాలు

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో నియంత్రణలో నేరాలు ఉన్నాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. శనివారం భీమారంలోని శుభం కళ్యాణ వేదికలో వరంగల్ సిపి వరంగల్ పోలీస్ కమిషనరేట్ వార్షిక నివేదిక ‘ 2025 సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాంత భద్రతలకు సంబంధించి నివేదికలోని వివరాలను వెల్లడిస్తూ గత ఏడాదితో పోలిస్తే 0.53 శాతం స్వల్పంగా నేరాల పెరిగిందని గత ఏడాది 14,412 కేసులు నమోదు కాగా ప్రస్తుత సంవత్సరం 2025లో 14,456 కేసులు నమోదు కావడం జరిగిందని. నమోదైననేరాల్లో హత్య చేసిన దోపిడి కేసులు 4,దారి దోపిడీ 3, దోపిడీలు 16 కేసులు, దొంగతనాలు 355 కేసులు నమోదు కాబాడ్డాయి. డిసిపిలు రాజమహేంద్ర నాయక్,కవిత,ఎ.ఎస్‌పి చేతన్, అదనపు డిసి పి రవి, ప్రభాకర్, శ్రీనివాస్‌తో పాటు, ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు పాల్గొన్నారు.

# క్రీడలకు పేదరికం అడ్డుకాదు




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ నగరంలోని కెమిస్ట్రీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి జూడో పోటీలు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. అసోసియేషన్ అధ్యక్షులు కైలాసం యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ బొమ్మినేని రవీందర్ రెడ్డి ముఖ్య అతిధిగా, 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమార్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా బొమ్మనేని రవీందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు పేద, ధనిక అనే తేడాలు లేకుండా అందరిని సమానంగా చూసే వేదికలని అన్నారు. క్రీడల ద్వారా స్నేహభావం, క్రమశిక్షణ, మానసిక ధృడత్వం పెరుగుతాయని, యువత భవిష్యత్తును సుస్థితంగా తీర్చిదిద్దడంలో క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుండి జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో క్రీడాకారులు ఎదిగి తెలంగాణకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రత్యేకంగా జూడో క్రీడ బాలికలకు ఆత్మరక్షణతో పాటు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు జూడోను అభ్యసించి క్రీడా రంగంలో ఉన్నత స్థాయికి చేరి, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. క్రీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పేద బడులు, బలహీన వర్గాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రీడామండలి అధికారి అనిల్‌కుమార్, తెలంగాణ జూడో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజీజ్ ఫారుఖీ, ఉపాధ్యక్షురాలు బి రమాదేవి, సంయుక్త కార్యదర్శులు దుపాకీ సంతోష్ కుమార్, బి సాయిరాం యాదవ్, టెక్నికల్ కౌన్సిల్ చైర్మన్ చంద్రగిరి రాము, వివిధ జిల్లాల కార్యదర్శులు, కోచ్‌లు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అధికారులు సమర్థవంతంగా పని చేయాలి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రతి కేసులో నాణ్యమైన, బాధ్యతాయుతమైన దర్యాప్తు జరగడం వల్లనే బాధితులకు న్యాయం చే కూరుతుందని, నేరస్తులకు తప్పనిసరిగా శిక్ష పడేలా పోలీసులు అధికారులు సమర్థవంతంగా పని చేశారని జిల్లా ఎస్‌పి సిరిశెట్టి సంకీర్త్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపిఎస్ ఆధ్వర్యంలో జిల్లా స్థా యి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవారీ సమీక్షలో భాగంగా జిల్లా లో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు అందించిన సేవల విషయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది కనబరిచిన పనితీరును జి ల్లా ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ, ప్రతి కేసులో నాణ్యమైన, బాధ్యతాయుతమైన దర్యాప్తు జరగడం వ ల్లనే బాధితులకు న్యాయం చేకూరుతుందని, నేరస్తులకు తప్పనిసరిగా శిక్ష పడేలా పోలీసులు అధికారులు సమర్థవంతంగా పనిచేశారని సూ చించారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, ఎలాంటి జాప్యం లేకుండా విచారణ పూర్తి చేయాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాల ద్వారా విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గంజాయి అక్ర మ రవాణా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షణ చేయాలని, దొంగతనాల కేసుల్లో ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించి సొత్తు రికవరీ చేయాలని సూచించారు. సైబర్‌నేరాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేలా కార్యక్రమా లు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జ రిగే ప్రాంతాలను గుర్తించి తగిన ప్రమాద నివార ణ చర్యలు చేపట్టాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా కఠిన చర్య లు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు ఎస్‌పి నరేష్ కుమార్, డిఎస్‌పి సంపత్ రావు, కాటారం డిఎస్‌పి సూర్యనారాయణ, ఇన్‌స్పెక్టర్లు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## శ్రామిక విభజనను వ్యతిరేకిద్దాం

-సిఐటియు జాతీయ నేత పద్మనాభన్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** శ్రామిక విభజనను కార్మిక వర్గం వ్యతిరేకించాలని కేంద్ర ప్రభుత్వం కార్మిక విధానాలపై మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపి ఎకె పద్మనాభన్ పిలుపునిచ్చారు. 2026 సంవత్సరం శ్రామిక లోకానికి కీలకమవుతుందని ఆయన తెలిపారు. ఖమ్మంలో నూతనంగా నిర్మించిన సిఐటియు జిల్లా కార్యాలయాన్ని శనివారం పద్మనాభన్ ప్రారంభించారు. అంతకు ముందు పెవిలియన్ మైదానం నుంచి గట్టయ్య సెంటర్‌లోని సిఐటియు నూతన భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు నూతన భవనానికి బిటి రణదివే భవనంగా నామకరణం చేశారు. తెలంగాణ కార్మిక లోకం పోరాటాలకు సిద్దంగా ఉండాలని మత పరమైన విధానాలను తీసుకు వచ్చి కార్మికుల్లో విభజన తీసుకు వస్తున్నారని ఆరోపించారు. సంయుక్త కిసాన్ మోర్చా మాదిరి కార్మికులు కూడా ఐక్యంగా ఉద్యమిస్తేనే ఫలితం దక్కుతుందన్నారు. సిఐటియు జాతీయ కోశాధికారి సాయిబాబు మాట్లాడుతూ కార్పోరేట్లకు బిజెపి ప్రభుత్వం ఊడిగం చేస్తుందని ఆరోపించారు.

## ఐటిడిఎ పిఓ కృషి మరువలేనిది

**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కనుమరుగు కాకుండా మ్యూజియాన్ని ఏర్పాటు చేసి అందులో పొందు పరచటం అభినందనీయమని, ఇందుకు ఐటిడిఏ పిఓ చేస్తున్న కృషి మరువలేనిదని దివ్య హైస్కూల్ ప్రిన్సిపల్ కేవి రమణ, ఏ భారతి అన్నారు. శనివారం ఐటిడిఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియాన్ని పాఠశాలకు చెందిన 170మంది విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించారు. అందులో పొందు పరిచిన కళాకండాలను తిలకించి ఆహ్లాదంగా గడిపి ఆటలాడుకున్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ మూల వాసుల ఆచారాలు, పద్ధతులు సంస్కృతి సంప్రదాయాలు కళ్లకట్టినట్లు తెలిపే విధంగా ఏర్పాటు చేసి వాటి చరిత్ర విద్యార్థులకు అర్ధమయ్యే రీతిలో తెలుగులో ముద్రించి వాటి వద్ద ఉంచడంతో చక్కటి అవగాహన కలుగుతోందన్నారు. మ్యూజియం సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా అవకాశం కల్పించి విద్యార్థినీ విద్యార్థులకు ఆటవిడుపు కలగించటం బాగుందన్నారు. ఐటిడిఏ పిఓ కోయ భాషను నేర్చుకుని భాష ఆంతర్యాన్ని గిరిజనులు మర్చిపోకుండా చేస్తున్న కృషి ప్రశంసనీయం అన్నారు.రెహమాన్, ఖాసీం, నరేష్, విజయరావ్, నిర్వాహకులు వీరస్వామి, మాధవి, చలపతిరావుతో పాటు పాల్గొన్నారు.

## ఎడవల్లి రామిరెడ్డికి ఘన నివాళి



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని పాలేరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా శనివారం నాడు వారి స్వగ్రామంలో నిర్వహించిన దశదిన కర్మకు హాజరై రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూసుమంచి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి భీమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు బజ్జూరి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు బానోత్ శ్రీనివాస్‌నాయక్, జూకూరి గోపాల్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కంచర్ల జీవన్‌రెడ్డి, బానోతు రామ్‌కుమార్, ఎండి హైమద్ అలీ, చాట్ల పరుశురాం, ధరావత్ సురభి నాయక్, దామళ్ళ పాపారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ఎడవల్లి రామిరెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

## అక్రమ ఇసుక రవాణా



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురంలోని అమ్మగారిపల్లి పరిధిలో గోదావరిలోని ఇసుకను అక్రమంగా తోలుతున్న విషయాన్ని గ్రామస్తులు గుర్తించి రెవెన్యూ అధికారులకు చెప్పడంతో మండల తహసీల్దార్ మణిధర్ వెంటనే స్పందించి రెవెన్యూ అధికారులను సంఘటన స్థలానికి పంపించి అక్రమ ఇసుక రవాణా చేస్తున్న కుమ్మరిగూడెంకు చెందిన పాయం నాగేశ్వర రావుకు సంబంధించిన ట్రాక్టర్‌ను వారి పరిధిలోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.జిపిఓ లక్ష్మ ణ్, రెవెన్యూ అధికారులు, పాల్గొన్నారు.

## సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య



**ప్రజాపక్షం/ఇల్లందు:** మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్ అధ్యక్షతన జిల్లాలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లను సన్మాన కార్యక్రమంలో సహచర, ఎంపిలు, ఎంఎల్‌ఏలతో కలిసి ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు. ఇల్లందు మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, బయ్యారం మాజీ సొసైటీ ఛైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి, కొత్తపేట గంధంపల్లి సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేగులచలకలో ఎన్ఎస్ఎస్ శిబిరం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని రేగులచలక గ్రామంలో ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరాన్ని ప్రారంభించారు. శనివారం మహత్మ జ్యోతి బాపూలే వెనకబడిన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల రఘునాథపాలెం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన శీతాకాల శిబిరాన్ని ప్రిన్సిపాల్ వై. నాగేశ్వరరావు, సర్పంచ్ యండపల్లి రమాదేవి సత్యం లు ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు సేవాధృక్పథాన్ని అలవర్చుకోవాలనే ముఖ్య ఉద్దేశంతో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలో ఏడు రోజుల పాటు ఈ శి బిరం ఉంటుందని గ్రామస్తులు సహకారం అందించాలన్నారు. ఎన్ఎస్ఎస్ శిబిరంలో భా గంగా విద్యార్థులకు గ్రామ పంచాయతీ తరుపున పూర్తి సహయ సహకారాలను అందిస్తామన్నారు. శిబిరంలో భాగంగా విద్యార్థినిలు తొలిరోజు గ్రామ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పొదలను, చెత్తాచెదారాన్ని తొలగించి శ్రమదానం చేశారు. ఉప సర్పంచ్ నున్నా వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఆదాం,వార్డు సభ్యులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా॥ ఎన్. స్వాతి, అధ్యాపకులు కె.వినీల, సునీత, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సంస్కృతి పరిచయ పరీక్షలో గగన్‌కు ద్వితీయ స్థానం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రామాయణ, మహాభారత పరీక్షలో ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాల విద్యార్థి ప్రతిభ చూపి ద్వితీయ స్థానం సాధించాడు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక రంగాలలో సంస్కృతి పరిచయం అనే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రామాయణ, మహాభారత పరీక్షలో సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలలో సర్వజ్ఞ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతు న్న విద్యార్థి నల్లజల్ల గగన్ అసాధారణ ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయిలో రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు పాఠశాల ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్రకుమార్ తెలిపారు. విశ్వ హిందూ పరిషత్ వారు అందజేసిన షీల్డ్, విలువల నిర్మాణమే జాతి నిర్మాణం అనే నినాదంతో కూడిన ప్రమాణ పత్రాన్ని పాఠశాల ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్రకుమార్ చేతుల మీదుగా గగన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా భారతీయ సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆకాంక్షించారు. గగన్ సాధించిన ఈ విజయం పాఠశాలకు ఎంతో గర్వకారణమన్నారు. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ బృందం గగన్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రతి పైసా ప్రజల అభివృద్ధి కోసమే


రూ. 12,500 కోట్లతో
వ్యవసాయానికి ఉచిత విద్యుత్
రూ.8,600 కోట్లతో
మహిళలకు ఉచిత ప్రయాణం
డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి పొంగులేటి




**ప్రజాపక్షం/ నేలకొండపల్లి :** ప్రజా ప్రభుత్వం ప్రతి పైసా రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చే స్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. శనివారం నేలకొండపల్లి మండలం అనంత్ నగర్‌లో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు పర్యటించారు. ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి అనంత్‌నగర్‌లో 33/11కెవి సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. కామంచికల్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లో వోల్టేజీ సమస్యలు రాకుండా , వ్యవసాయ అవసరాలు, ప్రజా గృహ అవసరాలకు ఇబ్బందులు రాకుండా ఉండాలని సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక మంత్రి తమ దృష్టికి తీసుకు రావడంతో వెంటనే మంజూరు చేసి తక్కువ సమయంలోనే నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. గత పాలకులు రాష్ట్ర ప్రజలపై ఎనిమిది లక్షల కోట్ల అప్పుల భారం మోపినప్పటికీ ప్రజలకు ఉపయోగపడేవిధంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు.ప్రజా ప్రభుత్వం రైతుల కోసం ప్రతి ఏడాది రూ.12,500 కోట్లు ఖర్చు చేస్తూ నాణ్యమైన విద్యుత్‌ను వ్యవసాయానికి ఉచితంగా అందిస్తున్నామన్నారు. రూ.13,500 కోట్లు ఖర్చు చేస్తూ 96 లక్షల కుటుంబాలకు మనిషికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. కోటి మంది మహిళలకు ఇంటింటికి వెళ్లి ఇందిరమ్మ చీరలను ప్రజా ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. గత పాలకులు డబుల్ బెడ్ రూం ఇండ్ల పేరుతో పేద ప్రజలను మోసం చేసిందని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి 3,500 చొప్పున 4.50 లక్షల ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. ఇంటి నిర్మాణాలకు రూ.22,500 కోట్లు కేటాయించామని ప్రతి వారం ఇండ్ల పురోగతి ఆధారంగా బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన సన్న వడ్లకు దేశంలో ఎక్కడలేనివిధంగా మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ చెల్లిస్తున్నామన్నారు. మహిళలకు ఆర్టిసిలో ఉచిత ప్రయాణం కోసం ఆర్టిసి సంస్థకు రూ. 8,600 కోట్లు చెల్లిస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఎల్లప్పుడు ఆశీర్వదించాలని ఆయన కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రూ. 2.25 కోట్లతో అనంతసాగర్‌లో నిర్మించిన సబ్ స్టేషన్ ను ప్రారంభించుకోవడం, రూ. 1.75 కోట్లతో కామంచికల్‌లో సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన ఒకే రోజు చేసుకోవడం సంతోషకరమన్నారు. గత పాలకులు ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. గురుకులాల్లో పిల్లలకు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచామన్నారు. రాబోయే ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ లబ్దిదారులకు ఉప ముఖ్యమంత్రి, మంత్రి, కలెక్టర్ చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ ఛైర్మెన్లు వెన్నపూసల సీతారాములు, హరినాథ్‌బాబు, మాజీ ఛైర్మన్ శాఖమూరి రమేష్, కాంగ్రెస్ నాయకులు కోడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజని, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసా చారి, సిపివో ఎ. శ్రీనివాస్, ఖమ్మం ఆర్డివో నర్సింహారావు, సంబంధిత శాఖల జిల్లా అధికారులుపాల్గొన్నారు.

## రాబోయే తరానికి ఆదర్శం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గ్రంధాలయాలపై ఆధారపడి చదివి ఉద్యోగాలు సాధించిన వారు రాబోయే తరానికి ఆదర్శమని గ్రంధాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు అన్నారు. గ్రంధాలయంపై ఆధారపడి చదివిన భూక్యా రవి సింగరేణి హెడ్ ఆఫీస్‌లో జూ. అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారని, ఈ మధ్య వెలువడిన గ్రూప్ 3 ఫలితాల్లో సీనియర్ ఆడిటర్‌గా ఎంపికయ్యారని అన్నారు. ఈ మేరకు ఆయన గ్రంధాలయ కార్యదర్శి కరుణకుమారి ఆధ్వర్యంలో రవికి షాలువా కప్పి సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువు జీవితాలను మలుపు తిప్పుతుందని, కష్టపడి చదువుకుని ఉద్యోగాలు సాధించే జీవితం బంగారు మయంగా ఉంటుందని, ఇందుకు రవి ఆదర్శమని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన గ్రంధాలయంగా రాష్ట్రంలో మన జిల్లాకు మంచి పేరు ఉందని అన్నారు. ఆఫీస్ ఇంచార్జ్ నవీన్, గ్రంధపాలకురాలు మణి మృధుల, గ్రంధాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.



## ముక్కోటికి ముస్తాబు

సిద్ధమవుతున్న హంస వాహనం
కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు
జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ముక్కోటి ఉత్సవాలకు భద్రాచలం ముస్తాబవుతోంది. ఇప్పటికే అధ్యయనోత్సవాలు కొనసాగుతుండగా ఈనెల 29న జరిగే తెప్పోత్సవం, 30న జరిగే ఉత్తర ద్వార దర్శనానికి సంబందించిన అన్ని ఏర్పాట్లు చకచకా సాగిపోతున్నాయి. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉందనే అంచనాలతో ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. తాగునీరు, పారిశుధ్యంతో పాటు వసతి సదుపాయాలను కల్పించనున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే వారి కోసం తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా ప్రత్యేక బస్సు సర్వీసులను తిప్పేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వైకుంఠ ద్వారం వద్ద ఉన్న తలుపులకు మెరుగులు దిద్దుతున్నారు. భక్తులు స్వామిని వీక్షించేందుకు కావాల్సిన చర్యలు తీసుకుంటూ బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో ఆలయ పరిసరాల దేదీప్య మానంగా వెలుగులు వెదజల్లుతున్నాయి. **బలరామావతారంలో స్వామివారు :** వైకుంఠ ఏకాదశి అధ్యనోత్సవాల్లో భాగంగా స్వామివారు శనివారం బలరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అవతారంలో ఉన్న స్వామిని కనులారా చూసేందుకు భక్తులు పెద్ద ఎత్తున మిథిలా స్టేడియానికి చేరుకున్నారు. ముందుగా స్వామికి గర్భగుడిలో ప్రత్యేక అలంకారాన్నిధరింపజేసి పల్లకీలో ఏర్పాటు చేసినవేదిక వద్దకు తోడుకొచ్చారు. ఈసందర్భంగా కోలాట నృత్యాలు, భజన బృంధాల కోలాహలం ఎంతగానో ఆకట్టుకుంది. అవతార రూపుడైన రామయ్యను చూసిన భక్తులు ఒక్క సారిగా జై శ్రీరాం అంటూ రామనామ స్మరణ చేయడంతో ఆ ప్రాంగణంలో భక్తి భావంతో తొనికిసలాడింది. బలరామ అవతారంలోని రామయ్యను దర్శించుకున్న భక్తులు పరవశించి పోయారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

## సంస్కృతిక, సామాజిక విలువలను పెంపొందించాలి

ఇస్కఫ్ కన్వెన్షన్‌లో హైకోర్టు
న్యాయవాది కడారు ప్రభాకర్‌రావు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారతదేశ సంస్కృతి సామాజిక విలువలను పెంపొందించడానికి మేధావులు, కళాకారులు పాటుపడాలని హైకోర్టు న్యాయవాది కడారు ప్రభాకర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మం టిటిడిసి భవన్‌లో జరిగిన ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కో ఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్ (ఇస్కఫ్) పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ఖమ్మం జిల్లా కన్వెన్షన్‌లో హైకోర్టు న్యాయవాది కడారు ప్రభాకర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు భారతీయ సంస్కృతి ప్రపంచంలోనే అత్యంత విలువైందని దానిని పరిరక్షించుకునేందుకు ప్రతి పౌరుడు కృషి చేయాలన్నారు. భారతదేశం మతాలు, కులాలు, భాషలు, కళలకు నిలయమన్నారు. సోదర భావం, పరస్పర సహకారం భారత సమాజంలో విడదీయరాని బంధమన్నారు. భారత రాజ్యాంగం దేశ సమగ్రతకు, సమైక్యతకు కవచమన్నారు. ఇటీవల దేశంలో పెరిగిపోతున్న మతోన్మాద విచ్చిన్న శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. భిన్నత్వంలో ఏకత్వం భారత దేశ ముఖ్య సాంప్రదాయంగా నిలిచిందన్నారు. ప్రస్తుతం మిడి మిడి జ్ఞానంతో కొందరు మా మతమే గొప్ప అంటూ ఇతర మతాలపై దాడులు చేయడం, బోధనలు చేయడం దురదృష్టకరమన్నారు. ఒకవైపు పౌరులు మతాల కోసం కొట్టుకుంటుంటే పాలకులు దేశ సంపదను విదేశాలకు తరలించే పనిలో పడ్డారన్నారు. పేదరిక నిర్మూలన చేశామని పాలకులు చెబుతున్నప్పటికీ దేశంలో 80 కోట్ల మంది రేషన్‌కార్డు కలిగి ఉన్నారంటే దాని అర్థం గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు. తోట రామాంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ప్రజా కళాకారులు పమ్మి రవి, సీనియర్ న్యాయవాది పారుపల్లి అమర్‌చంద్, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు బత్తుల నర్సింహారావు, మహిళా ప్రాంగణం మాజీ కో ఆర్డినేటర్ నాగసరస్వతి, నగర ప్రముఖులు సాధిక్, తెలంగాణ ఉద్యమకారులు బొమ్మెర రామ్మూర్తి, పలువురు కళాకారులు పాల్గొన్నారు.


## భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్టిసి) ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు టిజిఎస్ ఆర్టిసి కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ పి. సోలోమన్ తెలిపారు. శనివారం ఖమ్మం రీజినల్ మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ పి. సోలోమన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం అదనపు బస్సులు, రోజు వారి నడపాల్సిన బస్సులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, జాతర విధులు నిర్వహించే ఉద్యోగులకు మౌలిక సదుపాయాల కల్పన, గత అనుభవాలపై చర్చించారు. ఈ సందర్భంగా సోలోమన్ మాట్లాడుతూ ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసీ జాతరైన సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తులకు ఎటువంటి రవాణా ఇబ్బందులు కలుగకుండా ఆర్టిసి ఆధ్వర్యంలో తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని విభాగాలు సమన్వయం చేసుకుని భక్తులకు సేవలు అందించాలన్నారు. భక్తులకు రవాణా సౌకర్యాలు కల్పించాలన్నారు. రోజు వారి బస్సులతో పాటు జాతర సమయంలో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆయన తెలిపారు. ఖమ్మం రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి జాతరకు బస్సులు నడపనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, అకౌంట్స్ ఆఫీసర్ జ్యోత్స్న, పర్సనల్ ఆఫీసర్ సంపత్, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.



# అనర్హుల సంగతేంటి సారూ...

అంతే వదిలేస్తారా?
చర్యలు తీసుకుంటారా?
అక్రమార్కుల ఖాతాల్లోకి రూ. లక్షలు
నకిలీ ధృవీకరణలపై చర్యలేవీ...?




**ప్రజాపక్షం/ ఖమ్మం :** అర్హులకు పింఛన్ ఇవ్వడానికి నానా ఇబ్బందులు పెట్టే అధికార యంత్రాంగం అనర్హులకు పింఛన్ ఇవ్వడంపై ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నకు అధికార యంత్రాంగం స్పందించాల్సిన అవసరం ఉంది. అనర్హులను వదిలేస్తారా లేకుంటే చర్యలు తీసుకుంటారా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి కేంద్రంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వందలాది మందికి నకిలీ వికలాంగ ధృవపత్రాలను జారీ చేశారు. అనేక మంది కనీస వైకల్యం లేకుండానే పింఛన్ పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఒక ముఠా గ్రామాల్లో కొందరిని ఎంపిక చేసుకుని ఎటువంటి వైకల్యం లేకపోయినా ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ. 40వేల నుంచి రూ. 50వేలు వసూలు చేసి ఖమ్మం పెద్దాసుపత్రి ద్వారా నకిలీ ధృవీకరణ పత్రాలను ఇప్పించారు. కనీస వైకల్యం లేకుండానే ప్రతి నెల నాలుగువేల రూపాయలు అక్రమార్కుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. వికలాంగుల పింఛన్ పొందాలంటే కనీసం 40 శాతం అంగవైకల్యం ఉండాలి. కానీ ఎటువంటి వైకల్యం లేకుండానే 50 నుంచి 80 శాతం వరకు వైకల్యం ఉందని ధృవీకరిస్తూ ధృవపత్రాలను అందజేశారు. ఖమ్మం జిల్లాలో ఈ ముఠా ద్వారా సుమారు రెండు వేల నకిలీ వికలాంగ ధృవపత్రాలు పొంది పింఛన్ పొందుతున్నట్లు సమాచారం. బోనకల్, వైరా, చింతకాని, తల్లాడ, పెనుబల్లి, మధిర , ముదిగొండ మండలాల్లో ఇటువంటి నకిలీ ధృవపత్రాలు పొందిన వారు అధిక సంఖ్యలో ఉన్నారు. దీనిపై గతంలో ఫిర్యాదులు వచ్చిన సందర్భంలో ప్రభుత్వాసుపత్రిలోని ఓ చిరుద్యోగిపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకుని విధుల నుంచి తప్పించింది.ఎటువంటి వైకల్యం లేకుండానే అంగవైకల్యం ఉందని ధృవీకరించిన వైద్యులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. సదరం క్యాంపులకు వచ్చి వికలాంగులు నానా ఇబ్బందులు పడితే అంగవైకల్యం ఉందని ధృవీకరించడానికి పలుమార్లు పరీక్షించి వికలాంగులను ప్రభుత్వ ఆసుపత్రి చుట్టూ తిప్పుకునే వైద్యులు అసలు వైకల్యమే లేకుండా ఎలా ధృవీకరించారన్నది ఇప్పటి ప్రశ్న. వైద్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు అనేక ఏళ్లుగా ఎటువంటి వైకల్యం లేకుండానే పింఛన్ పొందుతున్న వారి పైన క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంది. గ్రామాల వారీగా వికలాంగ ధృవీకరణకు సంబంధించి ప్రత్యేక పరిశీలన బృందాలను ఏర్పాటు చేసినట్లయితే నకిలీ ధృవపత్రాల ద్వారా పింఛన్ పొందుతున్న వారి గుట్టు రట్టవుతుంది. జిల్లా అధికార యంత్రాంగం వికలాంగ పునర్ పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా ధనాన్ని అక్రమంగా అనుభవిస్తున్న వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా వ్యాప్తంగా పలు ఫిర్యాదులు వచ్చినా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కానీ, జిల్లాకు చెందిన ఉన్నతాధికారులు కానీ దీనిపై స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. వైద్యులను రక్షించే క్రమంలోనే చర్యలకు వెనకాడుతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

## ఏడాది కాలంలో 326 మంది మావోయిస్టుల లొంగుబాటు

సుమారు రూ.30 కోట్ల గంజాయి స్వాధీనం
2025 మీడియా సమావేశంలో ఎస్‌పి రోహిత్ రాజ్




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 326 మంది మావోయిస్టులు లొంగిపోయారని ఎస్‌పి రోహిత్ రాజ్ తెలిపారు. ఈ మేరకు శనివారం 2025 మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు పనితీరు ప్రశంసనీయం అన్నారు. గత ఏడాదితో పోలిస్తే 9.65 శాతం నేరాలు పెరిగాయని, గత ఏడాది 5636 కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 6180 కేసులు చేసినట్లు తెలిపారు. అదే విధంగా మహిళలపై నేరాలు తగ్గుముఖం పట్టాయని, జిల్లా వ్యాప్తంగా రూ.28.54 కోట్ల విలువచేసే గం జాయి పట్టికున్నట్లు చెప్పారు. చోరీలకు సంబంధించి 307 కేసుల్లో రూ. 3,75,10,691 సొత్తు ల్లోగారూ.1,21,99,297 లను రికవరీ చేసినట్లు, ఇందులో సీనియర్ పోలీసుల పాత్ర కీలకం అన్నారు. లోక్ అదాలత్ ద్వారా 205 95 కేసులు పరిష్కారమయ్యాయని, డ్రంక్ అండ్ డ్రైవ్ 15347 కేసులు, సైబర్ క్రైమ్ 196 కేసులు నమోదైనట్లు చెప్పారు. ఇందులో 1824 కేసులు పరిష్కారానికి నోచుకున్నాయని, ఏడుగురికి జీవిత ఖైదు, ఇద్దరికి 20 సం. జైలు శిక్షణ, ఐదుగురికి పది సం. జైలు శిక్ష, ముగ్గురికి ఏడు సం. జైలు శిక్ష ఖరారు అయిందన్నారు. కాబోయే ఏడాదిలో సిబ్బంది మరింత పట్టుదలతో పనిచేసి జిల్లా పేరు ప్రతిష్టలను మరింత నిలబెట్టాలని, నేరాల అందుపులో ముందుకు సాగాలని తెలిపారు. ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్, ఇల్లందు, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు డిఎస్‌పిలు, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# క్రీడ

## ఎన్నాళ్లో వేచిన విజయం!



**ఆసీస్ గడ్డపై గెలిచిన ఇంగ్లండ్..**
**నాలుగో టెస్టులో 4 వికెట్ల తేడాతో విక్టరీ**

ఆస్ట్రేలియా గడ్డపై ఆ దేశాన్నే ఓడించింది ఇంగ్లండ్. సుమారు 14 ఏళ్ల విరామం తర్వాత ఆసీస్ పిచ్‌పై టెస్టుల్లో ఇంగ్లండ్ జట్టు విజయం సాధించింది. మెల్‌బోర్న్‌లో జరిగిన నాలుగో టెస్టులో ఇంగ్లండ్ నాలుగు వికెట్ల తేడాతో అసాధారణ విజయాన్ని నమోదు చేసింది. కేవలం రెండు రోజుల్లోనే బాక్సింగ్ డే మ్యాచ్ ముగియడం గమనార్హం. ఆసీస్, ఇంగ్లండ్ మధ్య జరిగిన పెర్త్ టెస్టు కూడా రెండు రోజుల్లో ముగిసిన విషయం తెలిసిందే. అయితే పెర్త్ టెస్టులో ఆస్ట్రేలియా విక్టరీ కొట్టగా, శనివారం మెల్‌బోర్న్‌లో ఇంగ్లండ్ స్వీట్ విక్టరీ నమోదు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో 175 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇంగ్లండ్ ఆరు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకున్నది. వాస్తవానికి ఈ మ్యాచ్ కూడా హోరాహోరీగా సాగింది. ఆస్ట్రేలియా బౌలర్లు ఇంగ్లండ్ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. టార్గెట్ చిన్నదే అయినా.. ఇంగ్లండ్ క్రికెటర్లు తెగ ఇబ్బందిపడాల్సి వచ్చింది. పేస్ అటాక్‌తో ఆస్ట్రేలియా బౌలర్లు చమటలు పట్టించింది. శనివారం రెండో రోజు ఆస్ట్రేలియా తన రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 132 రన్స్ కే ఆలౌటైంది. ఇంగ్లండ బౌలర్లలో బ్రౌడన్ కార్సే 4, స్టోక్స్ 3, టాంగే రెండు వికెట్లు తీసుకున్నారు. నిజానికి యాషెస్ సిరీస్‌ను ఇప్పటికే ఆస్ట్రేలియా సొంతం చేసుకున్నది. కానీ ప్రస్తుతం ఆధిపత్యాన్ని 31కి తగ్గించింది ఇంగ్లండ్. ఆస్ట్రేలియా తన స్వంత గడ్డపై ఓడించేందుకు ఇంగ్లండ్‌కు 15 ఏళ్లు పట్టింది. ఇన్నేళ్లలో ఇంగ్లండ్ 16 టెస్టుల్లో ఓడగా, రెండు మ్యాచ్‌లను డ్రా చేసుకున్నది. రెండు రోజుల్లోనే ముగిసిన పెర్త్ టెస్టులో మొత్తం 847 బంతులు వేయగా, ఇక మెల్‌బోర్న్ టెస్టులో 852 బాల్స్ పడ్డాయి. 2011లో సిడ్నీలో జరిగిన టెస్టులో చివరిసారి ఇంగ్లండ్ విజయం సాధించింది. మెల్‌బోర్న్ పిచ్‌పై విమర్శలు వస్తున్నాయి. తొలి రోజే ఆ పిచ్‌పై 20 వికెట్లు కూలాయి. ఇక రెండో రోజు కూడా 16 వికెట్లు పడ్డాయి. దీంతో పిచ్‌ను మేనేజ్ చేస్తున్న తీరును విమర్శిస్తున్నారు.

## మైదానంలో విషాదం



**మ్యాచ్ చూస్తూ.. ప్రాణాలు విడిచిన కోచ్**

క్రికెట్ మైదానంలో విషాదం నెలకొంది. ఢాకా క్యాపిటల్స్ జట్టు అసిస్టెంట్ కోచ్ మహబూబ్ అలీ జకీ హఠాత్తుగా మరణించాడు. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్ సమయంలో ఉన్నట్టుండి కుప్పకూలిన ఆయన 50 ఏళ్ల వయసులో కన్నుమూశాడు. తమ కోచ్‌ను బతికించుకునేందుకు క్యాపిటల్స్ యాజమాన్యం ఆయనను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. దాంతో.. ఢాకా క్యాపిటల్స్ ఆటగాళ్లు, సిబ్బంది సహా యావత్ క్రీడా లోకం షాక్‌కు గురైంది. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో శనివారం ఢాకా క్యాపిటల్స్‌కు తొలి మ్యాచ్. సిల్హెట్ అంతర్జాతీయ మైదానంలో మ్యాచ్‌కు ముందు మహబూబ్ అలీ జకీ పిచ్ వద్దకు వెళ్లి పరిశీలించిన ఆయన.. మ్యాచ్ చూస్తూ చూస్తూ కిందపడిపోయాడు. అలీ అలా పడిపోవడం చూసిన సహాయక సిబ్బంది, వైద్య బృందం వెంటనే కార్డియోపల్మోనరీ రిసాసిటేషన్( సీపీఆర్) ఆయన ప్రాణాలకు కాపాడేందుకు చేశారు. అయినా ఆయనలో చలనం లేకపోవడంతో హుటాహుటిన అంబులెన్స్‌లో సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అలీ చనిపోయాడని వైద్యులు తెలిపారు. అసిస్టెంట్ కోచ్‌గా సేవలందిస్తున్న అలీ మరణవార్తను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చీఫ్ ఫిజీషియన్ డెబాషిశ్ చౌదరీ మీడియాకు వెల్లడించాడు. గతంలో అలీకి ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవని.. ఆయన మరణం అందర్నీ షాక్‌కు గురిచేసిందని డెబాశిష్ చెప్పాడు.

## ఆ ఓటమి బాధిస్తోంది

**టీమిండియాపై ప్రతీకారం తీర్చుకుంటాం : కిమ్ గార్త్**

ప్రపంచ కప్ ఏదైనా ఆస్ట్రేలియా ఆధిపత్యం మామూలే. కానీ, పదమూడో సీజన్ వన్డే వరల్డ్‌కప్‌లో మాత్రం భారత జట్టు చేతిలో మాజీ ఛాంపియన్ సెమీస్‌లోనే ఇంటిదారి పట్టింది. రికార్డు స్థాయిలో తమను కప్ గెలవకుండా చేసిన టీమిండియాపై ఆసీస్ జట్టు సభ్యులు కాస్త గుర్రుగానే ఉన్నారు. తాజాగా కంగారూ పేసర్ కిమ్ గార్త్ మాట్లాడుతూ.. సెమీఫైనల్లో ఓటమిని తాము ఇంకా మర్చిపోలేదని అంది. టీమిండియాపై కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని ఆమె అంటోంది. ఆస్ట్రేలియా బ్రాడ్‌కాస్టింగ్ కార్పోరేషన్ పాడ్‌కాస్ట్‌లో శనివారం కిమ్ గార్త్ మాట్లాడింది. ఈ సందర్భంగా వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో టీమిండియా చేతిలో ఓటమిని ప్రస్తావించింది. వచ్చే ఏడాది స్వదేశంలో జరుగబోయే ద్వైపాక్షిక సిరీస్‌లో భారత్‌ను ఓడించి దెబ్బకు దెబ్బ తీస్తామని ధీమాగా చెప్పింది స్పీడ్‌స్టర్. 'పదమూడో సీజన్ వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్లో ఓటమి మమ్మల్ని ఇంకా బాధిస్తోంది. భారత్ మెరుగైన జట్టే. ఇండియాలో ఆడిన ప్రతి మ్యాచ్ గొప్పగా అనిపిస్తుంది. అయినా సరే పరాజయాన్ని ఇప్పటికీ మేము జీర్ణించుకోలేకపోతున్నాం. ఆ ఓటమికి బదులు తీర్చుకుంటాం. రెండు నెలల్లో టీ20, వన్డే సిరీస్, టెస్టు మ్యాచ్ కోసం టీమిండియా మా దేశానికి వస్తుంది. అప్పుడు ఓడించి ప్రతీకారం తీర్చుకుంటాం' అని గార్త్ పేర్కొంది. సెమీఫైనల్లో గార్త్ 7 ఓవర్లలో 46 పరుగులిచ్చి 2 వికెట్లు తీసింది. 2026లో మూడు ఫార్మాట్ల సిరీస్ కోసం భారత జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఫిబ్రవరి మార్చిలో ఆతిథ్య జట్టుతో టీమిండియా మూడు టీ20లు, మూడు వన్డేలు, ఒక టెస్టు మ్యాచ్ ఆడనుంది.



డీవై పాటిల్ మైదానం వేదికగా జరిగిన సెమీఫైనల్లో ఫొబె లిచ్‌ఫీల్డ్ (119) సెంచరీతో మెరవగా ఆస్ట్రేలియా 338 పరుగులు చేసింది. అనంతరం భారీ ఛేదనలో టీమిండియాకు షాకిస్తూ ఆరంభంలోనే ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధానలను ఔట్ చేసింది కిమ్ గార్త్. దాంతో.. భారత్ ఒత్తిడిలో పడినా జెమీమా రోడ్రిగ్స్ (127 నాటౌట్) చిరస్మరణీయ శతకంతో ఆసీస్ ఆశలపై నీళ్లు చల్లింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(89)తో కీలక భాగస్వామ్యం.. ఆపై రీచా ఘోష్(26) మెరుపులతో ఫైనల్ చేరింది భారత్. టైటిల్ పోరులో దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో చిత్తుచేసిన విమెన్ ఇన్ బ్లూ తొలిసారి విశ్వవిజేతగా అవతరించింది.




## మార్కెట్లను రీసెట్ చేసిన 2025

ఈ ఏడాది కేవలం భారత దేశంలోనేగాక, యావత్ ప్రపంచంలోనూ స్టాక్ మార్కెట్లు అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న పలు నిర్ణయాలు, ప్రత్యేకించి వాణిజ్య యుద్ధానికి దారితీసే టారిఫ్‌లు మార్కెట్లను తీవ్రంగా ప్రభావితం చేశాయి. బలమైన ఆర్థిక వృద్ధి ఒకవైపు, ఊహించని పరిణామాలు మరోవైపు స్టాక్ మార్కెట్‌ను రెండు భిన్నమైన కోణాల్లో ఆవిష్కరించాయి. ఆర్థిక వృద్ధి కొనసాగినప్పటికీ, స్టాక్ మార్కెట్‌లో అతిగా పెరిగిన విలువలకి కళ్లెం వేసిన సంవత్సరంగా 2025ని చెప్పుకోవచ్చు. తయారీ, బ్యాంకింగ్, స్టార్టప్‌లలో దృఢత కనిపించింది, ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతల మధ్యనైనా వ్యాపారం తట్టుకుని నిలిచింది. భారత స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధి, 2025 ఆర్థిక సంవత్సరంలో సుమారుగా 6.5 శాతం దగ్గర, చివరి త్రైమాసికంలో సుమారు 7.4 శాతం వద్ద నిలిచింది. భారత్‌ను వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిపింది. బహుపాక్షిక సంస్థల అంచనాల ప్రకారం 2025–26లో ఆర్థిక వృద్ధి సుమారు 6.2%–6.9 శాతం మధ్య ఉండొచ్చని, దీనికి అంతర్గత డిమాండ్ ప్రభుత్వ మూలధన వ్యయం, తగ్గుతున్న ద్రవ్యోల్బణం బలంగా తోడయ్యాయని భావిస్తున్నారు. 2026కి ప్రధాన సవాలుగా తక్కువ ఆదాయ పట్టణ–గ్రామీణ వర్గాల్లో వినియోగం మళ్లీ బలపడటం అవసరమని ఆర్థిక విశ్లేషణలు సూచిస్తున్నాయి.

### మార్కెట్లు.. ఫైనాన్స్

అనేక సంవత్సరాల బుల్ రన్ తరువాత, 2025లో చిన్న–మధ్యస్థ షేర్లలో వాల్యుయేషన్ రీసెట్ జరిగింది. నిఫ్టీ50 సుమారు 8–9 శాతం లాభంతో సంవత్సరం ముగించగా, మిడ్‌క్యాప్ సూచీలు తక్కువ సింగిల్ డిజిట్ లాభాలు మాత్రమే చూపాయి. చాలా స్మాల్‌క్యాప్‌లు అయితే మైనస్‌లోనే ముగిశాయి. బిఎస్‌ఇ 500లో దాదాపు మూడో వంతు కంపెనీలు 2025లో 20శాతానికిపైగా పడిపోయాయి. అదే సమయంలో నియంత్రణ సడలింపులు, వడ్డీ/జిఎస్‌టి తగ్గింపుల మద్దతుతో ఫైనాన్షియల్స్, ఆటో రంగం బలంగా ర్యాలీ చేశాయి. భారత బ్యాంకింగ్ రంగంపై గ్లోబల్ ఇన్వెస్టర్ల ఆకర్షణ పెరిగి, సంవత్సరంలో సుమారు 14–15 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు భారత ఫైనాన్షియల్ కంపెనీల్లోకి వచ్చాయని అంచనాలు చూపుతున్నాయి. మొత్తం 14 రంగాల్లో అమలవుతున్న ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పిఎల్‌ఐ) పథకాల ద్వారా 2025 మధ్య నాటికి సుమారు రూ. 1.88 లక్షల కోట్లు ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చి, రూ. 17 లక్షల కోట్లకు పైగా అదనపు ఉత్పత్తి సాధించినట్టు అధికారిక సమీక్షలు చెబుతున్నాయి. ఈ పథకాల వల్ల దాదాపు 12.3 లక్షల ప్రత్యక్ష–పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడి, ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, ఫార్మా, టెలికాం ఎక్విప్‌మెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో కలిపి రూ. 7.5 లక్షల కోట్లకుపైగా ఎగుమతులు జరిగాయని అంచనా. వ్యాపార సౌలభ్యంపై దృష్టిపెట్టి 47,000కు పైగా కంప్లయెన్స్ నిబంధనలను సవరించడం, డిజిటైజ్ చేయడం, డీక్రిమినలైజ్ చేయడం లేదా రద్దు చేయడం జరిగింది. నేషనల్ సింగిల్ విండో సిస్టమ్ ద్వారా 11.5 లక్షలకుపైగా అప్లికేషన్లు ప్రాసెస్ అయ్యాయి.

### ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ/ క్లోజింగ్): సెన్సెక్స్ 85,041.45 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 84,929.36 పాయింట్లు. లాభం 112.09 పాయింట్లు). జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్): నిఫ్టీ 26,042.30 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 25,966.40 పాయింట్లు. లాభం 75,90 పాయింట్లు).

### బులియన్ మార్కెట్..



భారత ఈ ఏడాది బులియన్ మార్కెట్‌ను సంక్షిప్తంగా చూస్తే.. బంగారం ధరలు చరిత్రాత్మక గరిష్ఠాలకు చేరి, ఆస్తి సంరక్షణకు 'సురక్షిత' పెట్టుబడిగా మరింత బలమైన ఇమేజ్ పొందిన సంవత్సరం, కానీ ఈ ధరలే నగల వినియోగాన్ని బాగా తగ్గించాయి. భారత్‌లో 24 క్యారెట్ బంగారం ధర సగటున 80 శాతం పెరగడం గమనార్హం. డిసెంబర్ చివరి నాటికి గ్రాముకు రేట్లు రికార్డు స్థాయిల దగ్గర ఉండటంతో, బంగారం సూపర్ బుల్ రన్ దశలో ఉందని విశ్లేషకులు పేర్కొన్నారు. రికార్డు స్థాయి ధరల వల్ల మొత్తం వార్షిక బంగారం డిమాండ్ 600–700 టన్నుల మధ్య, ఐదు సంవత్సరాల కనిష్ఠానికి పడిపోయే అవకాశం ఉందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనా వేసింది. 2025 మూడో త్రైమాసికంలో పరిమాణ పరంగా డిమాండ్ దాదాపు 16 శాతం తగ్గినా, విలువ పరంగా ఖర్చు సుమారు 23 శాతం పెరగడం, బంగారం ధరల విపరీతమైన పెరుగుదలను ప్రతిబింబించింది. పెళ్లి, పండుగలతో నగల కొనుగోలు కొంత నిలకడగా ఉన్నా, రోజువారీ/లగ్జరీ నగల కొనుగోలు గణనీయంగా తగ్గింది. ఇక్కడి పెట్టుబడిదారులు ఇటిఎఫ్‌లు, సావరిన్ గోల్డ్ బాండ్లు, డిజిటల్ గోల్డ్ వంటివాటిమార్గంగా పెట్టుబడి డిమాండ్‌ను 20 శాతానికిపైగా పెంచి, మొత్తం డిమాండ్‌లో పెట్టుబడి వాటాను చారిత్రాత్మకంగా ఉన్నంత గరిష్ఠ స్థాయికి తీసుకెళ్లారు. వచ్చే ఏడాది క్రమంగా పరిస్థితి మెరుగుపడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

### రూపాయి దారుణ పతనం

డాలర్‌తో పోలిస్తే, 2025లో రూపాయి గణనీయంగా బలహీనమై, సుమారుగా 4.7 నుంచి 5 శాతం వరకు క్షీణించి, ఒక్క దశలో డాలర్‌కు 90 రూపాయల సైకలాజికల్ స్థాయిని దాటిన ఏడాది గా నిలిచింది. అమెరికా వడ్డీ రేట్లు, గ్లోబల్ అనిశ్చితి కారణంగా డాలర్ బలపడటం, అలాగే భారత స్టాక్‌మార్కెట్‌లో విదేశీ పెట్టుబడుల (ఎఫ్‌పిఐ) బయటకు వెల్లివేత రూపాయిపై ఒత్తిడి తెచ్చాయి. భారత్ వాణిజ్య లోటు పెరగడం, అమెరికా విధించిన అధిక టారిఫ్‌లు, ఆర్‌బిఐ విదేశీ చలామణి మార్కెట్లో జోక్యం కొంత తగ్గించడం వంటి కారకాలు కలిసివచ్చి రూపాయి మరింత బలహీనమయ్యింది. రూపాయి మారకం విలువ తగ్గడంతో దిగుమతి ఖర్చులు పెరిగాయి. క్రూడ్ ఆయిల్, ఎలక్ట్రానిక్స్, ఎరువులు, మెడికల్ ఎక్విప్‌మెంట్ లాంటి కీలక దిగుమతులు ఖరీదై, ద్రవ్యోల్బణంపై పైదిశ ఒత్తిడి పెంచాయి.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

# వందేళ్లుగా పేదల పక్షాన నిలబడ్డ ఘనత సిపిఐదే

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మ**






**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** వందేళ్లుగా పేద ప్రజల పక్షాన నిలబడ్డ ఘనత ఎర్రజెండా సిపిఐ దేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మ అన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా లహరిగార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మొదటగా స్థానిక సంతబజార్ పురవీధుల మీదుగా వంద మీటర్ల ఎర్రజెండాతో పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి బస్టాండు సమీపంలో సిపిఐ జెండాను ఆవిష్కరించారు. లహరిగార్డెన్‌లో ఏర్పాటుచేసిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల్‌నర్సింహ్మ మాట్లాడుతూ గత వందేళ్లుగా పేదప్రజలపక్షాన నిలబడి అనేక పోరాటాలు చేసిన ఘనత సిపిఐకే దక్కుతుందన్నారు. కష్టజీవుల వెన్నంటే సిపిఐ నిలుస్తుందని, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిందని, అనేక మంది జైలుజీవితం గడిపారని వివరించారు. తెలంగాణలో జరిగిన నిజాం నవాబుకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి కోసం జరిగిన పోరాటంలో 4500ల మంది కమ్యూనిస్టులు రక్తార్పణ చేశారని తెలిపారు. సిపిఐ చరిత్ర సిపిఐ పుట్టిన నాటి నుండి నేటివరకు చేసిన పోరాటా లు, త్యాగాలు జయాలు, అపజయాలు నాగపూర్ నగరంలో సిపిఐ పురుడు పోసుకున్నదన్నారు. నేటికి భారతదేశ వ్యాప్తంగా గ్రామగ్రామాన సభ్యత్వంలేని ఎర్రజెండాగా విరజిల్లుతుంటే ప్రజల తరపున నిరంతరం పోరాటాలను నిర్వహిస్తూ ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ప్రజల అవసరాలు తీర్చడంకోసం పూర్తిగా సిపిఐ ఉందన్నారు. అధికారం ఉన్న లేకున్నా ప్రజల మధ్య లో ఉంటామన్నారు. సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలు ఖమ్మం పట్టణంలో జరిగే జనవరి 18న దేశవ్యాప్త బహిరంగ సభను లక్షలాదిమందితో ఖమ్మంలో జరుగుతుందని, జిల్లాల నుండి వందలాదిగా పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంద్‌జి, సిపిఐరాష్ట్ర కార్యవర్గసభ్యురాలు చాయాదేవి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వార్లవెంకటయ్య, కేశవులుగౌడ్, సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్, నాగర్‌కర్నూల్ జిల్లాకార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి, పెబ్బేటి విజయుడు, ఆర్.ఇందిరమ్మ, సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు హుస్సేనయ్య, సిపిఐజిల్లా సమితి సభ్యులు శివశంకర్, కృష్ణాజి, మర్యాదవెంకటయ్య, బండిలక్ష్మి పతి, బిజ్జశ్రీనివాసులు, డాక్టర్ శ్రీనివాసులు, కొత్త రామస్వామి పాల్గొన్నారు.

# చెరువులను తలపిస్తున్న మురికి కాలువలు



**సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీరాములు**

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని కొత్త గుండ్లపల్లి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, మురికి కాలువలు చెరువులను తలపిస్తున్నాయని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు విమర్శించారు. శనివారం ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా 8వ వార్డులో మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య జెండా ఆవిష్కరణ చేసి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా 5, 6, 7, 8 వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల మధ్య మురికి నీరు నిలిచి ఉండటంతో ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి భయంకరమైన వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో భాగంగా పలు కీలక సమస్యలను నాయకులు 8వ వార్డులోని వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరిందని, అది ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ప్రతి వార్డులో కరెంటు లైన్లు కిందకు వేలాడుతూ ప్రమాదాలకు సంకేతంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అమృత పథకం కింద సీసీ రోడ్లు తవ్వి పైపులు వేయకుండా వదిలేశారని, దీనివల్ల వృద్ధులు, పిల్లలు నడవలేక కింద పడి గాయపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భర్త చనిపోయి ఏళ్లు గడుస్తున్నా, అర్హులైన మహిళలకు వితంతు పెన్షన్లు అంద క ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వార్డుల పర్యటనలో సేకరించిన ప్రజా సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 29, సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు శ్రీరాములు ప్రకటించారు. ఈ ధర్నాకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, పేరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లపల్లి మహేందర్, మున్సిపల్ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, నాయకులు పేరబోయిన బంగారు, ముక్కెర్ల పెంటయ్య, గుండు వెంకటేష్, రాయగిరి బాలకిషన్, మాటూరి మల్లయ్య, పబ్బాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్య్ర ఉద్యమ ప్రత్యక్ష పోరాటంలో పాల్గొన్న చరిత్ర సిపిఐది

**జనవరి 18న ఖమ్మంలో జరగనున్న సిపిఐ వందేళ్ల సంబరాలకు అధిక సంఖ్యలో తరలిరండి : బాలకిషన్**

**ప్రజాపక్షం/జడ్చర్ల :** ఖమ్మం పట్టణ కేంద్రంలో జనవరి 18,2026 జరగబోయే సిపిఐ వందేళ్ల సంబరాలకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డిసెంబర్ 26, 2025 నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జడ్చర్ల మండలంలోని నసురుల్లాబాద్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో జెండా ఎగురేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఖమ్మం పట్టణ కేంద్రంలో జనవరి 18న ఐదు లక్షల జనాభాతో దేశంలోని అన్ని రాష్ట్రాలలో ప్రతినిధులతో పాటు 40 దేశాల అతిథులు కూడా పాల్గొంటారని తెలిపారు. భారత దేశంలో సిపిఐ ఆవిర్భావం నుంచి ఎంతోమంది ప్రాణాలు త్యాగం చేసి పేద ప్రజల హక్కుల కోసం కార్మికుల చట్టాల గురించి స్వాతంత్ర ఉద్యమంలో ముందుభాగాన ఉండి అనేక ప్రత్యక్ష పోరాటంలో పాల్గొన్న ఘన చరిత్ర సిపిఐదని. ఈ పోరాటం చరిత్రను భవిష్యత్తు తరాలకు అందిస్తూ రాబోయే కాలంలో దేశంలో అన్ని కమ్యూనిస్టు పార్టీలను ఏకం చేస్తూ గత పోరాటాల స్ఫూర్తితో భవిష్యత్తులో ప్రజా సంఘాల నిర్మాణం ప్రజా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాగి కృష్ణయ్య, నస్రుల్లాబాద్ గ్రామ సర్పంచి నిర్మల, బాలస్వామి, ఉపసర్పంచ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు భూపాలపల్లిలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల పైలాన్ ఆవిష్కరణ






**హాజరుకానున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ● సిపిఐ జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్**

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శతాబ్ది ఉత్సవాల పైలాన్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్ కుమార్ మాట్లాడుతూ, దేశంలో అనేక పార్టీలు ఆవిర్భవించాయని, అధికారంలో ఉంటే ఉంటాయి లేదంటే కనుమరుగతాయని, ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలు నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ 1925లో ఏర్పాటు చేయడం జరిగిందని, 2025లో 100 సంవత్సరాలు పూర్తి చేసుకుందని తెలిపారు. 100 సంవత్సరాలలో పేదల పక్షాన భూపోరాటం చేసి లక్షల ఎకరాలు పంపిణీ చేసి, ఎంతోమంది ప్రాణ త్యాగాలు చేసిన ఘనత సిపిఐ దని కొనియాడారు. ఈ 100 సంవత్సరాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ముందు శత వసంతాల పైలాన్ ఆవిష్కరించడం జరుగుతుందని, ఈ పైలా న్ ఆవిష్కరణకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సిపిఐ రాష్ట్ర సహా య కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాస రావు ముఖ్యఅతిథిగా హాజరై పైలాన్‌ను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. స్వలా భం కోసం కాకుండా ప్రజల పక్షాన నిత్యం పోరాడే కమ్యూనిజం అజరామం అని ఆయన కొనియాడారు. అ ణచివేత, అవినీతి, పేదరికం, దోపిడి ఉన్నంతకాలం క మ్యూనిజం ఉంటుందని, కమ్యూని జానికి మరణం లేద ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ నెల 28న జరిగే పైలాన్ ఆవిష్కరణకు సిపిఐ పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాలు, రైతుకూలీ, సింగరేణి కార్మిక ట్రేడ్ యూనియన్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని పైలాన్ ఆవిష్కరణను విజయవంతం చేయాలని కోరిమిరాజ్ కుమా ర్ పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహా య కార్యదర్శి సుధాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్, ఏఐటీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, సోతుకు ప్రవీణ్ కుమార్, కే.సతీష్, జోసెఫ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి: ఎమ్మెల్యే మేడిపల్లి



**ప్రజాపక్షం/గంగాధర:** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలం ఆచంపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు ఆరె తేజశ్రీ రాజశేఖర్, చిన్నచంపల్లి సర్పంచ్ గుడి రజిని ప్రవీణ్ రెడ్డిలు ఎమ్మెల్యే సత్యం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సంధర్భంగా కరీంనగర్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని, ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఆరుగ్యారంటీలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆద్వర్యంలో గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

## మోదీ ఆగడాలను ఎండగట్టాలంటే ఢిల్లీ కోటపై ఎర్ర జెండా ఎగరాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలు చేయమంటే మోదీ ఆగడాలను ఎండ కట్టాలంటే ఢిల్లీ కోటపైన ఎర్ర జెండా ఎగరాలంటే వామపక్ష పార్టీలు ఏకమై మోదీని గద్దె దించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం సిపిఐ కార్యాలయ భవనంలో సిపిఐ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చాడ వెంకట్ రెడ్డి, కలవేణి శంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బద్దం ఎల్లారెడ్డి 46వ వర్ధంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడారు. బద్దం ఎల్లారెడ్డి ఎంపీ , ఎమ్మెల్యే, రాజ్యసభ సభ్యులుగా పేదల కోసం ఎనలేని పోరాటాలు చేశారని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంకు పిలుపునిచ్చి దానికి నాయకత్వం వహించారని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులపై దమనకాండ చేస్తున్నారని, అడవులను, సహజ సంపదని కార్పొరేట్ లకు అనుకూలంగా దేశ సంపదలు దోచిపెడుతున్నారని అన్నారు. జనవరి 18న ఖమ్మం పట్టణంలో జాతీయ స్థాయిలో ముగింపు సభ ఉంటుందని, 40 దేశాల ప్రతినిధులు, 5 లక్షల మందితో సభ, 15 వేల జనసేవాదళ్ కార్యకర్తలతో కవాతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సుదర్శన్, కార్యవర్గ సభ్యులు కడారి రాములు, గుంటి వేణు, కేవీ అనసూర్య, పంతం రవి,మీసం లక్ష్మన్, సోమ నాగరాజు,తీపిరెడ్డి తిరుపతి రెడ్డి, మంద అనిల్, పందుగ పోచమల్లు, గాజుల లింగం, వడ్డెపల్లి లక్ష్మన్, కొంక విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# హరీష్‌రావు పతనం ప్రారంభం

వచ్చే ఎన్నికల్లో సిద్దిపేటలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తాం
మంత్రి వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేటలో హరీష్‌రావు పతనం ప్రారంభమైందని... రాబోయే రోజుల్లో ఏ ఎన్నిక వచ్చిన సిద్దిపేటలో ఎగురవేసేది కాంగ్రెస్ జెండానే అని జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వెంకటస్వామి అన్నారు. శనివారం సిద్దిపేట అర్బన్ మండలం నాంచారిపల్లి, గ్రామ సర్పంచ్ పుర మాండ్ల నర్సింహారెడ్డి, రాఘవాపూర్‌పేట సర్పంచ్ చేర్యాల వాణికృష్ణలు సిద్దిపేట నియోజకవర్గం ఇంచార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు, మంత్రి వివేకవెంకటస్వామి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గంలో బెదరింపు రాజకీయాలకు ఎక్కువ అయ్యాయని ,దౌర్జాన్యంగా ,గెలిచిన సర్పంచ్ అభ్యర్థులకు హరీష్‌రావు తన పార్టీలోకి లాక్కోంటున్నారని, అయినప్పటికి పలువురు సర్పంచ్‌లు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో వచ్చే ఎంపిటిసి, జడ్పిటిసి మున్సిపల్ ఎన్నికల్లో సిద్దిపేట నియోజకవర్గంలో సత్తా చాటుతారన్నారు. పంచాయతీ ఎన్నికల నుండి హరీష్‌రావు పతనం ప్రారంభమైందన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ రోజురోజుకు బలోపేతం అవుతుందన్నారు. హరీష్‌రావు నియంతృత్వ,ఏకపక్ష విధానాలకు విసిగిపోయి పలువురు పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. రెండేళ్ల ప్రజాపాలన, సంక్షేమ పథకాలతో పాటు, కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను గ్రామ, గ్రామ తిరుగుతూ వివరిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో హరీష్‌రావును ఓడగొట్టడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. సిద్దిపేట నియోజక వర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయటమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి, కొత్త మహిపాల్‌రెడ్డి, ఎర్ర మహేందర్, అంబటి మహేశ్‌గౌడ్, బాలరాజు, కృష్ణమూర్తితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధి పథకం నిర్వీర్యంపై మంత్రి పొన్నం నిరసన



**ప్రజాపక్షం/హుస్నాబాద్:** గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదల కోసం వారి ఆర్థికంగా చేయుతనిచ్చేందుకు కేంద్రంలో కాంగ్రెస్ సోనియగాంధీ మన్మోహన్‌సింగ్ నాయకత్వంలో గ్రామీణ పేదల కొసం ఉపాధి పథకం తీసుకువచ్చి పేదలను అండగా ఉంటే నేడు బిజెపి ప్రభుత్వం కక్షతో గాంధీ పేరును తోలగిండం కక్షసాధింపు చర్యను తీవ్రంగా ఖడిస్తు శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని గాంధీ చౌరస్తాలో గాంధీకి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ఎజెండలో అర్బన్ ప్రాంతాల్లో ఉపాధి పథకం తెస్తానని చివరికి ఉపాధి పథకంలోని గాంధీ పేరు లేకుండ చేసి విబి రామ్ పేరును పెట్టారని అగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం ఇప్పటికే నెహ్రూ, మహాత్మాగాంధీ, ఇందిర గాంధీల పేరు లేకుండ చేయాలనే కుట్ర పన్నుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ వైకరికి నిరసనగా అదివారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాను చేపట్టనున్నట్లు అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, సహకార సంఘం చైర్మెన్ బి శివయ్య, నాయకులు చిత్తారి రవిందర్, వల్లపు రాజు , సరోజన, సదానందం, వీరన్న, రమణ, మాజీ కైన్సిలర్లు పాల్గోన్నారు.

## నేరాల నియంత్రణలో పురోగతి
## 16.84 శాతం తగ్గిన నేరాలు: సిపి

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2025 సంవత్సరానికి గాను నేరాల నియంత్రణలో అద్భుతమైన ఫలితాలు సాధించామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వార్షిక నివేదికను విడుదల చేశారు.గత ఏడాదితో (2024) పోలిస్తే ఈ ఏడాది మొత్తం నేరాల సంఖ్యలో 16.84 శాతం గణనీయమైన తగ్గుదల నమోదైందని సీపీ వెల్లడించారు. ఘోర నేరాలు 9.09 శాతం తగ్గాయని, మహిళలపై నేరాలు 5.18 శాతం తగ్గుముఖం పట్టాయన్నారు. ఆస్తి నేరాల రికవరీలో 24 శాతం వృద్ధి సాధించి, రూ.2.04 కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సైబర్ నేరాల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నామని సీపీ పేర్కొన్నారు. ఈ ఏడాది 2,437 ఫిర్యాదులు అందగా, అందులో 280 కేసులు నమోదు చేసి, బాధితులకు రూ.1.10 కోట్లను తిరిగి ఇప్పించినట్లు చెప్పారు. అలాగే, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న 500కు పైగా మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసి బాధితులకు అందజేశామని వివరించారు.మహిళలు, పిల్లల భద్రతే లక్ష్యంగా షీ టీమ్స్, భరోసా కేంద్రాలు చురుగ్గా పని చేశాయని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్, మాదవి, కిరణ్ కుమార్ లతో పాటు పలువురు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నట్టల నివారణతో మూగజీవాలకు ఆరోగ్య రక్షణ

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక రంగాభివృద్ధికి పెద్దపీట వేస్తూ రాష్ట్రంలోని రెండు కోట్లకుపైగా నున్న గొర్రెలు, మేకలు తదితర మూగజీవాల ఆరోగ్య రక్షణకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 22 నుండి 10 రోజుల పాటు చేపట్టిందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నక్కలపేట గ్రామంలో పశువైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన గొర్రెలు, మేకల ఉచిత నట్టల నివారణ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోనున్న 2కోట్ల 10లక్షలకు పైగా నున్న జీవాలకు ఉచిత నట్టల నివారణ మందులు వేయడాని ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమానికి రూ.4కోట్ల 43 లక్షల 70వేలు ఖర్చు చేయనుందని చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా నున్న 1లక్షా 80 వేల గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ లక్ష్యంగా ప్రభుత్వం రూ.3 లక్షల 798 వేలు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నట్టల నివారణ మందులు త్రాగించడం ద్వారా వాటి ఆరోగ్యం గణనీయంగా మెరుగై శరీర బరువు పెరిగి మంచి మాంసఉత్పత్తి లభిస్తుందని వివరించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పశుసంవర్ధక రంగం కీలకమని భవిష్యత్తులో పశుపోషకుల సంక్షేమం కోసం మరిన్ని పథకాలు అమలు చేయనున్నట్లు మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నల్ల మల్లవ్వ, వెంకటేష్, లావణ్య లక్ష్మణ్, నర్సింహులు, నాయకులు ఎస్.దినేష్, రాజేష్,లక్ష్మణ్, భీమయ్య, మొగిలి, బి.నరేష్, రైతులు, గొర్రెలు, మేకల పెంపకం దారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల నియంత్రణ, షెల్టర్ హోం నిర్మాణానికి చర్యలు: కలెక్టర్




**ప్రజాపక్షం/సిద్దిపేట:** వీధి కుక్కల నియంత్రణ, వాటి షెల్టర్ హోంల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులకు సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పోలీసు, గ్రామపంచాయతీ, మున్సిపల్, వైద్య, ఆరోగ్య విద్య,క్రీడలు యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో కుక్కల నియంత్రణపై జిల్లా స్థాయిలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కుక్కల నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తుగా మున్సిపల్ ప్రాంతాలు, గ్రామపంచాయతీ ప్రాంతాల్లో బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు. ప్రభుత్వ, ప్రైవేటు, విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు వ్యాపార సంస్థల ఆసుపత్రులు, ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు, జాతీయ రహదారి,ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ రహదారులు వెంట గల కుక్కల వివరాలను సేకరించాలన్నారు. అలాగే జిల్లాలోని మున్సిపాల్టీల్లో ప్రతి నియోజకవర్గానికి ఒక్కటి చొప్పున గ్రామీణ ప్రాంతాల్లో కుక్కల షెల్టర్ హోంను నిర్మించి ఆయా ప్రాంతాల్లో గల కుక్కలను షెల్టర్ హోమ్‌లోనే ఉంచాలన్నారు. తద్వార రహదారుల వెంబడి జరిగే ప్రమాదాలు, పట్టణ ప్రాంతాల్లో జరిగే కుక్కకాట్ల నుండి ప్రజలను రక్షించేందుకు వీలవుతుందన్నారు. వెంటనే కార్యచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో జిల్లా పశుసంవవర్ధక శాఖాధికారి కొండల్‌రెడ్డి, అడిషనల్ డిసిపి సుభాష్‌చంద్రబోస్, డిపిఓ రవీందర్. డిఎంహెచ్ఓ డాక్టర్ ధనరాజ్. జిల్లా రవాణాఅధికారి లక్ష్మణ్. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి వెంకటనర్సయ్య. మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టులే నిజమైన దేశభక్తులు: బోయిన అశోక్



**ప్రజాపక్షం/కరీంనగర్:** చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో సిపిఐ 100 సంవత్సరాల శత జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని అనభేరి ప్రభాకర్ రావు స్మారక భవనం ముందు గ్రామ కార్యదర్శి బోయిని వల్లభాయ్ పటేల్ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని సీనియర్ కామ్రేడ్స్‌ను ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిన అశోక్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్‌లో ఆవిర్భవించిందని, దేశ సంపూర్ణ స్వతంత్రం కోసం తీర్మానం చేసిన మొదటి రాజకీయ పార్టీగా చరిత్ర సృష్టించిందన్నారు. స్వాతంత్ర్య సాధనకై త్యాగాలతో కూడిన అనేక పోరాటాలు చేసింది. భారతదేశంలోని సంస్థానాలను దేశంలో విలీనం చేయాలని పోరాటాలు చేసిన ప్రధాన పాత్ర కమ్యూనిస్టు పార్టీదే. దేశంలో అతి పెద్దదైన నిజాం సంస్థానంలో ప్రజలను విముక్తి చేయడానికి కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన, మహత్తర వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం 4,500 మంది యువ కమ్యూనిస్టులు తమ ప్రాణాలను అర్పించి పది లక్షల ఎకరాల భూములను పేద ప్రజలకు పంచిన ఘనత సిపిఐ తెలంగాణను నిజాం పాల నుండి విముక్తి చేశారు. ఉద్యోగ భద్రత కోసం, సామాజిక భద్రత కోసం, కార్మిక చట్టాల సాధనకై సిపిఐ తన వంతు పాత్ర నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమంలోసిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి, మాజీ సింగల్ విండో డైరెక్టర్, వెంకన్న, ఐలయ్య, విలాసాగరం అంజయ్య, మొగిలి ఓదెలు, సంద వేణి కుమార్, రవి, రాపర్తి రాజు పిక్కల లింగయ్య, బరిగల విజయ్, మైలారపు భూమయ్య, బోయిని రాజు, పంకెర్ల కుమార్ స్వామి పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి: డిసిపి



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి అన్నారు. శనివారం రోజున పెద్దపల్లి పోలీస్ స్టేషన్ ను డిసిపి రామ్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డిసిపి రాంరెడ్డి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లోని పలు ఫైళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.పెద్దపల్లి జిల్లా ప్రజలు న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో ఇతరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంతత వాతావరణం లో జరుపుకోవాలని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, డీజే సౌండ్ పెట్టి ఇతరులను ఇబ్బందులు పెడితే ఉపేక్షించేది లేదని, రోడ్ల మీదకు వచ్చి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై లక్ష్మణరావు, రూరల్ ఎస్సై మల్లేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



**ప్రజాపక్షం/శంకరపట్నం:** శంకరపట్నం మండలం కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా అదనపు వైద్యాధికారిని సుధా రాజేంద్ర ప్రాసాద్ తనిఖీ చేశారు.కేశవపట్నం గ్రామంలో ఈ నెల 18 నుండి చేపడుతున్నకుష్టు సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కుష్టు వ్యాది నివారణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.అదనపు జిల్లా వైద్యాధికారిని వెంట మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్,కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ శివయ్యభాస్కర్,సూపర్వైజర్ అనిల్,ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గోన్నారు.

## కొత్త గ్రామపంచాయతీలో ముగ్గురూ మహిళా సర్పంచులే



**ప్రజాపక్షం/శంకరపట్నం:** శంకరపట్నం మండలంలో కొత్తగా ఏర్పడిన మూడు గ్రామపంచాయతీలో మహిళలే సర్పంచులుగా ఎన్నికయ్యారు.రాజకీయంగా తమ భవితవ్యాన్ని పరీక్షించుకోనున్నారు.మండలంలో నూతనంగా ఏర్పడిన మూడు గ్రామపంచాయతీలకు జరిగిన ఎన్నికల్లో సర్పంచ్ ఉప సర్పంచ్ లతో పాటు వార్డు సభ్యులుగా ప్రజలు ఎన్నుకున్నారు.శంకరపట్నం మండలం గద్దపాక గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన ఎస్సీ కాలనీని అంబేద్కర్ నగర్ పేరిట గ్రామపంచాయతీగా ఏర్పాటు చేశారు.సర్పంచ్‌గా పులికోట ప్రేమలతరమేష్,ఉప సర్పంచ్‌గా శనిగరం అంజిలు ఎన్నికయ్యారు.మొలంగూర్ గ్రామపంచాయతీ నుండి రెండు గ్రామపంచాయతీలు నల్ల వెంకయ్యపల్లి,గూడటిపల్లెలు ఏర్పాటు చేశారు.ఈ ఎన్నికలో గూడటిపల్లి గ్రామ సర్పంచ్ గా పురమ అనుషబాస్కర్,ఉప సర్పంచ్ గా సింగిరెడ్డి సుభాష్ రెడ్డిలు ఎన్నిక అయ్యారు.నల్ల వెంకయ్యపల్లి సర్పంచ్ గా మేడుదుల నాగలక్ష్మి ఐలయ్యు,ఉప సర్పంచ్‌గా ప్రొద్దుటూరి కొండల్ రెడ్డి ఎన్నికయ్యారు.వీరితో పాటు వార్డు సభ్యులు ఎన్నిక కాగా నూతన గ్రామపంచాయతీలకు భవనాలు లేకపోవడంతో ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో,అద్దె భవనలలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు.అక్కడే గ్రామపంచాయతీ పాలకవర్గం విధులు నిర్వహిస్తున్నారు.నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పడ్డ ఈ మూడు గ్రామాల్లో అంత మహిళా సర్పంచులు ఎన్నిక కావడంతో కీలకంగా మారింది.

## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ లోని 45వ డివిజన్లో ఎండి అజీమ్ ఆధ్వర్యంలో ప్రముఖ హాస్పిటల్ సన్ రైజ్ హాస్పిటల్, శరత్ మ్యాక్స్ విజన్ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య, కంటి శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, విఎన్నార్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అల్ఫోర్స్ డా॥ వి.నరేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండడం ద్వారా రోజు వారి కార్యకలాపాలను చురుకుగా చేయగలుగుతామని,సమాజాభివృద్ధికి చేయూతనివ్వగలుగుతామని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని మరియు పౌష్టికరమైన ఆహారాన్ని తీసుకొని చక్కటి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి, విష్ణు గౌడ్, అరవింద్ తోర్తి, మానకొండూర్ మండల ఉపాధ్యక్షులు, వార్డు మెంబర్ ముక్కెర సతీష్, తుమ్మల రమేష్ రెడ్డి, మాజీ కార్పొరేటర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రజిత రెడ్డి, అడ్వకేట్ రజనీష్, సంగ్రామ్ సింగ్, సింగమ రాజు, పాల్గొన్నారు.

## విద్యార్థుల పక్షాన ఉద్యమిస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్

ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** దేశంలో స్వాతంత్రం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూఇయర్ కళాశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడవుతూ ప్రైవేట్ విద్యాసంస్థలు అక్షరాలతో విద్యా వ్యాపారం చేస్తున్నారని దుయ్యబట్టారు. విద్యా శాఖ అధికారులు ప్రైవేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతూ వారు చేసే దోపిడీకి సహకరిస్తున్నారని, వేలాది రూపాయలు వసూలు చేస్తూ కనీస మౌలిక వసతులు కల్పించడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలు మూడేళ్లుగా విడుదల చేయకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయంగా మారాయన్నారు. సంక్షేమ హాస్టళ్లలో చలితీవ్రత దృష్ట్యా దుప్పట్లు, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో భోజనం పెట్టాలని, పెం చిన ఆర్టీసీ బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యారంగ స మస్యలు పరిష్కరించకుండా విద్యార్థుల పట్ల కక్ష్యపూరితంగా వ్యవహరిస్తోందని, విద్యార్థులు ఉద్యమాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కా ర్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు ఎం డి అజీమ్, అవినాష్, నాయకులు జగదీష్, జీవన్, ఆనంద్ తదితరులున్నారు.

## రైతుల సమస్యలపై పసుపు బోర్డు చైర్మన్‌కు సర్పంచ్ వినతి

**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం:** జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డిని నిజామాబాద్ జిల్లా అంకాపూర్ గ్రామంలోని ఆయన నివాసంలో శనివారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బద్దం గోపి రైతు లతో కలిసి రైతు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోపి మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత పంట ప్రధానంగా పసుపు పంటను గ్రామంలో రైతులు సాగు చేస్తున్నారు. అందుకు సంబంధించిన పంటను యాంత్రీకరణ చేయడానికి పాలిష్ మిషన్లు, పసుపు ఉడకబెట్టి యంత్రాలు, టార్పాలిన్లు, సబ్సిడీపై అందించి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని పసుపు బోర్డు చైర్మన్ ను కోరినట్లు సర్పంచ్ తెలిపారు. పసుపు బోర్డు చైర్మన్ ను కలిసిన వారిలో రైతు నాయకులు తీగల శ్రీధర్ రెడ్డి, ఏలేటి చిన్నారెడ్డి, పీసు రాజేందర్, జేడి సుమన్ తదితరులున్నారు.

## రైతులకు ఆయిల్ పామ్ ద్వారా అధిక లాభాలు: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** రైతులకు ఆయిల్ ఫామ్ ద్వారా అధిక లాభాలు చేకూరుతాయని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు అన్నారు. శనివారం రోజున ఓదెల మండలం కొలనూరు గ్రామంలో సమ్మక్క సారలమ్మల గద్దెల వరకు రూ.95 లక్షల రూపాయలతో నూతన తారు రోడ్డు నిర్మాణం, కాల్వశ్రీరాంపూర్ మండలం పెద్దరాతుపల్లి మరియు మీర్జంపేట గ్రామాల్లో సమ్మక్క సారలమ్మల గద్దెల వరకు నూతన బిటి రోడ్డు నిర్మాణ కోసం 2 కోట్ల 55 లక్షల రూపాయలతో మరియు ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్ల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. రైతులు పంటల మార్పిడి పై శ్రద్ధచూపాలన్నారు. అలాగే రసాయనక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంపొందించుకోవాలని రైతులకు సూచించారు. దీనివల్ల పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. ఆయిల్ ఫామ్ పంటలను వేసేందుకు శ్రద్ధ చూపాలన్నారు. ఈ పంట వల్ల సుదీర్ఘకాలం లాభాలు వస్తాయన్నారు. వచ్చే జూన్ మాసంలో రైతులకు పంటలపై సూచనలు సలహాలు ఇచ్చేందుకు పెద్దపల్లి నియోజకవర్గ కేంద్రంలో వ్యవసాయ శాస్త్రజ్ఞులతో సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రజా పాలనలో అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారని నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణానికి ఇరు ప్రక్కల ఉన్న రైతులు 33 ఫీట్ల రోడ్డు నిర్మాణానికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు ఎంపీపీలు మార్కెట్ చెర్మన్, సింగల్ విండో చెర్మన్‌లు కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచ్లు, వార్డు సభ్యులు మరియు కార్యకర్తలు మరియు పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్ అనంతరెడ్డి

**ప్రజాపక్షం/ కొండాపూర్:** కొండాపూర్ మండల పరిధిలోని గుంతపల్లి లో గల అంగన్వాడీ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ పదమటి అనంతరెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారుల పౌష్టికాహారం, విద్యా మౌలిక సదుపాయాలను గురించి వివరాలను అంగన్వాడీ టీచర్లను అడిగి తెలుసుకున్నారు.



## నిషేధిత చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు :ఏసిపి నర్సింలు



**ప్రజాపక్షం/గజ్వేల్:**నిషేధిత చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని గజ్వేల్ ఏసిపి నర్సింలు హెచ్చరించారు. శనివారం గజ్వేల్ లోని గాలిపటాల దుకాణాలను సిఐ ముత్యం రాజు, ఎస్ఐలు ప్రేందీప్, మల్లారెడ్డితో కలిసి ఆయన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గాలి పటాల దుకాణదారులు, నిషేధిత చైనా మాంజా విక్రయించొద్దని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి విక్రయాలు జరిపితే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, షాపుల లైసెన్సులను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. గాజు పొడి పూత ఉన్న చైనా మాంజాతో బైక్ రైడర్లు, పాదచారుల శరీర భాగాలు కోసుకుపోయి ప్రాణాపాయం సంభవిస్తుందని అన్నారు. అలాగే ఆకాశంలో ఎగిరే పక్షులు ఈ దారంలో చిక్కుకుని గాయపడటం, లేదా మరణించడం జరుగుతోందని తెలిపారు. అలాగే విద్యుత్ తీగలకు తగిలితే షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్నిప్రమాదాలు జరుగుతాయని, నైలాన్ మరియు సింథటిక్ తో తయారయ్యే ఈ మాంజా భూమిలో కరిగిపోదని, పర్యావరణానికి నష్టం చేస్తుందని చెప్పారు. చైనా మాంజా వాడకం, విక్రయం చట్టరీత్యా నేరం కాగా, దీనివల్ల జరిమానాతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉందని, తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రమాదకరమైన చైనా మాంజాను కొనివ్వవద్దని, పర్యావరణానికి, ప్రజల భద్రతకు అనుకూలమైన సాధారణ పత్తి దారం మాత్రమే వాడాలని కోరారు. ప్రజలు తమకు సహకరించి సురక్షితంగా పండుగ జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

**ప్రజాపక్షం/పాపన్నపేట:**పాపన్నపేట మండలంలోని ఎన్కేపల్లి గ్రామ శివారులో మంజీరా నది నుంచి శుక్రవారం రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి వెళ్లి రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని ఠాణాకు తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ట్రాక్టర్ లను సీజ్ చేసి ట్రాక్టర్ల ఓనర్లు బద్రి అంజయ్య, సలీం పాషాలపై, ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మండలంలో మంజీరా నది, చెరువుల నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా అక్రమంగా ఇసుక రవాణాచేస్తేప్రజలుపోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## నీటి శుద్ధి ప్లాంట్ పరిశీలన



**ప్రజాపక్షం/నేరడిగొండ :**నేరడిగొండ మండలంలోని చించోలి గ్రామం లో గత కొంతకాలంగా నీటి శుద్ధి యంత్రాలు పనిచేయక గ్రామస్తులకు నీటితో ఇబ్బందులను ఎదుర్కొవడానికి చూసి సర్పంచ్ సెడ్మకి సూజాత గంగాధర్,ఎంపిడిఒ శేఖర్,ఆధ్వర్యంలో నీటి శుద్ధి ప్లాంట్ రిపేరు చేసి గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ సునీల్ కుమార్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చిరుత దాడిలో లేగదూడ మృతి

**ప్రజాపక్షం/నిజాంసాగర్:**చిరుతపులి దాడిలో లేగ దూడ మృతిచెందిన ఘటన నిజాంసాగర్ మండలంలోని వడ్డేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల చెరువుముందరి తాండాలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లాలొసింగ్ అనే వ్యవసాయ రైతుకు చెందిన ఆవుల గుంపుపై దాడి చేసిన చిరుత ఓ లేగదూడను చంపేసింది. తాండాలో రాత్రి సమయంలో చిరుత ప్రవేశించడంతో ఆ విషయాన్ని పసిగట్టిన ఊర కుక్కలు ఒక్కసారిగా అరవడంతో తాండావాసులు మెళకువ వచ్చి చూసే సరికి చిరుత లేగదూడపై దాడిచేసి హతమార్చింది. గత కొన్ని వారాల క్రితమే కంకర మిషన్ ప్రాంతంలో చిరుత సంచరించినట్లు గుర్తించిన గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు తగు చర్యలు చేపట్టి చిరుత దాడి నుండి ప్రజలను, పశుసంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## బస్సు ,టిప్పర్ ఢీ : 16 మందికి గాయాలు

**ప్రజాపక్షం/ కంది:**సంగారెడ్డి జిల్లా కంది మండలం కంది ఎక్స్‌రోడ్ సమీపంలో ప్రభుత్వ పాఠశాల వద్ద మేయిన్ రోడ్ హైవే ఐదు గంటల 21 నిమిషములకు బస్సు ,టీప్పర్ ఆక్సిడెంట్ చోటు చేసుకుంది. ఈ సంఘటనలో భాగంగా మన అంబులెన్స్ 108 అంబులెన్స్ కంది అంబులెన్స్ లో బోటల్లా 16 మంది వ్యక్తులను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిక తరలించారు. ఈ 16 మంది క్షతగాత్రులలో చాలా మందకి గాయాలు తలకు, గాయము ,ముఖమునకు, గాయాలయ్యాయి శరీర బాగాలకు గాయాలు కావడం జరిగింది. ఈ సంఘటనలో కంది అంబులెన్స్ సిఎంటీ ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్, చీరంజీవి పైలట్ ఉదయ్ కుమార్ ఈ 16 మందికి క్షతగాత్రులను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందులో భాగంగా సంగారెడ్డి అంబులెన్స్ 102 చోటకు అంబులెన్స్ ఈ సంఘటనలో ఐదు మంది అంబులెన్స్‌లో పాల్గొన్నారు.

## పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రివివేక్‌ను కలిసిన సర్పంచ్ శ్రీహరి

**ప్రజాపక్షం/ హత్నూర :**పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగ యువతకు అధిక ప్రాదాన్యత కల్పించాలని కోరుతూ గుండ్ల మాచునూర్ సర్పంచ్ బేగరి శ్రీహరి శనివారం నాడు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి వివేక్ వెంకటస్వామిని కలసి వినతిపత్రం అందజేశారు. ఆ గ్రామ పంచాయతీ పరిధిలోని హోసర్ ల్యాబ్ ఏపిటోరియా యూనిట్ 1 కోవాలేంట్ లేబబేటరీస్, పరిశ్రమలు ఉండగా స్థానిక నిరుద్యోగులకు ఉపాది కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మంత్రి దృష్టికి తీసుకుపోయారు. వర్షములు ఏర్పాటు చేసిన సమయంలో స్థానికులకు ఉపాది వ్యాపార, అవకాశాలు, కల్పిస్తామని చెప్పిన పరిశ్రమ యాజమాన్యాలు నేడు ఆ నిబందనలను తుంగలో తొక్కుతున్నారని. ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఉన్నత చదువులు చదివి నప్పటికి స్థానిక పరిశ్రమల్లో ఉపాది దొరకక యువకులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వినతి పత్రంలో పేర్కొన్నారు. తమ గ్రామ పంచాయతీ

## నూతన సర్పంచ్‌లు
# అభివృద్ధిలో భాగస్వాములు

నూతన సర్పంచుల సన్మానంలో మంత్రి జూపల్లి



**ప్రజాపక్షం/నిర్మల్:**నూతన సర్పంచులు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని,సర్పంచులు అంకితభావంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.నిర్మల్ జిల్లా కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ లో నిర్మల్ నియోజక వర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరి రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ మద్దతుతో నూతనంగా ఎన్నికైనా సర్పంచులు,ఉపసర్పంచులు,వార్డు సభ్యులకు ఆత్మీయ సమ్మేళనం సన్మాన సభ కార్యక్రమం శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఘనంగా సత్కరించి,శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ..ప్రజలు నమ్మకంతో గెలిపించిన సర్పంచులు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలని సూచించారు.గ్రామ సభలను క్రమం తప్పకుండా నిర్వహించి,ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు.గ్రామ పంచాయతీలకు నిధుల కొరత లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందనిభరోసా ఇచ్చారు.పారదర్శకమైన పాలన ద్వారా పల్లెలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు.కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్,కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి,రాష్ట్ర మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి,పిసిసి ప్రధాన కర్యాదర్శి ఎంబడి రాజేశ్వర్,జిల్లా గ్రంథాలయ సంస్థచైర్మన్ అర్జుమన్ అలీ,జిల్లా ఇన్‌చార్జులు ,మాజీ జెడ్పిటిసిల ఫోరం అధ్యక్షుడు, అవేజ్,మార్కెట్ కమిటీ చైర్మన్‌లు సోమా భీమ్‌రెడ్డి,అబ్దుల్ ఆది,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పులి కదలికలపై సింగరేణి అప్రమత్తం

సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:**శ్రీరాంపూర్ ఏరియాలో పులి సంచారంతో ప్రజలు, కార్మికులు భయభ్రాంతులకు గురికాకుండా పులి కదలికలపై విస్తృత సమాచారం అందిస్తూ అందరిని అప్రమత్తం చేస్తున్నామని సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్ ఏ పరితల గని ఓబీ డంప్ యార్డ్ ప్రాంతాలను శనివారం ఆయన సింగరేణి ఫారెస్ట్ అడ్వైజర్, డివిజన్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పులి కదలికలపై సింగరేణి యాజమాన్యం తీసుకుంటున్న జాగ్రత్త చర్యలను అటవీ అధికారులకు వివరించారు. హైవే వద్ద ట్రాఫిక్ నియంత్రణకు బారికేడ్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఉపరితల గని పరిసర ప్రాంతాలలో పిచ్చి మొక్కలను, ఇతర వ్యర్థాలను బ్లేడ్ ట్రాక్టర్ ద్వారా తొలగించామని తెలిపారు. సింగరేణి సెక్యూరిటీ, అటవీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పులి కదలికలపై ఎప్పటికప్పుడు ప్రజలకు, ఉద్యోగులకు సమాచారం ఇస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. అటవీ సిబ్బంది పెట్రోలింగ్ కోసం 24 గంటలు అందుబాటులో ఉ ండే లా ఒక బొలెరో వాహనాన్ని సమకూర్చామని, ఈ ప్రక్రియ కొన సాగు తుందని వివరించారు. ఏరియా ఉపరితల గని ఓబీ డంప్ యార్డ్ లో పులి సంచరించిన ప్రదేశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్య క్రమంలో సింగరేణి ఫారెస్ట్ అడ్వైజర్, డివిజన్ అధికారులు పరిగెన్, సర్వే శ్వర్, ఉప రితల గని ప్రాజెక్ట్ అధికారి చిప్ప వెంకటేశ్వర్లు, డీజీఎం ఫారెస్ట్ ఏబీ హరి నారాయణ,సర్వేఅధికారి సంపత్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్ పాల్గొన్నారు.

## ప్రమాద బీమాతో బాధితులకు అండగా గాయత్రి బ్యాంక్

రూ.లక్ష చెక్కు అందజేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:**నిర్మల్ పట్టణంలోని గ్రాయత్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రాధాన కార్యాలయంలో శనివారం ఒక ముఖ్యమైన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ప్రమాదవశాత్తు మరణించిన బ్యాంక్ ఖాతాదారుడు సంగనగరి కిరణ్ కుటుంబానికి లక్ష రూపాయల ప్రమాద బీమా చెక్కును అందజేశారు.కిరణ్ గాయత్రి బ్యాంక్ నిర్భయ సేవింగ్ ఖాతా కలిగి ఉండటం వల్ల,ఆ పథకం కింద వర్తించే బీమా మొత్తాన్ని ఆయన భార్య సంగనగరి జ్యోతికి బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ వి.మనోహర్ రెడ్డి చేతుల మీదుగా అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎండిమనోహర్ రెడ్డి మాట్లాడుతూ,సామాన్య,మధ్యతరగతి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా గ్రాయత్రి బ్యాంక్ పని చేస్తోందని తెలిపారు.ఖాతాదారులకు ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పించేందుకే ఇటువంటి బీమా పథకాలను అమలు చేస్తున్నామని,ఇది బాధిత కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని ఆయన పేర్కొన్నారు.కేవలం బీమా మాత్రమే కాకుండా,వినియోగదారుల కోసం 24 గంటల ఏటీఎం సేవలు,నగదు లభ్యతను నిరంతరం అందుబాటులో ఉంచుతున్నామని వివరించారు.అనంతరం బ్రాంచ్ మేనేజర్ పి.మోహన్ రవికుమార్,మాట్లాడుతూ బ్యాంకులో అందుబాటులో ఉన్న ఇతర ఆర్థిక సేవల గురించి వివరించారు.ముఖ్యంగా వినియోగదారులకు ఇంటి వద్దే నగదు సేవలు అందించే మైక్రో ఎటిఎం,ఎఇపిఎస్ సదుపాయాలు ఉన్నాయని తెలిపారు.తక్కువ వడ్డీతో అంటే నెలకు కేవలం 0.83 పైసల(10 శాతం పిఎ)వడ్డీ రేటుకే విద్యా,వ్యాపార ,కిసాన్ క్రెడిట్ కార్డు రుణాలు అందజేస్తున్నామని చెప్పారు.అలాగే ఈకేవైసీ ద్వారా సులభంగా ఖాతాలు తెరవచ్చని,బంగారు రుణాలపై గ్రాముకు రూ.5,600 వరకు ఇస్తున్నామని పేర్కొంటూ ఖాతాదారులందరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలి

మాజీ మంత్రి అల్లోల




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ముందు నిర్మల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఐదవ రోజుకు చేరుకున్నాయి.ఈ దీక్షా శిబిరానికి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి హాజరై పాత్రికేయుల పోరాటానికి తన పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ హితం కోసం పనిచేసే పాత్రికేయులకు ప్రభుత్వం కేవలం ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా,వారికి ఇందిరమ్మ ఇండ్లను కూడా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ భూమిని గుర్తించాలని,అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వెంట మాజీ డిసిఎంఎస్ వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి,మాజీ ఎంపీపీ మైపాల్ రెడ్డి,మాజీ ఎఫ్ఎస్సిఎస్ చైర్మన్ ధర్మాజీ గారి రాజేందర్,ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ముడుసు సత్యనారాయణ,మాజీ పిఎసిఎస్ చైర్మన్ పివి రమణరెడ్డి,మాజీ కౌన్సిలర్ లక్కాకుల నరహరి పాల్గొన్నారు.వీరితో పాటు నాయకులు పాకాల రామచందర్,సర్పంచ్ అర్జున్ రెడ్డి,మాజీ సర్పంచ్ ప్రకాష్ రెడ్డి,మాజీ వైస్ చైర్మన్లు శ్రీకాంత్ యాదవ్,పతని భూమేష్,గజానంద్ తదితరులు పాల్గొని పాత్రికేయుల డిమాండ్ల కు మద్దతు తెలిపారు.

## లింగ నిర్ధారణ చేస్తే చట్టపరమైన చర్యలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ అనిత



**ప్రజాపక్షం / నస్పూర్:**లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే పిసిపిఎన్‌డిటి చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ అనిత హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పిసిపిఎన్‌డిటి చట్టం అమలుపై జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పిసిపిఎన్‌డిటిచట్టం ప్రకారం 53 స్కానింగ్ కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఇందులో నాలుగు ప్రభుత్వ స్కానింగ్ కేంద్రాలు కాగా 49 ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. వీటిని స్త్రీ వైద్య నిపుణులు, రేడియాలజిస్టులు, సూపర్ స్పెషలిస్టులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి స్కానింగ్ కేంద్రంలో స్కానింగ్ పరికరము, వైద్యుడి వివరాలు తప్పనిసరిగా నమోదై ఉండాలని, లింగ నిర్ధారణ చేయబడదు, చెప్పబడదు అని తెలిపే బోర్డులు, పోస్టర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్కానింగ్ కేంద్రాల్లో గర్భవతులకు కూర్చునే సౌకర్యం, తాగునీరు అందుబాటులో ఉంచాలని, వైద్యుడి వివరాలు, ఫీజు వివరాలను గోడపై అతికించాలని, గర్భవతుల స్కానింగ్ వివరాలను ఫామ్ ఎఫ్ లో నమోదు చేసి గర్భవతి సంతకం తీసుకోవాలని, ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు గర్భవతులకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. గర్భవతులకు చేసే స్కానింగ్ కాకుండా సూపర్ స్పెషాలిటీ వైద్యులు చేస్తున్న స్కానింగ్ వివరాలను కూడా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి తెలియజేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణశ్రీ, డిపిఆర్ఓ కృష్ణమూర్తి, హీల్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఎన్‌జిఒ డాక్టర్ చుంచు రాజ్ కిరణ్, గైనకాలజిస్ట్ డాక్టర్ నలుమాసు శ్రీదేవి, ఎన్‌జిఒలు, ఆసుపత్రి గైనకాలజిస్టు, పెడియాట్రిషన్లు, ఫిజీషియన్లు, డిపిఒ, సిహెచ్ఒ, దిశా కోఆర్డినేటర్ ,సీనియర్ అసిస్టెంట్ హారిక, డిపిహెచ్‌ఎన్ పద్మ,మాస్ మీడియా అధికారి బుక్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

## అందుబాటులో యూరియా నిల్వలు



**ప్రజాపక్షం/నిజామాబాద్:**జిల్లాలోని అన్ని సహకార సంఘాల గోడౌన్లలో యూరియా నిల్వలను అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. యాసంగి సీజన్ పంటల సాగుకవసరమైన మేరకు పూర్తిస్థాయిలో ఎరువుల నిల్వలు జిల్లాకు కేటాయించబడ్డాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి సొసైటీకి ఎరువుల ను చేరవేస్తూ రైతులకు పంపిణీ జరిగేలా కృషి చే యాలన్నారు. ఖానాపూర్‌లోని ఎరువుల గిడ్డంగిని కలెక్టర్ శనివారం తనిఖీ చేసి గోడౌన్‌లోని యూ రియా, ఎరువులను పరిశీలించి స్టాక్ వివరాల రిజిస్టర్‌లో పొందుపర్చిన వాటికనుగుణంగా ఉ న్నా యా లేదా అని తనిఖీ చేశారు. ఇప్పటివరకు జి ల్లాకు ఈ సీజన్‌లో వచ్చిన ఎరువుల నిల్వలు ఎన్ని ఇంకనూ ఎంత పరిమాణంలో నిల్వలు రావల్సి ఉంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నందున ఎక్కడ కూడా ఎరువుల కొరత ఏర్పడకుండా రైతుల అవసరాలకనుగుణంగా అన్ని ప్రాంతాలకు చేరవేయాలని అధికారులకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని హితవు పలికారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతమాత్రం ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. యూరియా ఎరువుల విషయమై రైతులు కూడా ఎలాంటి ఆందోళనకు గురి కావల్సిన అవసరం లేదని జిల్లాలో ఇప్పటికే సరిపడా స్టాక్ ఉందని, ఇంకనూ యూరియా నిల్వలు ముందస్తుగానే తెప్పిస్తున్నామని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయాధికారి వీరస్వామి, రాజేశ్వర్ ఉన్నారు.

## నాసిరకంగా జాతీయ రహదారి పనులు

ప్రజల ప్రాణాలతో ఆటలు ఆడుతున్న కాంట్రాక్టర్‌పై వృథ్వీరాజ్ ఆగ్రహం

**ప్రజాపక్షం/ సదాశివపేట:**సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిదిలో మియాపూర్ సంగారెడ్డి జాతీయ రహదారి మూడు లైన్ల విస్తరణ పనుల్లో తీవ్రమైన నాసిరకం పనుల్లో తీవ్రమైన నాసిరకం పనులు జరుగుతున్నాయని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఎండీఆర్ పౌండేషన్ కో పౌండర్ మాద్రి వృథ్వీ రాజ్ తీవ్రంగా మండిపడ్డారు. ఈ పనులను నిర్వహిస్తున్న ఆర్కోసి ఇన్ ఫ్రా బిల్డ్ ప్రైవేట లిమిటెడ్ కంపెనీ కాంట్రాక్టర్ గతంతో ఎంపి రఘునందన్ రావు ,ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిల సూచనలు హెచ్చరికలు పక్కన పెట్టి మళ్లీ ఆలపత్వాన్ని ప్రదర్శిస్తున్నాడని ఆయన ఆరోపించారు. శ్రీరామ్ నగర్‌కాలనీ సమీపంలో వర్షపు నీటి పారుదల కోసం వేసిన కాలువ ప్లాటు కేవలం 4 అంగుళాల మందం ఉండగా ఒక చిన్న వాహనం వెళ్లగానే కూలిపోవడం కాంట్రాక్టర్ నిర్లక్ష్యనికి ప్రత్యేక్ష నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఇది నిర్మాణ లోపమే కాకుండా ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే పరిస్థితి అని వృథ్వి రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. బారత జాతీయ రహదారి (ఎన్.హెచ్.ఏ.ఐ ) నిబంధనల ప్రకారం డ్రైనేజ్ స్లాబులు నిర్దిష్ట లోడ్ కెపాసిటితో సరైన మందం ,నాణ్యత ప్రమాణాలతో నిర్మించాల్సి ఉండగా ఆ నిబందనలను పూర్తిగా ఉల్లంఘిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై బిఆర్ఎస్ పార్టీ నాయకులు సంఘటన స్థలాన్ని పరిశీలించి సైట్ ఇన్‌చార్జీ ఆమోల్ ని ప్రశ్నించారు. ఈ నాసిరకం పనులు కొనసాగితే ప్రజల ప్రాణాలు పోవడం ఖాయమని హెచ్చరిస్తూ లోపాలను వెంటనే సరదిద్దకపోతే పనులను నిలిపివేసి ధర్నా చేపడతామని స్పష్టం చేశారు.. ..జాతీయ రహదారుల వంటి కీలక మౌళిక వసతుల నిర్మాణంలో ఆలసత్వం అంగీకారదాయకం కాదని, నాణ్యత ప్రమాణాలు పాటించే వరకు ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తామని మాద్రి వృథ్వీరాజ్ హెచ్చరించారు.


## బకాయిలు చెల్లించిన తర్వాతే లెప్రసీ సర్వే



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :**ఆశా వర్కర్లకు గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న లెప్రసీ సర్వే పారితోషికాన్ని వెంటనే విడుదల చేయాలని,ఆ బకాయిలు చె ల్లించిన తర్వాతే క్రొత్త సర్వే నిర్వహిస్తామని సిఐటీయు జి ల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ స్పష్టం చేశా రు.శనివారం నిర్మల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించి,అనంతరం ఏవోకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాలకు కనీస వేతనం చెల్లించకుండా పని భారం పెంచుతున్నాయని మండిపడ్డారు.పెరిగిన ధరలకు అనుగుణంగా ఆశాలకు నెలకు 18,000 రూపాయల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని,పిఎఫ్,ఈఎస్ఐ సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.గతంలో స్థానిక సంస్థల ఎన్నికల డ్యూటీలు చేసిన వారికి,పల్స్ పోలియో లో పాల్గొన్న వారికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు.ముఖ్యంగా 50 లక్షల రూపాయల ఇన్సూరెన్స్,5 లక్షల రూపాయల రిటైర్మెంట్ బెనిఫిట్స్,మట్టి ఖర్చుల కింద 50 వేల రూపాయలు మంజూరు చేస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.అలాగే ఏఎన్ఎం,జిఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన ఆశాలకు ప్రమోషన్లు కల్పించాలని,ప్రతి ఆదివారం పండుగలకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఆసుపత్రుల్లో ఆశాలకు ప్రత్యేక విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని,పని ప్రదేశాల్లో రక్షణ కల్పించాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.సుజాత,కార్యదర్శి పి.గంగామణి,ఉపాధ్యక్షులు విజయా,చంద్రకళ,ఇంద్రమాల, సరిత,సుగుణ,నంద,రామలక్ష్మి ,కోశాధికారి లక్ష్మి ,నాయకులు అనసూర్య,మౌనిక పాల్గొన్నారు.

## గుర్రపు డెక్క నుంచి బ్రహ్మణపల్లి చెరువుకు విముక్తి

రూ. 20లక్షలతో తొలగింపు పనులు షురూ
* రూ. 10లక్షలు మంజూరు చేయించిన ఎమ్మెల్యే
* మరో రూ. 10లక్షలు చందాలుగా పోగు చేసుకున్న మత్స్యకారులు



**ప్రజాపక్షం/ఎడపల్లి:**నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామ మత్స్యకారుల చిరకాల వాంఛ నెరవేరబోతుంది. గత కొంతకాలంగా చెరువును పట్టి పీడిస్తున్న గుర్రపు డెక్క తొలగింపు పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచి హన్మంతుతో కలిసి మత్స్య పారిశ్రామిక సంఘం గ్రామ అధ్యక్షుడు మంగళపాటి లింగం ఈ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళపాటి లింగం మాట్లాడుతూ.. గ్రామ చెరువు మొత్తం 340ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, అందులో సుమారు 300ఎకరాల మేర గుర్రకు డెక్క పరుచుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల చేపల వేట సాగించడం ప్రాణ సంకటంగా మారిందని, గుర్రపు డెక్క కారణంగా ఆక్సిజన్ అందక చేపలు పెరగడం లేదని తెలిపారు. ఫలితంగా మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. తమ సమస్యను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి ఇరిగేషన్ శాఖ ద్వారా రూ. పది లక్షలు మంజూరు చేయించారని లింగం తెలిపారు. మిగిలిన పనుల కోసం మత్స్యకారులందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, మరో రూ. పది లక్షలు చందాలుగా వేసుకున్నారని చెప్పారు. మొత్తంగా రూ. 20లక్షల వ్యయంతో యంత్రాల ద్వారా గుర్రపు డెక్కను తొలగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మత్స్యకారుల జీవనోపాధిని కాపాడేందుకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ఈ సందర్భంగా సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గుర్రపు డెక్క తొలగింపు పనులను ఇరిగేషన్ ఎఇఇకుషాల్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రీల్



## ఇది ఎప్పటికీ స్పెషల్ ఫిలిం

-సక్సెస్ మీట్‌లో రోషన్

శ్రీకాంత్ కొడుకు రోషన్ హీరోగా ఇటీవల విడుదలైన సినిమా ఛాంపియన్. స్వప్న సినిమాస్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ హీరోయిన్. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో రోషన్ మాట్లాడుతూ .. ఛాంపియన్ సినిమా నాకు చాలా స్పెషల్. ఈ ప్రాజెక్టుకి నేను ఎమోషనల్ అటాచ్ అయ్యాను. తనకి సినిమా అంటే చాలా పాషన్ సినిమా కోసం ఏమైనా చేస్తుంది. సినిమాని ఇండస్ట్రీలో చాలా మంది సపోర్ట్ చేశారు. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఛాంపియన్ ఎప్పటికీ నాకు స్పెషల్ ఫిలిం. నాకు ఈ స్క్రిప్ట్ ఇచ్చిన ప్రదీప్‌కి థాంక్యూ. ఈ సినిమాకి పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సినిమా మా అందరికీ స్పెషల్. అందరూ కూడా ఫ్యామిలీతో కలిసి వెళ్లి చూడాలని కోరుకుంటు న్నాను. హీరోయిన్ అనస్వర రాజన్ మాట్లాడుతూ ఛాంపియన్ నా మొదటి తెలుగు సినిమా. థియేటర్స్‌లో కూర్చుని ఆడియన్స్ రియాక్షన్ చూస్తున్నప్పుడు చాలా ఆనందంగా అనిపించింది. గిర గిరా నా ఫేవరెట్ సాంగ్. మిక్కీ అద్భుతమైన ఆల్బమ్ క్రియేట్ చేశారు. చంద్రకళ పాత్ర ఇచ్చిన ప్రదీప్ కి థాంక్యూ అన్నారు. ఈ సక్సెస్ మీట్‌లో డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం, ప్రొడ్యూసర్ స్వప్న దత్, సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ గెలుపు నాది కాదు

- సంజనా గల్రానీ



'ఓ ఐదేళ్ళ క్రితం నా ప్రమేయం లేకుండా జరిగిన ఓ సంఘటన నా జీవితాన్ని, కెరీర్‌ని ఒక కుదుపు కుదిపేసింది. అయితే స్వతహా నేను ఫైటర్‌ని. అందుకే ప్రతికూల పరిస్థితులతో నేను పెద్ద పోరాటమే చేశాను. దీనికి విజేతగా నిలిచాను' అంటూ భావోద్వేగానికి లోనయ్యారు బిగ్‌బాస్ సీజన్9లో టాప్ 5 ఫైనలిస్ట్‌గా నిలిచిన ప్రముఖ హీరోయిన్ సంజనా గల్రానీ. ఒడిదుడుకుల్లో తన వెన్నంటి నిలిచిన తన కుటుంబానికి, శ్రేయోభిలాషులకు, అభిమానులకు ఆమె ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. బిగ్‌బాస్ సీజన్ 9లో టాప్ 5 ఫైనలిస్ట్‌గా నిలిచిన సంజన మీడియాతో ప్రత్యేకంగా సమావేశమై, బిగ్‌బాస్ అనుభవాలను పంచుకున్నారు. బిగ్‌బాస్ నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని, ఈ అనుభవంతో తన కెరీర్‌లో ఫ్రెష్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేయనున్నానని ఆమె తెలిపారు. ఇకపై తెలుగు సినిమాలపై మరింత దృష్టి సారిస్తానని తెలిపారు.

## 30న 'మెగా విక్టరీ' మాస్ సాంగ్



మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేశ్ కలిసి నటిస్తున్న క్రేజీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న అప్డేట్ ఇప్పుడు వచ్చేసింది. ఈ చిత్రంలోని థర్డ్ సింగిల్ 'మెగా విక్టరీ మాస్ సాంగ్'ను 30న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన ప్రోమోను రిలీజ్ చేశారు. చిరంజీవి, వెంకటేష్ కలసి స్క్రీన్ షేర్ చేసుకోవడం ఇదే తొలిసారి. ఇద్దరి అభిమానులను దృష్టిలో పెట్టుకుని అనిల్ రావిపూడి మాస్ పాటను చిత్రీకరించారు. ఇందులో చిరంజీవి సరసన నాయన తార హీరోయిన్‌గా నటిస్తోంది. వెంకటేష్ చాలా కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. షైన్ స్క్రీన్స్, గోల్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గరపాటి, సుష్మిత కొణిదెల ఈ చిత్రాన్ని భారీగా నిర్మిస్తున్నారు. అన్ని పనులు పూర్తి చేసి 'మన శంకర వర ప్రసాద్ గారు' చిత్రాన్ని జనవరి 12న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## జనవరి 1న హిందీలో 'శంబాల'



ఆది సాయి కుమార్ నటించిన 'శంబాల' ప్రస్తుతం బ్లాక్ బస్టర్ టాక్‌తో దూసుకుపోతోంది. విడుదలైన అన్ని చోట్లా పాజిటివ్ రెస్పాన్స్‌తో, హౌస్ ఫుల్ కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఈ మిస్టికల్ థ్రిల్లర్ ప్రస్తుతం థియేటర్లో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. డిసెంబర్ 25న విడుదలై ఈ చిత్రానికి ప్రస్తుతం అన్ని చోట్ల నుంచి డిమాండ్ ఏర్పడింది. ఈ క్రమంలో జనవరి 1న హిందీలో ఈ సినిమాని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హిందీ వెర్షన్ ప్రస్తుతం సెన్సార్ సర్టిఫికేషన్ కోసం వేచి ఉందని నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభిమోజు తెలిపారు. ఓవర్సీస్లోనూన 'శంబాల' దూసుకుపోతోంది. ఇక అంతే కాకుండా 'శంబాల'కి ప్రీమియర్లు, డే వన్, రెండో రోజు ఇలా అన్నీ కలిపి చూస్తే మొత్తంగా 5.4 కోట్ల గ్రాస్ వచ్చాయి.



భారతీయ అనిమేషన్ చిత్రాలు కూడా ఇప్పుడు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో తెరకెక్కిన ఇండియన్ అనిమేషన్ సినిమా 'కికి అండ్ కొకొ'. పిల్లలకు పిల్లల మనసున్న పెద్దలకు నచ్చేలా రూపొందుతున్న యానిమేషన్ మూవీ 'కికి అండ్ కొకొ'. ఈ చిత్రాన్ని ఇనికా స్టూడియోస్ మన ముందుకు తీసుకొస్తోంది. ఈ యానిమేషన్ చిత్రానికి ధరణి నిర్మాత కాగా పి.నారాయణన్ దర్శకత్వం వహిస్తున్నారు. బాలనటి శ్రీనిక కొకొ పాత్రలో నటిస్తోంది. మీనా చాబ్రియా సీయీవోగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణలో ఉన్న యానిమేషన్ మూవీ 'కికి అండ్ కొకొ' త్వరలో థియేటర్స్‌తో పాటు 9 భాషల్లో ఓటీటీలోకి రాబోతోంది. శనివారం జరిగిన భారతీయ అన్ని భాషల్లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో ఈ చిత్రం విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో ఈ చిత్రానికి సంబంధించిన టిజర్ విడుదల ప్రెస్‌మీట్‌లో ఈ యానిమేషన్ మూవీ హైలైట్స్ తెలిపారు చిత్రబృందం.

## 'వానర' టైటిల్ 'వనవీర'గా మార్పు



అవినాష్ తిరువీధుల హీరోగా, దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా 'వనవీర'. ఈ చిత్రంలో సిమ్రాన్ చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. నందు ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. 'వనవీర' చిత్రాన్ని శంతను పత్తి సమర్పణలో సిల్వర్ స్క్రీన్ సినిమాస్ బ్యానర్‌పై అవినాష్ బుయానీ, ఆలపాటి రాజా, సి.అంకిత్ రెడ్డి నిర్మిస్తున్నారు. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్, వివేక్ సాగర్ మ్యూజిక్ అందించారు. మైథలాజికల్ రూరల్ డ్రామా కథతో తెరకెక్కిన 'వనవీర' సినిమా న్యూ ఇయర్ సందర్భంగా జనవరి 1న థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. నటుడు హర్ష, నటుడు బాబీ, డీవోపీ ఛోటా కె ప్రసాద్, హీరోయిన్ సిమ్రాన్ చౌదరి, నిర్మాత శంతను పత్తి, ప్రొడ్యూసర్ రాజేష్ దండా పాల్గొన్నారు.

## అమెరికాలో 'షో'లు పెరుగుతున్నాయ్

నటుడు శివాజీ



లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని రూపొందించిన తాజా చిత్రం 'దండోరా'. ఈ చిత్రంలో శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, అదితి భావరాజు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ సినిమాకు మురళీకాంత్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం డిసెంబర్ 25న విడుదలైన సందర్భంగా 'దండోరా' మూవీ సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ మీట్‌లో నటుడు శివాజీ మాట్లాడుతూ.. హనుమాన్ ప్రొడ్యూసర్ ఈ సినిమా చూసి ప్రొడ్యూస్ చేయటానికి వచ్చారు. నీలకంఠగారైతే తరాలకొకసారే ఇలాంటి సినిమా వస్తుందన్నారు. ఈ సినిమా గురించి 2026 మొత్తం మాట్లాడుకుంటారు. నార్త్ అమెరికాలో షోలు బాగా పెరిగాయి. ఒక షో పెట్టినవాళ్లు.. మూడు షోస్‌కు పెంచారు. మలయాళ సినిమా డైరెక్టర్స్, మారి సెల్వరాజ్ వంటి డైరెక్టర్‌తో పోల్చి మురళీకాంత్ గురించి మాట్లాడుతున్నారంటే.. మాకు చాలా గర్వంగా ఉంది. ప్రతీ క్యారెక్టర్ చూస్తే అద్భుతమైన నటులు వస్తున్నారని తెలుస్తుంది. ప్రతి పాత్ర బాగా కుదిరింది. ఈ సినిమా షూటింగ్ చేస్తున్నన్ని రోజులు నేను రోజుకి 2 గంటలే పడుకునేవాడిని. ఇందులో నాకు కొడుకు, కూతురు.. పాత్రలుంటాయి. వాటిని బ్యాలెన్స్ చేయాలంటే పాత్రలో ఆ లుక్ కనిపించాలి. డైరెక్టర్ అడగకపోయినా నేను కష్టపడ్డాను. అందరూ ప్రాణం పెట్టి చేసిన సినిమా ఇది. అందరూ ఈ సినిమాను భుజాలకెత్తుకున్నారన్నారు.

## 'శ్రీనివాస మంగాపురం' తొలి షెడ్యూల్ పూర్తి



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, దివంగత రమేష్ బాబు కుమారుడు, సూపర్ స్టార్ మహేష్ బాబు అన్న కొడుకు జయ కృష్ణ ఘట్టమనేని నటిస్తున్న లవ్ స్టోరీ 'శ్రీనివాస మంగాపురం'. ఈ సినిమాతో జయకృష్ణ హీరోగా లాంచ్ అవుతున్నారు. అజయ్ భూపతి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను వైజయంతి మూవీస్ అశ్విని దత్ సమర్పిస్తున్నారు. చందమామ కథలు బ్యానర్‌పై పి.కిరణ్ నిర్మిస్తున్నారు. చిత్ర బృందం ఇప్పుడు 30 రోజుల పాటు సాగిన మొదటి షెడ్యూల్‌ను పూర్తి చేసింది. ఈ షెడ్యూల్లో 30 శాతం చిత్రీకరణ పూర్తయింది. ఈ షెడ్యూల్లో చిత్ర బృందం మధ్యప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో కీలక సన్నివేశాలు, అద్భుతమైన పాటలు, ముఖ్యమైన టాకీ పార్ట్‌ను చిత్రీకరించింది. పూర్తి ఉత్సాహంతో వున్న చిత్ర బృందం త్వరలో ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయడానికి సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి జి.వి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. తదుపరి షెడ్యూల్ సంక్రాంతి తర్వాత ప్రారంభం కానుంది.

## 'ఈషా' సక్సెస్ మీట్



నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్‌పై 'ఈషా' అనే హారర్ థ్రిల్లర్ను ఇటీవల విడుదల చేశారు. అఖిల్‌రాజ్ త్రిగుణ్ హీరోలుగా నడిచిన ఈ చిత్రంలో హెబ్బా పటేల్ కథానాయిక. ఈ చిత్రాన్ని హెచ్వీఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మించారు. శ్రీనివాస్ మన్నె దర్శకత్వం వహించిన ఈ సినిమా సక్సెస్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత బన్నీవాస్ మాట్లాడుతూ ఒక సినిమా హిట్ అనడానికి వసూళ్లు ప్రామాణికం, ఈ చిత్రం మొదటిరోజు రెండు కోట్ల 20 లక్షలు గ్రాస్‌ను వసూలు చేసింది. చిన్న చిత్రాల్లో ఇది రికార్డు. చాలా చిన్న బడ్జెట్‌తో తీసిన చిత్రమిది. రెండో రోజు కలెక్షన్లు ఈసినిమా తగ్గలేదు. ఈ హాలీడేస్‌లో ఈ సినిమా గట్టి వసూళ్లు ఉంటాయి. ఈ సినిమాపై ఎవరికైనా సందేహాలు ఉంటే ఈ చిత్రం వసూళ్లు చూస్తే వాళ్ల సందేహాలు తీరిపోతాయి. ఫైనల్‌గా బాక్సాఫీస్ విన్నర్‌గా నిలిచిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ సినిమాగా చెప్పుకోవచ్చు. ఇక ఆడియన్స్ థియేటర్స్‌కు వచ్చి ఈషా సినిమాను ఎంకరైజ్ చేయడం ఆనందంగా ఉందన్నారు.



## 'వందేమాతరం' గేయం స్వాతంత్య్ర పోరాటానికి ప్రాణం

కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: 'వందేమాతరం' గేయం భారత దేశ స్వాతంత్య్ర పోరాటానికి ప్రాణం పోసిందని, కులం, మతం, ప్రాంతం అనే బేదాలను పక్కన పెట్టి 'దేశమే ప్రథమం అనే భావనను పెంపొందించిందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. వందేమాతర గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లోని వివేక వర్ధిని కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో దేశభక్తి భావనను పెంపొందించేందుకు వందేమాతరం ఒక ప్రేరణాత్మకమైన రణనినాదంగా నిలిచిందన్నారు. ఎందరో మహానుభావులు, వందేమాతరం స్ఫూర్తితో నిజాంకు వ్యతిరేకంగా పోరాడారని, అనేక త్యాగాలు చేశారన్నారు. హైదరాబాద్ సంస్థానంలో వందేమాతర ఉద్యమంలో విభిన్న బావ జాలాలు కలిగిన అనేక సంఘాలన్నీ, రాజకీయ భావజాలాన్ని పక్కనపెట్టి 'ఐక్యపోరాటాన్ని' ప్రారంభించాయని వివరించారు. 'వందేమాతరం' చరిత్రను అంద రూ తెలుసుకుని స్ఫూర్తిని పొందాలని కిషన్ రెడ్డి తెలిపారు. వందేమాతర నినాదం రెండు పదాలు మాత్రమే కాదని, దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించేందుకు పెద్దలు పడిన తపన, తాపత్రయానికి, వారు చేసిన స్వార్థం లేని త్యాగానికి, భరత జాతి ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు.

## అన్ని క్రీడలకూ ప్రభుత్వం ప్రోత్సాహం



మంత్రి వాకటి శ్రీహరి

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో అన్ని క్రీడలకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం ఇస్తుందని తెలంగాణ క్రీడా శాఖ మంత్రి వాకటి శ్రీహరి అన్నారు. యువత పెడదోవ పట్టకుండా క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. పుణె వేదికగా జరగబోతున్న గ్లోబల్ సైక్లింగ్ ఈవెంట్ ట్రోఫీ టూర్ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ టూర్‌కు సంబంధించిన ట్రోఫీ, జెర్సీలను శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇలాంటి గ్లోబల్ ఈవెంట్ ఇండియాలో జరగడం గర్వకారణమన్నారు. బజాజ్ పుణే గ్రాండ్ టూర్ భారత్‌లో తొలి, యుసి ఐ క్లాస్ 2.2 అంతర్జాతీయ స్టేజ్ సైక్లింగ్ రేస్ రూపకల్పన చేసిన నిర్వాహకులను అభినందించారు. పూణే నుండి ప్రారంభమైన ఈ పోటీలో యుసిఐలో నమోదు అయిన జాతీయ, అంతర్జాతీయ జట్లు పాల్గొంటున్నాయని, కార్యక్రమం ద్వారా భారత్ ప్రొఫెషనల్ గ్లోబల్ రోడ్ సైక్లింగ్ వ్యవస్థలో అధికారికంగా అడుగు పెట్టడం సంతోషదాయకమన్నారు. ముమ్ముందు తెలంగాణ రాష్ట్రం నుండి కూడా ఈ పోటీలను ప్రారంభించడానికి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఈ పూణే గ్రాండ్ టూర్ ప్రారంభించడం అభినందనీయమని, ప్రభుత్వాలు ఏవైనా క్రీడలను ప్రోత్సహిస్తున్నందుకు అభినందనలు తెలపాల్సిందేనన్నారు. భవిష్యత్తులో భారత్.. ప్రపంచ స్థాయి యుసిఐ ఆమోదిత స్టేజ్ రేస్‌లను నిర్వహించగల సామర్థ్యాన్ని సాధించేందుకు ఇది తోడ్పాటును అందిస్తుందని తెలిపారు. బజాజ్ పుణే గ్రాండ్ టూర్‌కు 40కి పైగా దేశాల నుంచి పాల్గొనడం గర్వకారణం అని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణలో క్రీడలకు, క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహం ఇస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణలో ఏ లాంటి క్రీడా ఈవెంట్ నిర్వహించినా ప్రభుత్వం తరపున పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు సాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మల్లా రెడ్డి, రేస్ టెక్నికల్ డైరెక్టర్ పినాకి బైసాక్, అథ్లెట్స్ కమిషన్ ఆఫ్ సిఎఫ్ఐ మ్యాక్స్‌వెల్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఆటా' సేవలతో తెలుగు సంస్కృతికి ప్రపంచ గుర్తింపు

ఆటా వేడుకలు గ్రాండ్ ఫినాలేలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : తెలుగు భాషకు, సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొస్తున్న అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) సేవలను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో 'ఆటా వేడుకలు–2025 గ్రాండ్ ఫినాలే' అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. విదేశాల్లో నివసిస్తున్న తెలుగు వారు తమ మూలాలను మరవకుండా సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తరతరాలకు అందించడం అభినందనీయమన్నారు. 'ఆటా' నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు, విద్యా, వైద్య, సామాజిక సేవా రంగాల్లో చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. అనంతరం వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు ఆటా అవార్డులు ప్రదానం చేశారు. ఈ సం దర్భంగా 'ఆటా జీవిత సాఫల్య పురస్కారం'ను ప్రముఖ దర్శకులు ఏ.కోదండరాం రెడ్డికి గవర్నర్ అందజేశారు. ఈ వేడుకలకు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్ర రావు, ఎంఎల్‌ఎ మల్లారెడ్డి, కార్పొరేషన్ చైర్మెన్లు నరసింహారెడ్డి, పటేల్ రమేష్ రెడ్డి ఆటా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో ఆటా అధ్యక్షులు జయంత్ చల్లా, కాబోయే అధ్యక్షులు సతీష్ రామసహాయం రెడ్డి, రీజినల్ కో–ఆర్డినేటర్ వేణుగోపాల్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## 'విబి-జిరామ్‌జి'ని వ్యతిరేకిస్తున్నాం

ఉపాధి హామీ పథకం రాష్ట్ర ఉద్యోగుల జెఎసి ప్రకటన



ప్రజాపక్షం/హైదరాబాద్: మహాత్మాగాంధీ జాతీ య గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్ చట్టాన్ని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రాష్ట్ర ఉద్యోగుల జెఎసి వ్యతిరేకించింది. అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తామని వెల్లడించింది. ఈ మేరకు జెఎసి చైర్మన్ ఎలబద్రి లింగయ్య ఆధ్వర్యంలో జెఎసి ప్రతినిధులు రాష్ట్రపంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్కను హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా కొత్త చట్టం ద్వారా ఉపాధి హామీ పథకం అసలు లక్ష్యాలను నిర్వీర్యం చేసే ప్రమాదం ఉందని, కూలీలకు హామీ ఉన్న ఉపాధి, వేతన భద్రత దెబ్బతింటుందని జెఎసి ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. 60:40 శాతం నిష్పత్తి విధించడం వల్లఈ పథకం అమలు కష్టసాధ్యమవుతుందని తెలిపారు. ఉపాధి హామీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని జెఎసి ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర జెఎసి నాయకులు మోహన్ రావు, అంజిరెడ్డి, రాజశేఖర్, మురహరి విజయకుమార్, వెంకటరామరెడ్డి, గిరి గౌడ్, రామకృష్ణ, రఘు, గురు చరణ్ సింగ్, కృష్ణ గౌడ్ తదితరులు ఉన్నారు.

## దొంగల హల్‌చల్ (మొదటి పేజీ తరువాయి)

నాలుగు లక్షలు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా నాల్గవ టౌన్ పరిధిలోని ఆర్యనగర్ ప్రాంతంలోని డీసీబీ బ్యాంకు ఎటిఎంలో దొంగలు చొరబడి 27 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను కట్ చేసి దాదాపు 30 లక్షలు ఎత్తుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఇన్‌చార్జి ఎం.రాజేష్ చంద్ర సంఘటన స్థలాన్ని పర్యవేక్షించారు. ఎటిఎంల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి చోరీ జరిగిన విధానం, ప్రవేశ నిష్క్రమణ మార్గాలను అధ్యయనం చేశారు. ఎటిఎంలోపలి పరిసర ప్రాంతాల సీసీటీవీ దృశ్యాలను సేకరించి విశ్లేషణకు ఆదేశించారు. క్లూస్‌టీమ్, సాంకేతిక నిపుణులు, స్థానిక పోలీస్ బృందాలతో ఐదు ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేశారు. రాత్రివేళ్లో ముఖ్యంగా ఎటిఎంలు, బ్యాంకులు, జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో మొబైల్ పెట్రోలింగ్ పెంచారు. జిల్లాలో ప్రవేశ నిష్క్రమణ పాయింట్లలో చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. ఎటిఎం భద్రతను బలోపేతం చేయడానికి బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకుని అలారం వ్యవస్థలు అదనపు సీసీటీవీలు లైటింగ్ మెరుగుదలపై సూచనలు ఇచ్చారు. జిల్లాలో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసుశాఖ అప్రమత్తంగా ఉందని ప్రజలకు భరోసా కల్పించారు. నిందితుల గుర్తింపు, పట్టుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని దర్యాప్తు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ చర్యలతో నగరంలో భద్రత మరింత బలోపేతం చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయడమే లక్ష్యంగా పోలీసుశాఖ పని చేస్తుందన్నారు. సంఘటన స్థలాన్ని ఇన్‌చార్జి సీపీతో పాటు జిల్లా అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, 4వ టౌన్ ఎస్‌హెచ్‌ఓ సతీష్‌కుమార్, సిఐ శ్రీనివాస్‌రాజ్, ఎస్సై గంగాధర్, బ్యాంకు మేనేజర్ శివకుమార్ ఉన్నారు.

## బాంబుదాడి

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రవాదం'గా అభివర్ణించి, ప్రభుత్వాన్ని బాధ్యుడిగా చేసింది. సిరియా ప్రభుత్వం దీన్ని 'పాత రెజీమ్ శేషాలు, ఐఎస్ మిలిటెంట్లు స్థిరత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం'గా చెప్పి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తమ నిర్ణయాన్ని పునరుద్ఘాటించింది. ఐక్యరాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి అంటోనియో గుటెరెస్ ఈ దాడిని ఖేదిస్తూ, నిందితులను శిక్షించాలని డిమమాండ్ చేశారు. మసీదు డిప్యూటీ ఇమామ్ ప్రకారం, ప్రార్థన జరుగుతున్నప్పుడు భారీ పేలుడు జరగడంతో, భయానక వాతావరణం ఏర్పడింది. మసీదులోని ఒక ప్రాంతంలో నిప్పు అంటుకోవడంతో ఖురాన్ కాపీలు దగ్ధమయ్యారు. ఈ ఘటనలో గాయపడనవారిని బయటకు తీసుకువచ్చారు. సౌదీ అరేబియా, జోర్డాన్, లెబనాన్ వంటి పొరుగు దేశాలు కూడా ఈ ఘటనను ఖండించాయి. ఇది సిరియాలో ఐఎస్ వ్యతిరేక క్రాక్‌డౌన్, అలెప్పోలో కుర్దిష్ ఫోర్సెస్‌తో ఘర్షణలు కొనసాగుతున్న సమయంలో చోటు చేసుకుంది. దేశంలో స్థిరత్వానికి మరో సవాలుగా మారింది.

## విస్తృత ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)



ఎనిమిదివేల మంది జనసేవా దళ్ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వగా మరి కొంత మందికి రానున్న రెండు మూడు రోజుల్లో శిక్షణ పూర్తి చేయనున్నట్లు జనసేవాదళ్ బాధ్యులు తెలిపారు. ప్రత్యేకమైన డ్రెస్‌లో ప్రదర్శన ముందు భాగాన జనసేవాదళ్ కార్యకర్తలు కవాతు చేయనున్నారు. జనవరి ఎనిమిది నుంచి అన్ని మండలాల్లో మోటార్ సైకిల్ ర్యాలీలు నిర్వహించనున్నారు. తొమ్మిదిన ఖమ్మం నగరంలో జనవరి 18న జరిగే బహిరంగ సభ జయప్రదం కోరుతూ భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నారు. తొమ్మిదిన ఉదయం తొమ్మిది గంటలకు సిపిఐ గ్రామశాఖలు, పట్టణ శాఖల ఆధ్వర్యంలో ప్రభాతభేరీ మ్రోగించాలని జిల్లా కమిటీ నిర్ణయించింది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శతాబ్ది ఉత్సవ సభ జయప్రదం కోరుతూ ముగ్గుల పోటీలను నిర్వహించి మహిళల్లో సభ చారిత్రిక నేపథ్యాన్ని వివరించి ఆహ్వానించాలని నిర్ణయించారు. ఖమ్మం నగరంలో అన్ని ప్రాంతాల్లో బహిరంగ సభ వివరాలు, చారిత్రిక నేపథ్యాన్ని తెలుపుతూ ప్రత్యేక ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని నగరం మొత్తాన్ని తోరణాలతో అలంకరించాలని నిర్ణయించారు. ఈనెల మూడు నుంచి ఆరవ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా జీబుజాతాలను నిర్వహించాలని నిర్ణయించగా ఈ కార్యక్రమానికి జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు, సీతామహాలక్ష్మిలు జాతాకు నాయకత్వం వహించనున్నారు. ఈ జాతాల సందర్భంగా జరిగే సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్‌లు హాజరుకానున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com